www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 22-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 114
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి ఉ.7.06, త్రయోదశి తె.4.39 వరకు; నక్షత్రం: మృగశిర రా.7.25 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: తె.3.17-4.47; దుర్ముహూర్తం: ఉ.8.29-9.21, రా.10.26-11.09; అమృతఘడియలు: ఉ.11.14-12.43; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.48
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కవితా శరధి.. కవి దాశరథి



కలంతో సమాజాన్ని జాగృతం చేసిన ఉద్యమ శీలి
నిజాం నిరంకుశ పాలనపై కురిసిన కవితా 'అగ్నిధార'
నేడు దాశరథి కృష్ణమాచార్య శత జయంతి 12
కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి కృష్ణమాచార్య అవార్డు
నేడు రవీంద్రభారతిలో సీఎం చేతుల మీదుగా అందజేత

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా!

పార్లమెంటు సమావేశాల తొలి రోజే ఉపరాష్ట్రపతి సంచలన నిర్ణయం

- అనారోగ్యం వల్లేనంటూ రాష్ట్రపతికి లేఖ.. రెండేళ్ల పదవీకాలం ఉండగానే విరమణ
- అనారోగ్యం కాదు... రాజకీయ కారణాలే.. ధన్‌ఖడ్ నిర్ణయంపై విశ్లేషకుల అంచనా
- సెప్టెంబరు 19లోపు కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక.. అప్పటిదాకా డిప్యూటీ చైర్మన్‌కు బాధ్యతలు


సోమవారం రాజ్యసభలో జగదీప్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాల రీత్యా వైద్య సలహా మేరకు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాల తొలి రోజే ఆయన ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఉప రాష్ట్రపతి స్వయంగా తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించడం దేశ రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. సోమవారం సాయంత్రం వరకు రాజ్యసభలో క్రియాశీలంగా ఉన్న ఉప రాష్ట్రపతి ఆకస్మికంగా రాజీనామా చేసేందుకు అనారోగ్యమే కారణం కాకపోవచ్చునని, దాని వెనుక రాజకీయ కారణాలుండవచ్చునని దేశ రాజధానిలో చర్చలు జరుగుతున్నాయి. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద తాను రాష్ట్రపతికి రాజీనామా లేఖను సమర్పించానని జగదీప్ దన్‌ఖడ్ వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చేందుకు వైద్య సలహాను అనుసరించి తాను వెంటనే రాజీనామా చేస్తున్నట్లు ఆయన రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. తాను ఉప రాష్ట్రపతిగా ఉన్న కాలంలో ఇచ్చిన మద్దతు, విశ్వాసం, గౌరవాలకు గాను ప్రధానమంత్రికి, ఎంపీలకు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మహోన్నత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉప రాష్ట్రపతిగా తాను ఎన్నో అమూల్యమైన అనుభవాలు, అంతర్గత విషయాలను తెలుసుకున్నానని ఆయన చెప్పారు. ఈ కీలక సమయంలో దేశంలో చెప్పుకోదగ్గ ఆర్థిక ప్రగతి, అసాధారణమైన అభివృద్ధిని చూడగలగడం తనకెంతో సంతృప్తి ఇచ్చిందని తెలిపారు. దేశ చరిత్రలో ఈ పరిణామాత్మకమైన సమయంలో దేశ సేవ చేయడం తనకు లభించిన గౌరవంగా అభివర్ణించారు. ధన్‌ఖడ్‌కు వచ్చే ఏడాది ఏప్రిల్‌తో 75 ఏళ్లు పూర్తవుతాయి. వెంకయ్యనాయుడు తర్వాత 2022లో ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన దన్‌ఖడ్ నిజానికి 2027 ఆగస్టు 10 వరకు పదవిలో

మిగతా 2వ పేజీలో...


కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, వివేక్, దామోదర, శ్రీధర్‌బాబు

25 నుంచి రేషన్‌కార్డులు

ఆగస్టు 10 వరకు మండలాల వారీగా పంపిణీ

జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పాల్గొనాలి
మనకు రైతులే ముఖ్యం.. వారికంటే ఎవరూ ఎక్కువకాదు
అన్నదాతలకు నష్టం జరిగే పని ఎవరు చేసినా ఉపేక్షించం
ఎరువుల లభ్యతను ఎప్పటికప్పుడు రైతులకు తెలపాలి
కలెక్టర్లు ఉదయం 7 గంటలకే ఫీల్డ్‌లో ఉండాలి
ఏ రోజు ఏం చేశారనే వివరాలు నాకు పంపాలి
వాతావరణ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలపాలి
కలెక్టర్లకు అత్యవసర ఖర్చుల కింద వారి ఖాతాలో కోటి
కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

బీసీ రిజర్వేషన్లకు నమూనాగా తెలంగాణ!
దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలంటూ
ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న ఏఐసీసీ
24న ఢిల్లీకి రేవంత్‌రెడ్డి.. రాహుల్‌గాంధీ, ఖర్గేతో భేటీ

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 15 రోజుల పాటు మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలకు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వానికి రైతులే ప్రాధాన్యమని, వారి కంటే ఎవరూ ఎక్కువ కాదని స్పష్టం చేశారు. అన్నదాతలకు కష్టం, నష్టం జరిగే పని ఎవరు చేసినా ఉపేక్షించేదని లేదని హెచ్చరించారు. పంటల సాగుకు తగ్గట్టుగా ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని, ఎరువుల లభ్యత వివరాలను

మిగతా 13వ పేజీలో...

జీనోమ్ వ్యాలీలో అడ్వాన్స్‌డ్
టెక్నాలజీ సెంటర్
లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయో టెక్నాలజీలో ప్రత్యేక శిక్షణ
యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం
ఏటీసీల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయండి
గిగ్ వర్కర్లకు సంక్షేమ నిధి, ఆరోగ్య, ప్రమాద ఇన్సూరెన్స్ 13
కొత్త పాలసీ పకడ్బందీగా ఉండాలి: ముఖ్యమంత్రి రేవంత్
టైగర్ రిజర్వ్‌పై వెనకడుగు
జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం 3

అన్ని హద్దులూ దాటేస్తున్నారు!

రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ దుర్వినియోగం: సుప్రీంకోర్టు
ముడా కేసులో కర్ణాటక సీఎం సిద్దరామయ్య భార్యకు ఊరట
క్లయింట్లకు సలహాపై లాయర్లకు ఈడీ సమన్లు.. సుప్రీం ఆగ్రహం
ఈడీ సూపర్ పోలీసు కాదంటూ మద్రాసు హైకోర్టు మొట్టికాయ
బెట్టింగ్ యాప్‌ల కేసులో రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్‌కు ఈడీ నోటీస్



న్యూఢిల్లీ, జూలై 21: రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)ని దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈడీ అధికారులు అన్ని హద్దులూ దాటేస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజకీయాల్లో పావుగా మారొద్దని ఈడీకి హితవు పలికింది. 'రాజకీయ యుద్ధాలను ఎన్నికల వరకే పరిమితం కానివ్వండి. ఇందులో మిమ్మల్ని ఎందుకు వాడుకుంటున్నారు?' అని ఈడీని ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయాలకు కోర్టును వేదికగా మార్చొద్దని హెచ్చరించింది. ఈడీ గురించి తాము ఇంతకంటే కఠినంగా మాట్లాడేలా

మిగతా 10వ పేజీలో...


దుకాణం గదిలో దొంగలు తెరిచిన బీరువా

- నగల దుకాణానికి కన్నం

18 కిలోల బంగారు ఆభరణాల చోరీ

40 తులాల బంగారం బిస్కెట్లు, 19.5 లక్షల నగదు కూడా అపహరణ
సూర్యాపేటలో ఘటన 3
షాపు వెనుక వైపు నుంచి రంధ్రం
నగలు దాచిన గది షట్టర్, బీరువాను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన దొంగలు
యూపీకి చెందిన ముఠా పనే?

స్కూలుపై కూలిన విమానం

పైలట్ సహా 20 మంది దుర్మరణం
వారిలో అత్యధికులు విద్యార్థులు
171 మందికి గాయాలు 10
బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో దుర్ఘటన
సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కూలిన వాయుసేన శిక్షణ విమానం


ఢాకాలోని మైల్స్ స్టోన్ స్కూల్ వద్ద విమాన శకలాలు

రన్‌వే పక్కకు ఎయిరిండియా విమానం 10
ముంబైలో ఘటన.. ప్రయాణికులు సురక్షితం


లోక్‌సభలో నిరసన తెలుపుతున్న విపక్ష సభ్యులు

తొలిరోజే రభస

పహల్గాం అంశంపై స్తంభించిన పార్లమెంటు
ఉభయ సభల్లో కార్యకలాపాలు అడ్డుకున్న విపక్షం.. ఆపరేషన్ సిందూర్‌పైనా చర్చకు పట్టు
పహల్గాం హంతకులు ఆచూకీ ఏదన్న ఖర్గే
వచ్చేవారం 16 గంటల చర్చకు ప్రభుత్వం ఓకే
వ్యూహంపై మంత్రులతో చర్చించిన ప్రధాని
జస్టిస్ వర్మ తొలగింపు.. 204 మంది ఎంపీల సంతకాలు.. అభిశంసన ప్రక్రియ ప్రారంభం
'ఆపరేషన్ సిందూర్' మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది: ప్రధాని మోదీ
సభలో నా నోరు నొక్కేస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాద దాడి, అనంతరం పాకిస్థాన్ మీద భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశాలపై పార్లమెంటు ఉభయ సభల్లో అత్యంత కీలక ప్రశ్నలను లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. సోమవారం తొలి రోజే ఈ అంశంపై ఉభయ సభల్లో గందరగోళం జరిగింది. లోక్‌సభ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేక పోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు ప్రశ్నోత్తరాల సమయాన్ని బహిష్కరించాయి. పహల్గామ్ ఘటనకు

మిగతా 2వ పేజీలో...



కమ్యూనిస్టు దిగ్గజం
వీఎస్ అచ్యుతానందన్ కన్నుమూత

101 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానం
సాధారణ నేపథ్యం నుంచి ఉన్నత శిఖరాలకు..
82 ఏళ్ల వయసులో తొలిసారి సీఎంగా
అవినీతిని సహించని రాజీలేని వైఖరి..
సొంత పార్టీ నేతలపైనా విమర్శలు
ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్ సంతాపం 2

మిధాని డైరెక్టర్‌గా మధుబాల కల్లూరి

భారత్‌పై చైనా కుయుక్తులు!

ఎలక్ట్రానిక్స్ రంగంలో అనధికార వాణిజ్య ఆంక్షలు
ముఖ్య పరికరాలు, మినరల్స్‌పై నియంత్రణలు
తమ ఇంజినీర్లు వెనక్కి రావాలంటూ ఆదేశాలు
'ప్రపంచ తయారీ హబ్'గా భారత్ ఆవిర్భావాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా..
ప్రమాదంలో రూ. 2.75 లక్షల కోట్ల ఫోన్ల ఎగుమతి
ఐసీఈఏ ఆందోళన.. కేంద్రానికి లేఖ



న్యూఢిల్లీ, జూలై 21: ఎలక్ట్రానిక్స్ రంగంలో భారతదేశ ఎదుగుదలను చూసి ఓర్వలేని చైనా.. కుయుక్తులకు పాల్పడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమైన పరికరాలు, మినరల్స్‌పై నియంత్రణలు, 'భారత్‌ను వీడి వచ్చేయండి' అంటూ తమ దేశ నైపుణ్య సిబ్బందికి ఆదేశాలిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియా సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) కేంద్ర ప్రభుత్వానికి ఓ లేఖ రాసింది. చైనా 'అనధికార వాణిజ్య ఆంక్షలకు' పాల్పడుతోందని పేర్కొంది. చైనా రహస్య చర్యలు భారతదేశ ప్రపంచ

మిగతా 10వ పేజీలో...


ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

ఎలా హామీ ఇచ్చారో.. అలా అమలు చేయండి

కేంద్రంపై నిందలు వేయడం అన్యాయం
42% బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ బాధ్యత
9వ షెడ్యూల్లో చేర్చాలంటే చిక్కులున్నాయ్
న్యాయ సమీక్ష చేస్తామని సుప్రీం చెప్పింది
బిల్లు పెట్టినపుడు 9వ షెడ్యూల్ అనలేదేం?
మధ్యప్రదేశ్‌లో 50% పైగా రిజర్వేషన్లు
ఆ దారిలో వెళ్లండి: రాంచందర్‌రావు
నేడు అమిత్ షా, జేపీ నడ్డాతో భేటీ

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడానికి న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని, అది తెలిసీ బీసీలను తప్పుదోవ పట్టిస్తూ వారి ప్రయోజనాలతో కాంగ్రెస్ చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చిన ప్రతీ అంశాన్నీ

మిగతా 14వ పేజీలో...

బైక్‌ను ఢీకొన్న కారు..
డ్యాంలో పడ్డ యువకుడు

జూరాల ప్రాజెక్టు మీద ఘటన
స్నేహితులతో కలిసి డ్యాం వద్దకు మహేశ్
బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఢీకొన్న కారు
డ్యాంలో పడ్డ మహేశ్.. ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు 3



బరాక్ ఒబామా అరెస్ట్!

ఏఐ వీడియోను పోస్ట్ చేసిన ట్రంప్ 10
ఎప్‌స్టీన్ వ్యవహారం నుంచి దృష్టి మళ్లించేందుకేనా.. ట్రంప్ తీరుపై విమర్శలు

అందిన అభిశంసన తీర్మానాలు!

- జస్టిస్ వర్మను తొలగించాలని 204 మంది సంతకాలు
- లోక్‌సభలో 152 మంది, రాజ్యసభలో 52 మంది
- అభిశంసన ప్రక్రియను ప్రారంభించిన రాజ్యసభ

న్యూఢిల్లీ, జూలై 21: వివాదాస్పద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించడానికి ఉద్దేశించిన అభిశంసన ప్రక్రియ మొదలైంది. ఆయన్ను పదవి నుంచి తొలగించే తీర్మానాన్ని చేపట్టాలని కోరుతూ 152 మంది ఎంపీలు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించారు. ఈ తీర్మానానికి పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యుల నుంచి మద్దతు లభించింది. దానిపై సంతకం చేసిన వారిలో బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, జేడీయూ, సీపీఎం ఇతర పార్టీల సభ్యులున్నారు. లోక్‌సభలో వంద, రాజ్యసభలో 50 మంది సభ్యులు కోరుకుంటే సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి మీద అభిశంసన ప్రక్రియ మొదలు పెట్టొచ్చు. లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ చైర్మన్‌లలో ఎవరైనా అభిశంసన ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లాలి. ఈసారి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆ బాధ్యతను తీసుకున్నారు. అభిశంసనకు అవసరమైన చర్యలు తీసుకోమ్మని రాజ్యసభ సెక్రెటరీ జనరల్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా, తానేమీ తప్పు చేయలేదని జస్టిస్ వర్మ అంటున్నారు. సుప్రీంకోర్టు కమిటీ అభిశంసన సిఫార్సును సవాలు చేస్తూ ఇప్పటికే ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఐదేళ్లలో 610 కళాఖండాలు స్వాధీనం

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీ, థాయిలాండ్, యూకే, యూఎస్ఏ నుంచి మొత్తం 610 భారతీయ కళాఖండాలను స్వాధీనం చేసుకున్నామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. సోమవారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ అడిగిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా గోలింగేశ్వర ఆలయానికి సంబంధించిన నంది శిల్పాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మధుబాల కల్లూరికి అభినందనలు తెలుపుతున్న మిధానీ ఉద్యోగులు

మిధాని డైరెక్టర్‌గా మధుబాల కల్లూరి

చంపాపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధానీ) డైరెక్టర్(ఫైనాన్స్)గా మధుబాల కల్లూరి బాధ్యతలు స్వీకరించారు. పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెలక్షన్ బోర్డు పలు అంశాలను పరిగణలోకి తీసుకుని ఆమెను ఈ హోదాకు ఎంపిక చేసింది. అగ్రగామి ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 8 మంది అభ్యర్థులు ఈ హోదా కోసం మధుబాలతో పోటీ పడ్డారు. ఆమె నియామకం భారతీయ వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలలోని సీనియర్ లెవల్ ఉద్యోగాలలో పెరుగుతున్న మహిళల ప్రాధాన్యతకు నిదర్శనంగా చూడాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతర్గత ప్రతిభను ప్రోత్సహించాలనే సంస్థ సంస్కృతికి దర్పణంగా ఈ నియామకం నిలుస్తుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆమె ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్ కామర్స్ పట్టాను అందుకున్నారు. ఆ సమయంలోనే ఐసీడబ్ల్యూఏఐ కోర్సును కూడా చేశారామె. 1993లో మిధానీలో అకౌంట్స్ ఆఫీసర్‌గా చేరిన మధుబాల 32ఏళ్ల పాటు వివిధ హోదాలలో విధులు నిర్వర్తించారు. జనరల్ మేనేజర్(ఫైనాన్స్)హోదాలో కూడా సంస్థకు సేవలందించారు. ప్రస్తుత హోదాలో భాగంగా అన్ని రకాల ఫైనాన్స్, అకౌంట్స్ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటుగా విధాన సూత్రీకరణ, బడ్జెటింగ్, ఆర్థిక ప్రణాళిక, రిస్క్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలకు బాధ్యత వహించనున్నారు. నేరుగా మిధానీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు నివేదికలను అందించనున్నారు. 2027, ఆగస్టు 31 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు.

అధిక పింఛను దరఖాస్తుల్లో 11,01,582 తిరస్కరణ

న్యూఢిల్లీ, జూలై 21: ఈపీఎఫ్‌వో అధిక వేతనాలపై పింఛను కోసం వచ్చిన 15,24,150 దరఖాస్తులలో దాదాపు 98.5 శాతం పరిష్కరించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల సహాయ మంత్రి శోభా కరంద్లాజే లోక్‌సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలను వెల్లడించారు. అధిక వేతనాలపై పింఛనుకు అర్హులైన దరఖాస్తుదారులకు ఈపీఎఫ్‌వో ఇప్పటివరకు 4,00,573 డిమాండ్ లేఖలను జారీ చేయగా, 11,01,582 దరఖాస్తులను తిరస్కరించింది. ఇంకా 21,995 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు.

ఈ ఏడాది ప్రథమార్థంలో రూ.18,662 కోట్ల క్రిప్టోల చౌర్యం

న్యూఢిల్లీ, జూలై 21: ప్రపంచవ్యాప్తంగా క్రిప్టోల దొంగతనాలు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా దేశీయ క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ కాయిన్‌డీసీఎక్స్‌పై గతవారం దాడి చేసిన సైబర్ నేరగాళ్లు ఏకంగా 4.42 కోట్ల డాలర్ల (సుమారు రూ.378 కోట్లు) క్రిప్టో కరెన్సీలను దొంగిలించారు. దీనికన్నా ముందు.. ఈ ఏడాది ప్రథమార్థం(జనవరి-జూన్)లో ప్రపంచవ్యాప్తంగా 217 కోట్ల డాలర్ల (రూ.18,662 కోట్లు) క్రిప్టో దొంగతనాలు జరిగాయి. ఈ విషయాన్ని బ్లాక్ చెయిన్ అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ చైనాలిసిస్ నివేదిక వెల్లడించింది. బైబిట్ ఎక్స్ఛేంజ్‌లో జరిగిన 150 కోట్ల డాలర్ల చోరీ ఇప్పటివరకు క్రిప్టో పరిశ్రమ చరిత్రలోనే అత్యధికమని, ఈ ఏడాదిలో జరిగిన మొత్తం క్రిప్టో దొంగతనాల్లో 69 శాతానికి సమానమని రిపోర్టు వెల్లడించింది. ఇదిలా ఉండగా, సైబర్ దాడిలో నష్టపోయిన 4.42 కోట్ల డాలర్లను రికవరీ చేసుకునేందుకు కాయిన్‌డీసీఎక్స్ నజరానా ప్రకటించింది. ఈ దొంగతనానికి పాల్పడిన వారి జాడ తెలిపిన లేదా రికవరీకి తోడ్పడే సమాచారం అందించిన వారికి తిరిగి రాబట్టిన సొత్తులో 25% ఇస్తామని తెలిపింది.

పెళ్లయి 25 ఏళ్లయిన మహిళ 25 ఏళ్ల మేనల్లుడితో ప్రేమలో!

- భర్త, నలుగురు పిల్లలను వదిలేసి అతడితో పరార్

లఖ్‌నవూ, జూలై 21: పాతికేళ్లక్రితం పెళ్లయి నలుగురు పిల్లలున్న ఆ మహిళకు తన మేనల్లుడైన పాతికేళ్ల యువకుడితో ప్రేమ పుట్టింది. భర్తను కాదని ఆ యువకుడితోనే తన జీవితం అనుకున్న ఆమెకు పెళ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలున్నారు! పెద్దమ్మాయి వయసు ఇరవై ఏళ్లు.. రెండో అమ్మాయి వయసు పద్దెనిమిదేళ్లు! మరో ఇద్దరు అబ్బాయిల్లో ఒకరి వయసు 17 ఏళ్లు.. మరొకరి వయసు 10ఏళ్లు! కట్టుకున్న భర్తను, కడుపున పుట్టిన పిల్లలను కాదని ఒకానొక రోజు ప్రేమికుడితో కలిసి ఆమె ఇంట్లోంచి వెళ్లిపోయింది. యూపీలోని సిద్ధార్థనగర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ప్రియుడి వెంట ఆమె వెళ్లిపోవడంతోనే స్టోరీ ముగియలేదు. ఇక్కడి నుంచే ట్విస్టుల మీద ట్విస్టులతో కథ సాగింది! కుటుంబ పోషణ కోసం నెలలో చాలా రోజులు ఆ భర్త ఇంటికి దూరంగా ఉంటుంటే.. ఆ ఇంటికి ఆమె మేనల్లుడు(25) తరచూ వచ్చేవాడు! ఆ ఇల్లాలికి, ఆ యువకుడి మధ్య చనువు పెరిగి.. అది ఇద్దరి మధ్య ప్రేమకు దారితీసింది. గత ఏడాది ఆమె, తన ప్రియుడితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఇద్దరూ కోర్టులో పెళ్లి చేసుకున్నారు. దీనిపై ఆ భర్త, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొన్నాళ్లకు ఆ యువకుడితో గొడవలు తలెత్తడంతో ఆమె తిరిగి తన భర్త దగ్గరకు వచ్చేసింది. ఆమెను పెద్ద మనసుతో భర్త క్షమించేసి అక్కున చేర్చుకున్నాడు. అటు.. ఆమె ప్రియుడు కూడా ఇక ఎంతమాత్రం కలిసి ఉండే ప్రసక్తే లేదని పోలీసుల సాక్షిగా చెప్పాడు. అయితే కొన్నాళ్లకు.. ఆమె మళ్లీ ఇంట్లోంచి వెళ్లిపోయి ప్రియుడి చెంతకు చేరింది. ఆదివారం అతడిని వెంటబెట్టుకొని ఊరొచ్చేసింది. బంధువులు, గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. తనకు భర్త వద్దని, ప్రియుడితోనే కలిసి ఉండాలనుకుంటున్నట్లు పెద్దల ఎదుట ఆమె స్పష్టం చేసింది. 'నాతో కలిసి ఉండటానికి ఆమెకు ఇష్టంలేకపోతే.. ఆమెను నిరోధించే హక్కు నాకెక్కడిది?' అని చెబుతూ ప్రియుడితో కలిసి వెళ్లిపోయేందుకు భర్త అనుమతినిచ్చాడు.

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా!

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగాల్సి ఉన్నది. ఆయన పైకి అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేసినట్లు చెబుతున్నప్పటికీ అంతర్గత రాజకీయ కారణాల వల్ల ఆయన తప్పుకుని ఉండవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఇంతవరకూ ఏ ఉప రాష్ట్రపతీ మధ్యలో ఆరోగ్య కారణాల రీత్యా రాజీనామా చేయలేదని, ఆరోగ్యం దెబ్బతిన్న సందర్భాల్లో కూడా పదవిలో కొనసాగారని చెబుతున్నారు. ఇద్దరు ఉప రాష్ట్రపతులు మాత్రం రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీలుగా తమ పదవులకు మధ్యలో రాజీనామా చేశారు. వీరిలో వి.వి.గిరి 1969 జులై 20న రాజీనామా చేయగా, ఆర్.వెంకట్రామన్ కూడా రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు 1987 జులైలో రాజీనామా చేశారు. అయితే, ఈ ఏడాది మార్చిలో ధన్‌ఖడ్ గుండె సంబంధ సమస్యతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. గత నెల కుమాయు వర్సిటీ స్వర్ణోత్సవంలో పాల్గొంటూ స్పృహ తప్పి పడిపోయారు.



రాష్ట్రపతి ముర్ముతో ధన్‌ఖడ్(ఫైల్)

చివరి రోజు యాక్టివ్‌గా


నిజానికి సోమవారం రాజ్యసభ సమావేశమైనపుడు ధన్‌ఖడ్ మామూలుగా వ్యవహరించారని, సభను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారని రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అయిదుగురు కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ధన్‌ఖడ్ ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగాలన్న విపక్షాల డిమాండ్‌ను తోసిపుచ్చారు. జస్టిస్ వర్మ ఇంట్లో నోట్లు దొరకడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన ధన్‌ఖడ్ ఆయన మహాభియోగంపై రాజ్యసభలో చర్చ నిర్వహించాల్సి ఉంది. దీనిపై ప్రతిపక్షాలు సమర్పించిన నోటీసుకు ధన్‌ఖడ్ స్పందిస్తూ తాను రాజ్యాంగ నియమాల ప్రకారం నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తీర్మానం నోటీసుపై రాజ్యసభ సెక్రెటరీ జనరల్‌కు తగు చర్యలు తీసుకోమ్మని సమాచారం పంపారు. అంతా సవ్యంగానే జరుగుతున్నట్లు కనిపిస్తున్న సమయంలో జగదీప్ ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందన్న విషయం రాజకీయ వర్గాలకు అంతుబట్టకుండా ఉన్నది. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వానికీ, ప్రతిపక్షాలకూ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న రాజకీయంగా సున్నితమైన సమయంలో ధన్‌ఖడ్ రాజీనామా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

ధన్‌ఖడ్ స్థానంలో ఎవరు?

కొత్త ఉప రాష్ట్రపతిని 60 రోజుల్లో ఎన్నుకోవాల్సి ఉన్నందువల్ల ప్రభుత్వం త్వరలో అందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తుంది. సెప్టెంబరు 19 లోపు కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాల్సి వస్తుంది. అంతవరకూ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తాత్కాలికంగా చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రధాని మోదీ రాష్ట్రపతి ముర్ముతో సంప్రదించి ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తారు. రాజ్యాంగంలో రెండో ఉన్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ ఎవర్ని రంగంలోకి దించుతుందన్న విషయంపై రాజకీయంగా చర్చ ప్రారంభమైంది. ఉప రాష్ట్రపతి పదవిలో ఎవర్ని నియమించాలన్న విషయంపై మోదీ ఎన్డీఏ నేత లతో కూడా సంప్రదిస్తారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఉపరాష్ట్రపతిని ఉభయ సభల ఎంపీలు కలిసికట్టుగా ఎన్నుకుంటారు.

ఆరోగ్య కారణం నమ్మశక్యంగా లేదు

న్యూఢిల్లీ, జూలై 21: ధన్‌ఖడ్ రాజీనామాపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన చెబుతున్న కారణం నమ్మశక్యంగా లేదన్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఆయనతోనే ఉన్నానని, రాత్రి 7.30కు కూడా ఆయనతో ఫోన్లో మాట్లాడానని తెలిపారు. రాజీనామా వెనుక బయటకు చెప్పేది కాకుండా ఇంకేదో ఉందని అభిప్రాయపడ్డారు. దన్‌ఖడ్ అటు అధికార పక్షాన్ని, ఇటు విపక్షాన్ని సమానమైన స్థాయిలో లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారని గుర్తు చేసుకున్నారు. మంగళవారం పార్లమెంటు సభా వ్యవహారాల కమిటీ సమావేశానికి నేతృత్వం వహించి, న్యాయవ్యవస్థకు(జస్టిస్ వర్మ) సంబంధించి కీలక నిర్ణయాన్ని ప్రకటించాల్సిన ఆయన హఠాత్తుగా రాజీనామా చేయడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందని జైరాం రమేశ్ అన్నారు. ధన్‌ఖడ్ మరోసారి తన నిర్ణయంపై ఆలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రయోజనాల దృష్టిలో ప్రధాని కూడా జోక్యం చేసుకోవాలని కోరారు.



జరిమానా లేకుండా టీడీఎస్‌ను వాపసు చేయాలి

- ఐటీ బిల్లుపై 566 సూచనలు
- పార్లమెంటరీ కమిటీ నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ, జూలై 21: ఆదాయపు పన్ను చట్టం-2025లో పలు సవరణలు చేయాలని సూచిస్తూ పార్లమెంటరీ కమిటీ సోమవారం లోక్‌సభకు నివేదిక సమర్పించింది. లోక్‌సభలో బీజేపీ సభ్యుడు బైజయంత్ పండా ఆధ్వర్యంలోని 31 మంది సభ్యుల సెలెక్ట్ కమిటీ ఈ బిల్లుపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించింది. మార్పులు, సవరణలపై మొత్తం 566 సూచనలు చేసింది. ఇందులో 32 కీలక సిఫార్సులు ఉన్నాయి. నిర్వచనాలను సరళతరం చేసి, చట్టం సులభంగా అర్థమయ్యేలా ఉండాలని తెలిపింది. అందువల్ల 'మును పటి సంవత్సరం' (ప్రీవియస్ ఇయర్), 'అసెస్‌మెంట్ ఇయర్' (మదింపు సంవత్సరం) అన్న పదాలకు బదులుగా 'పన్ను సంవత్సరం' (ట్యాక్స్ ఇయర్) అన్న ఒక్క పదాన్నే ఉపయోగించాలని సూచించింది. 4,575 పేజీల ఈ నివేదికలో పన్ను మినహాయింపులపైనా సూచనలు చేసింది. తక్కువ ఆదాయం ఉండే ఉద్యోగులకు ఊరట కలిగించేలా కీలక సిఫార్సు చేసింది. పన్ను చెల్లించాల్సిన అవసరం లేనప్పటికీ కొందరు ఉద్యోగులకు టీడీఎస్ కింద జీతంలో పన్ను మినహాయిస్తారు. అనంతరం నిర్ణీత తేదీలోగా రిటర్నులు సమర్పిస్తే వసూలు చేసిన పన్నును తిరిగి చెల్లిస్తారు. ఒకవేళ రిటర్నులు సమర్పించడంలో జాప్యం జరిగితే జరిమానా విధిస్తారు. ఈ జరిమానాను ఇకపై విధించకూడదని సిఫార్సు చేసింది. మత-ధార్మిక సంస్థలకు గుప్తంగా లభించే అప్రకటిత విరాళాలకు పన్ను మినహాయింపులను కొనసాగించాలని సూచించింది. 'క్యాపిటల్ అస్సెట్', 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాపిటల్ కంపెనీ' వంటి నిర్వచనాలను ఆధునికీకరించాలని, 'వ్యాపార ఖర్చులు'లో అనే అంశంలో 'వాస్తవ చెల్లింపులు' అనే మాటను పునరుద్ధరించాలని కోరింది.

విజయోత్సవాలుగా పార్లమెంటు సమావేశాలు

- ఆపరేషన్ సిందూర్ మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 21: 'ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జరిగే చర్చలో పాలక కూటమి ఎంపీల వైఖరి ఏ విధంగా ఉండాలో ప్రధాని మోదీ ఉద్బోధించారు. ఈ సమావేశాలను విజయోత్సవాలుగా అభివర్ణించారు. ఈ సెంటిమెంటును పార్లమెంటు సభ్యులు ఏకకంఠంతో తెలియజేయాలని సూచించారు. సోమవారం ఉదయం సమావేశాలు ప్రారంభమవుతాయనగా పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశాలు గర్వించదగినవన్నారు. 'జాతికి ఇది విజయోత్సవం.ఆపరేషన్ సిందూర్‌తో మన సాయుధ బలగాల సామర్థ్యాన్ని ప్రపంచం కళ్లారా చూసింది. లక్ష్యాలను అవి నూరు శాతం సాధించాయి. మన బలగాలు ఆపరేషన్ సిందూర్‌తో కేవలం 22 నిమిషాల్లో ఉగ్రవాద బాస్‌లను వారి ఇళ్లలోనే భూస్థాపితం చేశాయి. మేడిన్ ఇండియా ఆయుధాల సత్తాను సిందూర్ చాటిచెప్పింది. మన ఆయుధ శక్తి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దేశంలో ప్రస్తుతం పలు సానుకూల పరిణామాలు నెలకొన్నాయి. నక్సలిజం శరవేగంగా అంతరిస్తోంది. రెడ్‌జోన్ హరిత వృద్ధి జోన్‌గా మారుతోంది. చాలా జిల్లాలు నక్సలిజం గుప్పిట నుంచి బయటకు వచ్చాయి. స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారతీయ పతాకం రెపరెపలాడుతోంది' అని తెలిపారు. ఉగ్రవాదుల యజమాని పాకిస్థాన్ ముసుగు తొలగించేందుకు అఖిల పక్ష ఎంపీలు ప్రపంచ దేశాలను సందర్శించి.. ఆపరేషన్ సిందూర్ అసలు లక్ష్యాన్ని వివరించేందుకు చేసిన కృషిని మోదీ అభినందించారు. రాజకీయ పార్టీలకు వేర్వేరు ఎజెండాలు ఉంటాయని..అయితే జాతీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాల్లో ఐకమత్యం అవసరమని సూచించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశంలో ఐక్యతను తాను చూశానన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మోదీ

ఆయన మీ స్నేహితుడా.. వర్మ అని పిలుస్తున్నారు..!

- లాయర్ నెడుంపారాపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 21: ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మను.. కేవలం 'వర్మ' అంటూ సంబోధించిన న్యాయవాదిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని.. తన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలంటూ న్యాయవాది మాథ్యూ నెడుంపారా కోర్టును కోరారు. తాను మూడోసారి ఈ పిటిషన్‌ను దాఖలు చేస్తున్నానని.. ఒక సమయంలో జస్టిస్ వర్మను కేవలం 'వర్మ' అని ఆయన సంబోధించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జస్టిస్ వర్మ మీకేమైనా స్నేహితుడా..? ఇప్పటికీ ఆయన హైకోర్టు న్యాయమూర్తిగానే ఉన్నారని మరిచిపోయారా?' అంటూ న్యాయవాది నెడుంపారాపై సీరియస్ అయ్యారు. దీంతో నెడుంపారా.. 'ఆ గొప్పతనం ఆయనకు వర్తించదు' అంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అయితే తమకు పాఠాలు చెప్పొదంటూ జస్టిస్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మరోసారి మండిపడింది. పిటిషన్ అత్యవసర విచారణకు నిరాకరించింది.

నకిలీ ఓటర్ల తొలగింపునకే బిహార్లో జాబితాల సవరణ

- సుప్రీంకోర్టుకు తెలిపిన ఈసీ

న్యూఢిల్లీ, జూలై 21: అధికార పక్షానికి మేలు కలిగించే విధంగా బిహార్‌లోని ఓటర్ల జాబితాలో సవరణలు చేస్తున్నారంటూ వస్తున్న విమర్శలను ఎన్నికల సంఘం మరోసారి తిరస్కరించింది. నకిలీ ఓటర్లను తొలగించాలన్న లక్ష్యమే తప్ప మరో ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు ప్రతిపక్షాలు దాఖలు చేసిన వ్యాజ్యాలకు సమాధానంగా సోమవారం ప్రమాణ పత్రాన్ని సమర్పించింది. ఓటరు జాబితా నుంచి నకిలీ ఓటర్లను తొలగించాలన్న రాజ్యాంగపర విధిని నిర్వర్తిస్తున్నట్టు తెలిపింది. దీనివల్ల అసలు ఓటర్లకు ఎలాంటి నష్టం ఉండబోదని పేర్కొంది.

యూజీసీ-నెట్ పరీక్ష ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 21: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జూన్ నెలలో నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, జూనియర్ రీసెర్చి ఫెలోషిప్, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్-జేఆర్ఎఫ్ కోసం 5,269 మంది ఎంపికయ్యారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం 54,885 మంది అర్హత సాధించారు. కేవలం పీహెచ్‌డీ ప్రవేశాల కోసం 1,28,179 మంది అర్హత పొందారు. పరీక్ష కోసం మొత్తం 10,19,751 మంది పేర్లు నమోదు చేసుకోగా అందులో 7,52,007 మంది రాశారు. 4,28,853 మంది పురుషులు పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 3,05,122 మంది పరీక్షకు హాజరయ్యారు. 5,90,837 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకోగా, 4,46,849 మంది పరీక్ష రాశారు.

తొలిరోజే రభస

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడ్డ ఉగ్రవాదులను ఇంతవరకు ఎందుకు నిర్బంధించడం కానీ, నిర్మూలించడం కానీ చేయలేదని, యుద్ధాన్ని తానే నిలిపివేయించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనలో ఆంతర్యమేమిటని ప్రతిపక్షాలు ప్రశ్నించనున్నాయి. ఉభయ సభలు తొలి రోజు వాయిదా వేసిన వెంటనే ప్రధాని మోదీ హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రిజిజు, బీజేపీ జాతీయాధ్యక్షుడు నడ్డా, ఆర్థిక మంత్రి నిర్మల, వ్యవసాయ మంత్రి శివరాజ్‌లతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను ఏ విధంగా నిర్వహించాలి? అన్న అంశంపైనే ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మోదీ ఈ వారం విదేశీ పర్యటనలో ఉన్నందువల్ల ఆపరేషన్ సిందూర్‌పై వచ్చే వారం 16 గంటల పాటు చర్చించడానికి ప్రభుత్వం అంగీకరించింది. సోమవారం ఉదయం వర్షాకాల సమావేశాలు మొదలయ్యేందుకు ముందు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సమయాన్ని కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, సభా కార్యకలాపాలను నిలిపేసి పహల్గామ్‌పై చర్చ జరపాలని కాంగ్రెస్ విప్ మాణిక్కం టాగోర్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 267 నిబంధన కింద వెంటనే చర్చించాలని రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంపీ రణదీప్ సూర్జేవాలా నోటీసులు సమర్పించారు. పూర్తి స్థాయి చర్చకు అనుమతిస్తానని రాజ్యసభ చైర్మన్ జగదీప్ దంఖడ్ హామీ ఇచ్చారు. అయితే, ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై వెంటనే చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. నినాదాలతో హోరెత్తించాయి. గందరగోళం మధ్యలో ఉభయ సభల్లో పలు బిల్లులను ప్రవేశపెట్టారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆపరేషన్ సిందూర్‌పై మల్లికార్జున ఖర్గే, జేపీ నడ్డాల మధ్య వాగ్వాదం జరిగింది. పహల్గామ్ సంఘటనకు దారితీసిన ఇంటలిజెన్స్ వైఫల్యంపై, జవాబుదారీ లేకపోవడం, యుద్ధం ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 24 సార్లు చేసిన ప్రకటనలపై చర్చ జరగాల్సిందేనని ఖర్గే డిమాండ్ చేశారు. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, సీడీఎస్, డిప్యూటీ ఆర్మీ చీఫ్, ఇతర అధికారుల ప్రకటనలపై కూడా చర్చ జరగాలని పట్టుబట్టారు. యుద్ధానికి సంబంధించిన వివరాలను సభలో చర్చించడం సరైంది కాదని జేపీ నడ్డా అన్నారు. చర్చల ద్వారానే సభను సాగించాలని, మనం అంతర్గతంగా పోట్లాడితే శత్రువుకు బలం చేకూర్చినట్లవుతుందని జగదీప్ దంఖడ్ అన్నారు. ప్రశ్నోత్తరాల సమయం జరుగుతుండగానే విపక్షాలు వాకౌట్ చేశాయి.



తన పుట్టిన రోజు సందర్భంగా పార్లమెంట్ హౌస్‌లో కేక్ కోస్తున్న ఖర్గే

సభలో నా నోరు నొక్కేస్తున్నారు!

- విపక్ష నేతగా మాట్లాడే హక్కుంది: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 21: విపక్ష నాయకుడిగా లోక్‌సభలో తనకు మాట్లాడే హక్కుందని, కానీ.. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నోరు నొక్కేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం సభ ప్రారంభమైన తర్వాత ఇటీవల కాలంలో మృతి చెందిన పార్లమెంటు సభ్యులు, మాజీ సభ్యులకు, పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి, అదేవిధంగా అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో దుర్మరణం చెందిన వారికి సభ్యులు నివాళులర్పించారు. అనంతరం.. స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే.. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చించాలని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. దీనికి స్పీకర్ అనుమతించలేదు. తొలుత ప్రశ్నోత్తరాలు జరగాలని, ఆ తర్వాత ఏ అంశాన్నయినా చర్చించేందుకు అనుమతి ఇస్తామన్నారు. దీంతో విపక్ష సభ్యులు తమ తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ పరిణామాల క్రమంలో స్పీకర్ బిర్లా సభను వరుసగా రెండుసార్లు వాయిదా వేశారు. దీంతో సభ నుంచి బయటకు వచ్చిన రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. "రక్షణ మంత్రి సహా బీజేపీ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇస్తున్నారు. కానీ, విపక్షం నుంచి ఏ ఒక్క సభ్యుడికీ ఆయన(స్పీకర్) అవకాశం ఇవ్వట్లేదు. నేను విపక్ష నాయకుడిని. మాట్లాడే హక్కుంది. కానీ, అవకాశమే ఇవ్వట్లేదు. ఇదొక కొత్త సంప్రదాయం" అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు దిగ్గజం వీఎస్ అచ్యుతానందన్ కన్నుమూత

101 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానం.. అతి సాధారణ నేపథ్యం నుంచి రాజకీయ ఉన్నత శిఖరాలకు..

- 82 ఏళ్ల వయసులో తొలిసారి కేరళ సీఎంగా
- ప్రధాని మోదీ, విజయన్ సంతాపం



తిరువనంతపురం/హైదరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం, భారత కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజ నేతల్లో ఒకరైన వెలిక్కాకతు శంకరన్ అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచారు. గత నెల 23వ తేదీన గుండెపోటుకు గురైన వీఎస్‌ను.. తిరువనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. ఐసీయూలో చికిత్స తీసుకుంటున్న క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం కన్నుమూశారు. ఆయన వయసు 101 ఏళ్లు. వీఎస్‌గా ప్రసిద్ధినొందిన అచ్యుతానందన్.. కేరళలో అత్యంత ప్రజాకర్షణ కలిగిన నేతల్లో ఒకరిగా, రాజీలేని సీపీఎం నాయకుడిగా పేరొందారు. వీఎస్ మరణం పట్ల ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్ తదితరులు సంతాపం ప్రకటించారు. అతి సాధారణ నేపథ్యం నుంచి కేరళలోనే అతిపెద్ద మాస్ లీడర్‌గా వీఎస్ ఎదిగారని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ పేర్కొన్నారు. ఎఝువ సామాజిక వర్గానికి చెందిన (కల్లుగీత కార్మిక) కుటుంబంలో 1923 అక్టోబరు 20వ తేదీన అచ్యుతానందన్ జన్మించారు. ఆయనకు నాలుగేళ్ల వయసు ఉన్నపుడు తల్లి, 11 ఏళ్ల వయసులో తండ్రి మరణించారు. బాల్యంలోనే కష్టాలను ఈదుకుంటూ వచ్చిన వీఎస్.. 17 ఏళ్ల వయసులో సీపీఐలో చేరి.. పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1946లో ట్రావెన్‌కోర్‌లో జరిగిన సాయుధ తిరుగుబాటులో పాల్గొని, నాలుగేళ్ల జైలు శిక్షకు గురయ్యారు. 1964లో సీపీఐ నుంచి ఒక వర్గం చీలిపోయి సీపీఎంను ఏర్పాటు చేసింది. సీపీఎం వ్యవస్థాపక నేతల్లో వీఎస్ ఒకరు. 1965-2016 మధ్య కాలంలో కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు వీఎస్ ప్రాతినిధ్యం వహించారు. అవినీతి, అక్రమాలు, అనైతికతను ఎంతమాత్రం సహించని వీఎస్.. తన సొంతపార్టీ నేతలను కూడా వదిలిపెట్టేవారు కాదు. 82 ఏళ్ల వయసులో తొలిసారిగా ఆయన సీఎం పదవిని చేపట్టారు. కాగా ఆర్థిక సంస్కరణలను వీఎస్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. కేరళలో కోకాకోలా ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆయన నడిపిన ఉద్యమం బాగా పేరొందింది. అచ్యుతానందన్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని గడిపిన ఆయన చివరి వరకూ నమ్మిన సిద్ధాంతాలకు, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేశారని అన్నారు. దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత వీఎస్ అచ్యుతానందన్ అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. వీఎస్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణ బాధ్యత రాష్ట్రాలదే

- కేంద్రం తరపున పూర్తి సహకారం అందిస్తాం: భూపేందర్ యాదవ్
- లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు బదులిచ్చిన కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ/హైదరాబాద్/హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ స్పష్టం చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, పాకాల సరస్సు పరిరక్షణపై లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. గోదావరి నదీ తీరాల్లోని ఇసుక అక్రమ తవ్వకాలు, నష్టాన్ని సమగ్రంగా బేరీజు వేస్తున్నామని తెలిపారు. నదుల పరిరక్షణ, ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణ తదితర అంశాల్లో రాష్ట్రాలకు కేంద్రం సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు (టీజీపీసీబీ) వివరాల ప్రకారం గోదావరి నది ఒడ్డున ఇసుక అక్రమ తవ్వకాల గురించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని బదులిచ్చారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు కేంద్ర గనుల శాఖ మైనింగ్ నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ అటవీ శాఖ నుంచి అందిన సమాచారం మేరకు నేషనల్ మిషన్ ఫర్ ఏ గ్రీన్ ఇండియా కింద వరంగల్ ప్రాంతంలో ఎటువంటి అటవీకరణ ప్రాజెక్టులు చేపట్టలేదన్నారు. జాతీయ నీటి పర్యవేక్షణ కార్యక్రమం కింద ప్రతినెలా పాకాల సరస్సు నుంచి నీటి నమూనాలు సేకరిస్తున్నట్టు తెలిపారు.

హైదరాబాద్‌కు డ్రైపోర్టు ఇవ్వండి: వద్దిరాజు

హైదరాబాద్‌కు డ్రైపోర్టు మంజూరు చేయాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. రాజ్యసభలో 'బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్-2024'పై ఆయన మాట్లాడారు. ఈ బిల్లుతో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర నగరాల్లో మధ్య, చిన్న తరహా పరిశ్రమల్లో ఉత్పత్తయిన సరుకులను విదేశీ మార్కెట్లకు తరలించేందుకు మార్గం మరింత సుగమమవుతుందని తెలిపారు. విశాఖపట్నం, చెన్నై పోర్టుల ద్వారా తెలంగాణ సరుకులు త్వరగా ఎగుమతి జరిగేందుకు దోహదం చేస్తుందన్నారు. హైదరాబాద్ డ్రైపోర్టు, రీజనల్ రింగ్ రోడ్ వంటి వాటిని ఈ బిల్లుతో అనుసంధానించాలని, తద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

పెరిగిపోతున్న సైబర్ నేరాలు: కె.లక్ష్మణ్



దేశవ్యాప్తంగా సైబర్ మోసాలు, డిజిటల్ ఆర్థిక నేరాలు పెరిగిపోతున్నాయని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ భద్రతా యంత్రాంగం బలోపేతంపై రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. సైబర్ నేరాల కట్టడికి ప్రతిస్పందన వ్యవస్థలను మెరుగుపర్చడం, డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక సైబర్ నేరాల సెల్‌లను రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఎగిరి డ్యాంలో పడ్డ యువకుడు

- జూరాల వద్ద విషాదం.. యువకుడి గల్లంతు



మహేశ్

ధరూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలోని ధరూరు మండలం రేవులపల్లి వద్దగల జూరాల ప్రాజెక్టుపై ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుల పైకి కారు దూసుకురావడంతో ఇద్దరిలో ఓ యువకుడు ఎగిరి డ్యాంలో పడి గల్లంతయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లాలోని మానవపాడు మండలం ఏ-బూడిదపాడు గ్రామానికి చెందిన మహేశ్ (25), సతీశ్, వీరేశ్‌తో పాటు తిమ్మాజిపల్లికి చెందిన జానకిరాములు స్నేహితులు. ఆదివారం కావడంతో సరదాగా జూరాల జలాశయం చూసేందుకు రెండు బైక్‌ల మీద వచ్చారు. రాత్రి 7.30కు గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఓ బైక్‌ను జానకిరాముడు నడుపుతుండగా మహేశ్ వెనుక కూర్చున్నాడు. మరో ఇద్దరు స్నేహితులు వెనకాలే మరో బైక్‌పై వారిని అనుసరిస్తున్నారు. ఆ సమయంలో ప్రాజెక్టు 48వ గేటు వద్ద ఎదురుగా వస్తున్న కారు జానకిరాములు, మహేశ్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేశ్ బైక్ పైనుంచి ఎగిరి డ్యాంలో పడిపోయాడు. జానకిరాములుకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక వస్తున్న మరో ఇద్దరు యువకులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వారు ధరూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్సై కొండా శ్రీహరికి సమాచారమిచ్చారు. హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకున్న పోలీసులు గాయపడిన జానకిరాములును ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వరకు మహేశ్ ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం ఉదయం డ్యాంలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదని ఎస్సై తెలిపారు. కారు డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగల దుకాణానికి కన్నం

సూర్యాపేటలో 18కిలోల బంగారు ఆభరణాలు, 40 తులాల బిస్కెట్లు చోరీ

- రూ.19.50లక్షల నగదు అపహరణ

సూర్యాపేట క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రం ఎంజీ రోడ్ శ్రీసాయి సంతోషి నగల దుకాణలో భారీ చోరీ జరిగింది. దుకాణం వెనుక వైపు కన్నం వేసి లోపలికి ప్రవేశించిన దొంగలు 18 కిలోల బంగారు ఆభరణాలు, 40 తులాల బంగారు బిస్కెట్లు, రూ.19.50 లక్షల నగదు అపహరించారు. ఘటన జరిగిన విధానాన్ని బట్టి దుకాణం లోపల పరిస్థితులపై పూర్తిగా అవగాహన ఉన్నవారే దొంగతనానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యజమాని తెడ్ల కిశోర్, పోలీసుల వివరాల ప్రకారం.. నగల దుకాణాన్ని శనివారం రాత్రి మూసివేశారు. ఆ సమయంలో షాపులోని బంగారు ఆభరణాలు, బంగారు బిస్కెట్లను దుకాణం వెనుకభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలోని బీరువాలో యజమాని భద్రపరిచారు. ఇంకొన్ని బంగారు, వెండి ఆభరణాలను దుకాణంలోని షోకేసుల్లో అలాగే ఉంచారు. ఆదివారం షాపు తెరవలేదు. సోమవారం ఉదయం షాపు తెరిచిన యజమాని కిషోర్ బంగారు ఆభరణాలు భద్రపరిచిన గదిలోకి వెళ్లి అక్కడి పరిస్థితులను చూసి షాక్ అయ్యారు. గదికి ఏర్పాటుచేసిన ఇనుప షట్టర్, బంగారు ఆభరణాలు భద్రపరిచిన బీరువా గ్యాస్ కట్టర్‌తో కత్తిరించి ఉంది. బీరువాలో భద్రపరిచిన ఆభరణాలు, బంగారు బిస్కెట్లు, నగదు కనిపించలేదు. దుకాణం లోపలి భాగంలోని మరుగుదొడ్డి గోడకు రంధ్రం కనిపించింది. అంటే.. వెనుక భాగం నుంచి మరుగుదొడ్డిలోకి, అక్కడి నుంచి.. దుకాణం గదిలోకి దొంగలు ప్రవేశించారు. షట్టర్‌ను, బీరువాను కత్తిరించేందుకు దొంగలు తెచ్చిన రెండు గ్యాస్ సిలిండర్లు ఘటనాస్థలిలో లభ్యమయ్యాయి. ఈ చోరీ శనివారం రాత్రి జరిగిందా? ఆదివారం రాత్రి జరిగిందా? అనేది నిర్ధారణ కాలేదు. ఘటనాస్థలాన్ని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ, డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. చోరీసొత్తును మూటగట్టుకొని.. వచ్చిన మార్గంలోనే పరారైన దొంగలు.. ఆ హడావుడిలో కొన్ని బంగారు ఆభరణాలు జారవిడిచారు. షాపు వెనుక వైపు మార్గంలో రెండు, మూడు తులాల బంగారు ఆభరణాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.



ఆభరణాలు ఉంచిన గదిలోకి వెళ్లేందుకు దొంగలు కోసిన షట్టర్

షోకేసుల్లోని నగలు ఎందుకు ముట్టలేదంటే

వెనుకవైపు గోడకు రంధ్రం చేసి, షాపులోకి ప్రవేశించిన దొంగలు.. నేరుగా ప్రత్యేక గదిలోకి వెళ్లి బీరువాను పగులగొట్టి నగలు, నగదు ఎత్తుకెళ్లారే తప్ప దుకాణం లోపలికి వెళ్లలేదు. అక్కడ షోకేసుల్లోని నగలు భద్రంగా ఉన్నాయి. దుకాణంలో సీసీ కెమెరాలు ఉండటంతో వారు లోపలికి ప్రవేశించలేదు. అయితే.. ప్రత్యేక గది ప్రాంగణం, గదిలోపల సీసీ కెమెరాలు లేకపోవడంతో అక్కడ పనికానిచ్చేసి వెళ్లిపోయారు. దుకాణం ముందు భాగంలో సీసీ కెమెరాలు ఉండటంతోనే ప్రణాళిక ప్రకారం వెనుక వైపు నుంచి దొంగలు ప్రవేశించారు. కాగా, ఎంజీరోడ్డులోని శంకర్ విలాస్ సెంటర్‌లో 14 ఏళ్ల క్రితం ఓ నగల దుకాణంలో ఇదే తరహాలో దొంగతనం జరిగింది. 2011లో కొత్తగా ఏర్పాటు చేసిన నగల దుకాణంలో జార్ఖండ్‌కు చెందిన దొంగలు దుకాణం వెనుక భాగంలోని కిటికీల గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించి సుమారు రెండు కిలోల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. వారిని సూర్యాపేట పట్టణ పోలీసులు పట్టుకున్నారు.

యూపీ గ్యాంగ్ పనేనా

నగల దుకాణంలో చోరీకి పాల్పడింది యూపీకి చెందిన ముఠానేనని స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెడతామంటూ రెండు నెలల క్రితం నగల దుకాణం సమీపంలో యూపీకి చెందిన కొందరు.. ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. చోరీ జరిగిన అనంతరం ఆ ఇంట్లో పోలీసులు సోదా చేశారని.. నగల దుకాణానికి సంబంధించిన సంచులు లభించినట్లు తెలిసింది.

అసహ్యకరంగా రాజకీయ నేతల భాష

- నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి
- కలచివేసిన కవిత, తీన్మార్ మల్లన్న ఘటన: గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాజకీయ నేతలు వాడుతున్న భాషను ప్రజలు అసహ్యించుకుంటున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష నేతలు తాము వాడుతున్న భాషతో భవిష్యత్తు తరాలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. రాజకీయ నేతలు తాము వాడే భాష పట్ల ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. కేంద్రంతోపాటు ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఎన్నికల్లో భారీ వ్యయాలను కట్టడి చేయాలని గుత్తా పేర్కొన్నారు. ఎన్నికల వ్యయం రూ.వేల కోట్లలో ఉండటం వల్లే అన్ని రాష్ట్రాల్లో అవినీతి పెరిగిపోయిందని చెప్పారు. ఎన్నికల ఖర్చుతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత పథకాలనూ నియంత్రించాలని ఆయన చెప్పారు. ఇక పెద్దల సభలో సభ్యులు హుందాగా ఉండాలని హితవు చెప్పారు. సభ బయటే అయినా ఎమ్మెల్సీలు కవిత, తీన్మార్ మల్లన్న మధ్య జరిగిన ఘటన తనను కలచివేసిందని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందని, అందుకే దాన్ని తెలంగాణ గట్టిగా వ్యతిరేకించిందన్నారు.

కలుషితాహారం తిని 11 మంది బాలికలకు అస్వస్థత

- సంగారెడ్డి జిల్లా మోర్గి మోడల్ స్కూల్‌లో ఘటన
- సీఎంగా, విద్యామంత్రిగా ఉండి రేవంత్ ఏం చేస్తున్నారు?: హరీశ్

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని 11 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన సంగారెడ్డిలోని నాగల్‌గిద్ద మండలం మోర్గి మోడల్ స్కూల్‌లో జరిగింది. హాస్టల్‌లో ఉంటున్న దాదాపు 68 మంది బాలికలు ఆదివారం రాత్రి భోజనం చేశారు. అనంతరం వీరిలో కొంతమందికి కడుపునొప్పి వస్తుందంటూ.. వాంతులు చేసుకున్నారు. దీంతో రాత్రి 10 గంటల ప్రాంతంలో వారిని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందించడంతో ఉదయం వరకు కోలుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఆర్డీవో అశోకచక్రవర్తి ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన చికిత్సలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వీరందరిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

గురుకులాలను చిన్నాభిన్నం చేస్తున్న సీఎం : హరీశ్‌రావు

కేసీఆర్ గుర్తులను చెరిపి వేయాలనే కుట్రతోనే.. రేవంత్‌రెడ్డి గురుకులాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 48 గంటల్లోనే వరుసగా మోర్గి, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి, జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గురుకులంలో, భద్రాది కొత్తగూడెం జిల్లా గురుకుల కళాశాలలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటు చేసుకుంటున్నా.. ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ మండిపడ్డారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో పాముకాట్లు, ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్‌లతో 100కు పైగా గురుకుల విద్యార్థులు ప్రాణాలను కోల్పోయినా.. ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక కుమారుడి ఆత్మహత్యాయత్నం

- అతడి పరిస్థితిని చూసి మనోవేదనతో తల్లి మృతి
- విషయం తెలిసి చికిత్స పొందుతున్న కొడుకూ మృత్యువాత
- సిద్దిపేట జిల్లా ఆకునూరులో విషాదం





రమేశ్, సుజాత(ఫైల్)

చేర్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. అతడి పరిస్థితిని చూసి తల్లడిల్లిపోయిన అతని తల్లి తీవ్ర మనోవేదనతో ఈ నెల 18న మృతి చెందింది. తల్లి మృతితో మరింత ఆందోళనకు గురైన కుమారుడు సోమవారం చనిపోయాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో విషాదం నింపింది. ఆకునూరుకు చెందిన భూమిని సుజాత (50) అంగన్‌వాడీ కేంద్రంలో రెండో కార్యకర్తగా పనిచేస్తోంది. ఆమె ఒక్కగానొక్క కుమారుడు భూమిని రమేశ్ (36) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ అతని భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. రమేశ్ కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో అతడు గత వారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. అప్పటి నుంచి కుమారుడి పరిస్థితిపై సుజాత ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో ఈ నెల 18న ఆమె చనిపోయింది. తల్లి మరణించినప్పటి నుంచి తీవ్ర మనోవేదనలో ఉన్న రమేశ్ సోమవారం ఆస్పత్రిలో మృతి చెందాడు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య




సంతోశ్ యాదవ్

తలమడుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అప్పులు అధికమై, బతుకు భారమై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచలాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర సంతోశ్ యాదవ్(47) తనకున్న ఐదు ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల నుంచి పంటల సక్రమంగా పండటం లేదు. గ్రామీణ బ్యాంకులో ఉన్న రూ.2 లక్షల వ్యవసాయ రుణం ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకంలో మాఫీ కాలేదు. రబీలో వేసిన జొన్న పంటకు నీరు అందకపోవడంతో పంట ఎండిపోయింది. ఈ ఏడాది పంటల కోసం మరో రూ.2 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల భారం అధికం కావడంతో మనోవేదనకు గురైన సంతోశ్ ఆదివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంతోశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుదిబండి వెంకటరెడ్డి మృతి

- ఉమ్మడి ఏపీలో విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు



వెంకటరెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి/చిక్కడపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుదిబండి వెంకటరెడ్డి (84) మృతిచెందారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవీఆర్ ఆరాధన సంస్థను స్థాపించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లిన ఆయన ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు బస్సులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి శివారులోని ఓ దాబా ఎదుట ఆగి ఉన్న బస్సును నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపునకు వస్తున్న డీసీఎం వ్యాను అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వెంకట్‌రెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. బస్సులో ఉన్న మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంకటరెడ్డికి భార్య, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. వెంకట్‌రెడ్డి మృతి పట్ల ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా.మామిడి హరికృష్ణ సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పింఛన్‌దారులకు రేవంత్ మోసం: మంద కృష్ణ



ఆమనగల్లు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పింఛన్‌దారులను సీఎం రేవంత్‌రెడ్డి మోసగిస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు, ఆసరా పింఛన్ రూ.4 వేలు ఇస్తామని హామీనిచ్చారని.. 19 నెలలు దాటినా అమలు చేయట్లేదని విమర్శించారు. పింఛన్‌దారులకు అందాల్సిన సొమ్ము.. నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున ఇప్పటివరకు రూ.20 వేల కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల, ఆసరా పింఛన్‌దారుల జిల్లా మహాసభకు మంద కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో 'పింఛన్‌దారుల గర్జన' పేరుతో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు పింఛన్‌దారులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

తోటివారికి సేవ చేయడమే దేవుడిపై నిజమైన ప్రేమ

- తిరుమలేశుడి పూజల్లో స్వదేశీ గోవుల పాలే వాడాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 21: తోటివారికి సేవ చేయడమే దేవుడిపై అసలైన ప్రేమగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. తిరుమల శ్రీవారికి పూజాదికాల్లో స్వదేశీ గోవుల పాలు మాత్రమే వాడేలా తిరుమల తిరుపతి దేవస్థానాల(టీటీడీ)ను ఆదేశించాలన్న పిటిషన్‌పై విచారణకు నిరాకరించింది. ఇంతకంటే ముఖ్యమైన అంశాలు ఉన్నాయని.. తోటి మానవులకు సేవ చేయడంలోనే దేవుడిపై అసలైన ప్రేమ ఇమిడి ఉందని.. ఇలాంటి వాటిలో కాదని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం స్పష్టంచేసింది. స్వామివారి పూజలు, ప్రసాదాల తయారీలో స్వదేశీ గోవుల పాలు మాత్రమే వాడేలా టీటీడీకి ఆదేశాలివ్వాలని కోరుతూ 'యుగ తులసి ఫౌండేషన్' సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఆగమ శాస్త్రాల ప్రకారం పూజలు నిర్వహించాలని.. ఈ మేరకు చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని ఆ సంస్థ తరపు న్యాయవాది విచారణ సందర్భంగా న్యాయస్థానాన్ని కోరారు.

టైగర్ రిజర్వ్‌పై వెనకడుగు

- జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం
- ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో బంద్



సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్సీ దండె విఠల్.. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వివేక్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న టైగర్ కన్జర్వేషన్ జోన్ విషయంలో సర్కారు కాస్త వెనక్కి తగ్గింది. సుమారు 330 గ్రామాలను ప్రభావితం చేయనున్న ఈ పులుల సంరక్షణ కేంద్రంపై ఆదివాసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. టైగర్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకువచ్చిన జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జీవో 49 విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ నుంచి సేకరించిన తాజా నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లో లక్షా 49 వేల హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49ని ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో 330 ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమగ్ర వివరాలను సేకరించారు. వాస్తవ పరిస్థితులను సీఎంకు వివరించారు. దీంతో జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, జీవో 49 నిలుపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం సన్మానించారు. సహకరించిన మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కు.. ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు కృతజ్ఞతలు తెలిపారు.

బంద్ ప్రశాంతం..

జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, ఇతర సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీశారు. మిగతా మండలాల్లో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివాసీ, గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నెన్నెలలో జీవో ప్రతులను దహనం చేశారు. కాసిపేట మండలంలో బంద్ నడిచింది. ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు నిర్వహించి దుకాణాలను మూసి వేయించారు. బస్టాండ్, బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గుడిహత్నూర్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి.

నకిలీ మద్యం గుట్టురట్టు

- రూ.20 లక్షల విలువైన 840 లీటర్ల నకిలీ మద్యం స్వాధీనం
- సూర్యాపేట జిల్లాలో ఐదుగురిపై కేసు నమోదు.. ఇద్దరి అరెస్టు



హుజూర్‌నగర్ , మేళ్లచెర్వు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో నకిలీ మద్యం తయారీ గుట్టురట్టయింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామంలోని ఓ షెడ్డులో కొందరు వ్యక్తులు నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రూ.20 లక్షల విలువైన 840 లీటర్ల నకిలీ మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మేళ్లచెర్వు మండలంలోని ఓ వైన్స్ దుకాణంలో గతంలో గుమస్తాగా పని చేసిన రామాపురం గ్రామానికి చెందిన తోట శివశంకర్ ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. శివశంకర్ తన స్నేహితులైన రామాపురం గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దుర్గికి చెందిన శ్రీరాం మహేశ్‌తో కలిసి నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నాడు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భారీ స్థాయిలో నకిలీ మద్యాన్ని తయారుచేసేందుకు ఈ ముఠా సన్నద్ధమైంది. రామాపురంలోని ఓ షెడ్డులో మద్యం తయారుచేస్తున్నారని స్థానికుల ద్వారా అందిన సమాచారం మేరకు.. హైదరాబాద్ ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా నకిలీ మద్యం తయారు చేస్తున్న షెడ్డుపై దాడి చేసి రూ.20 లక్షల విలువైన 840 లీటర్ల నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యాన్ని ఖాళీ సీసాల్లో నింపి మూతలు బిగించి నకిలీ లేబుల్స్ అతికించి విక్రయించే యత్నం చేస్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. ప్రతి ఖాళీ విస్కీ సీసాలో 1/4 శాతం స్పిరిట్, 3/4 శాతం నీరు, ఇతరాలు కలిపి విస్కీలా తయారు చేస్తున్నారని, హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీ నుంచి స్పిరిట్‌ను కొనుగోలు చేసి నకిలీ మద్యం తయారు చేసి ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో సూర్యప్రకాశ్, శ్రీరాం మహేశ్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేయగా, శివశంకర్ పరారీలో ఉన్నాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చమురుతో చెలగాటం

రష్యా ఇంధనరంగం లక్ష్యంగా యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రకటించిన సరికొత్త ఆంక్షల్లో గుజరాత్‌లోని నాయారా ఎనర్జీ లిమిటెడ్‌కు చెందిన వాడినార్ రిఫైనరీ కూడా ఉంది. రష్యానుంచి చమురు కొనుగోలు చేసే దేశాలను కఠినఆంక్షలతో ఊపిరాడనివ్వకుండా చేయాలని పాశ్చాత్యదేశాలు సరికొత్తగా సంకల్పం చెప్పుకున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఇటువంటివి అనేకం చూడాల్సిరావచ్చు. రష్యానుంచి చమురుకొంటున్నందుకు భారతదేశంమీద 500శాతం సుంకం విధించేందుకు ట్రంప్ ఆశీస్సులతో అమెరికా సెనేటర్లు ఒకపక్క బిల్లు సిద్ధం చేస్తుంటే, మరోపక్క నాటో అధినేత నోట ట్రంప్ బెదిరింపు భాష వినబడుతోంది. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేలా రష్యామీద భారత్, చైనా, బ్రెజిల్ ఒత్తిడి తీసుకురావాలని, విఫలమైన పక్షంలో ఆంక్షలకు సిద్ధపడాలని నాటో అధినేత మార్క్ రుట్టే హెచ్చరించిన విషయం తెలిసిందే. రష్యన్ ఇంధన సంస్థ రోస్నెఫ్ట్‌నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న రిలయెన్స్ ఇండస్ట్రీస్‌కు, 49శాతం రోస్నెఫ్ట్ వాటాలున్న నాయారా ఎనర్జీకి ఈయూ నిషేధం పెద్ద సవాల్. రష్యా క్రూడ్ ఆయిల్‌ను భారత్‌లో శుద్ధిచేసి, యూరోపియన్ యూనియన్ మార్కెట్‌కు ఎగుమతి చేస్తున్న ఈ రెండు చమురు ఎగుమతి సంస్థలకు కష్టకాలం తప్పదేమో.

నాయారాలో రోస్నెఫ్ట్ సహా పలురష్యన్ పెట్టుబడులు గణనీయంగా ఉన్నందున అది ప్రథమ, ప్రధాన లక్ష్యమై ఉండవచ్చు. రష్యానుంచి ఏ కంపెనీ ఎంత ముడిచమురు దిగుమతి చేసుకుంటోందో, శుద్ధిచేసిన తరువాత ఎవరికి, ఎంత ఎగుమతి చేస్తోందో మన ప్రభుత్వం గుట్టువిప్పదు. రష్యా చమురు బావుల్లో నుంచి తోడిపోసిన ముడిచమురులో 80శాతం భారతదేశానికే చేరుతోందని, ఈ ఏడాది జూన్ వరకూ 231 మిలియన్ బారెల్స్ ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తే, అందులో దాదాపు సగం రిలయెన్స్, నయారాకు అందిందని అంటారు. ఇప్పుడు రాస్‌నెఫ్ట్, యూసీపీ వంటి రష్యన్ సంస్థలు నయారా ఎనర్జీని రిలయెన్స్‌కు విక్రయించే ప్రతిపాదనలు చేస్తుండగా, ఈయూ ఆంక్షలు తెరమీదకు వచ్చాయి. ఓ పదేళ్లపాటు రోజుకు ఐదులక్షల బ్యారెళ్ళు దిగుమతి చేసుకోవడానికి రష్యాతో రిలయెన్స్ ఏడాది క్రితమే మరో భారీ ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే.

భారత్‌లో శుద్ధిచేసిన రష్యన్ ముడిచమురు యూరప్‌కే పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నప్పటికీ, పాశ్చాత్యదేశాలు అడపాదడపా మనల్ని తప్పుబట్టడం ఈ యుద్ధకాలమంతా జరుగుతున్నదే. రష్యా ముడిచమురు దిగుమతుల్లో అత్యధికం శుద్ధిచేసిన అనంతరం విదేశాలకే తరలిపోతున్నప్పటికీ, సదరు దిగుమతులు మన దేశ ప్రజల ప్రయోజనార్థం జరుగుతున్నట్టుగా మంత్రులూ అధికారులూ వ్యాఖ్యలు చేయడం అనాదిగా చూస్తున్నదే. భారత్ నుంచి ఈయూకు శుద్ధిచేసిన పెట్రోలియం ఎగుమతులు ప్రతీ ఏటా రెట్టింపవుతున్న విషయం గమనించాలి. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముందు భారత్ మొత్తం చమురుదిగుమతుల్లో రష్యా వాటా ఒకశాతం కంటే లేదు. యుద్ధం మొదలు కాగానే, పలు రాయితీలు, మినహాయింపులతో రష్యా చవుకగా అందించిన చమురుతో భారత్ లబ్ధిపొందుతూ వచ్చింది. అడ్డూ అదుపూలేకుండా చమురు తోడి, చవుకగా అమ్మి, యుద్ధాన్ని బలంగా, సంవత్సరాలపాటు రష్యా కొనసాగించగలుగుతున్న నేపథ్యంలో, ఆయిల్ మీద ఆంక్షలతో రష్యాను నిర్వీర్యం చేయాలన్న మరో ప్రయత్నం ఇది.

యుద్ధానికి నువ్వేకారణమంటూ మొన్నటివరకూ ఉక్రెయిన్ అధ్యక్షుడిని తీవ్రంగా తప్పుబట్టి, అవమానించి, రష్యా అధ్యక్షుడిని తెగవెనకేసుకొచ్చిన ట్రంప్ ఇటీవలే మనసుమార్చుకున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్దిగంటల్లోనే యుద్ధాన్ని ఆపగలనన్న ట్రంప్, తనమాట పూచికపుల్లలాగా తీసిపారేస్తున్న పుతిన్‌మీద అలిగారు, ఆగ్రహించారు. ఆయుధాలతో జెలెన్‌స్కీని బలోపేతం చేయాలని, ఆంక్షలతో పుతిన్‌ను నిర్వీర్యుడిని చేయాలని సంకల్పించారు. నిన్నటివరకూ నోరు విప్పడానికి జడిసిన నాటో, ఈయూ నాయకులంతా ఇప్పుడు ట్రంప్ అండ చూసుకొని రష్యామిత్ర దేశాలను బెదిరిస్తున్నారు. ఇటువంటి విన్యాసాలు చాలా చూశామనీ, ఏమి చేయాలో తమకు తెలుసునన్నది చమురు మంత్రి హర్‌దీప్ పురి వ్యాఖ్యల సారాంశం. ఆంక్షలు విధిస్తామని మనను బెదిరిస్తున్న ఈ దేశాలు రష్యా నుంచి ఒకపూట దిగుమతి చేసుకుంటున్న చమురు ఉత్పత్తులు మన మూడునెలల దిగుమతులతో సమానమని ఆయన ప్రకటించారు. రష్యా నుంచి ముడిచమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలను ఆంక్షలతో దెబ్బతీయాలన్న ప్రయత్నం అంతిమంగా ప్రపంచ చమురు మార్కెట్‌ను కుప్పకూలేట్టు చేస్తుందని గ్రహించాలి.

గౌరవం పేరిట గుడ్డి విధేయత!

ఇటీవల ఒక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరయ్యాను. ఇలాంటి సమావేశాలు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలోను, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడంలోను ఎంతో కీలకం. కానీ ఈ వేదికపై చోటుచేసుకున్న ఒక అంశం నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది. ఈ సమావేశంలో పిల్లల చేత తల్లి దండ్రుల పాదాలకు మొక్కించారు. పాదాలను ముద్దాడమని చెప్పారు. ఇది స్వచ్ఛందంగా జరగలేదు. కొందరు పిల్లల ముఖాల్లో ఇబ్బంది స్పష్టంగా కనిపించింది. మన దక్షిణ భారత సంస్కృతిలో ఇది అనూహ్యం. బెంగాలీ వంటి ఉత్తర భారత ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలలో ఉండే సంప్రదాయాన్ని, మన సమాజంలో బలవంతంగా ప్రవేశ పెట్టే ప్రయత్నమా అని అనిపించింది. ఉపాధ్యాయుల పాదాల్ని పిల్లలతో మొక్కించడం కూడా చూసాను. ఇవన్నీ



మన పిల్లలపై బలవంతంగా విధేయతను రుద్దే ప్రయత్నాలుగా అనిపించాయి. ఇలాంటి చర్యల వెనక ఉన్న భావజాలాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. పిల్లలను గౌరవం పేరుతో తల వంచేట్టు చేసే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని కలిగించటం నేడు ఎక్కువ అవసరం.

ఈ పాదపూజలు, తల వంచే శిక్షణలు విద్యా లక్ష్యాలకి విరుద్ధం. ప్రముఖ విద్యా తత్త్వవేత్త పాలో ఫ్రెయిర్, "విద్యార్థి ఒక ఖాళీ పాత్ర కాదు, ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని నింపే అధికారి కాదు. ఇద్దరూ కలిసి వారి మధ్య సంభాషణలో జ్ఞానాన్ని ఆవిష్కరించాలి" అంటారు. విద్య ఇలాంటి విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించాలి, గుడ్డి విధేయతను కాదు. గురువులు, పాఠ్యపుస్తకాలు చెప్పిన విషయాలను గుడ్డిగా ఆమోదించడం కంటే, వాటిని ప్రశ్నించడం, విశ్లేషించడం, కొత్త ఆలోచనలను అన్వేషించడం ముఖ్యం. శాస్త్రీయ ఆవిష్కరణలు, సామాజిక సంస్కరణలు ఎల్లప్పుడూ ప్రశ్నించే మనస్తత్వం నుండే జన్మించాయి. విద్యా వ్యవస్థలు విద్యార్థులను గుడ్డి విధేయత వైపు కాక, స్వతంత్ర ఆలోచన వైపు నడిపించాలి.

తలవంచడం, పాదాభివందనం వంటి సంప్రదాయాలు గౌరవాన్ని సూచిస్తాయి, కానీ కొన్ని సందర్భాలలో ఇవి విద్యార్థులలో భయం, ఆత్మవిశ్వాస లోపాన్ని సృష్టించవచ్చు. స్వతంత్ర ఆలోచనలు, ఆత్మగౌరవం లేని విద్యార్థి సమాజంలో తన గొంతును వినిపించలేడు. ఆధునిక సమాజంలో రేపటి పౌరులు కాబోయే నేటి విద్యార్థులు భవిష్యత్తులో తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచడం, అన్యాయాన్ని ఎదిరించడం, సమాజంలో సానుకూల మార్పుల కోసం కృషి చేయడం అవసరం. తలవంచే సంస్కృతి ఈ ఆత్మవిశ్వాసాన్ని అణచివేయగలదు. గౌరవం అనేది హృదయంలోని భావం, కేవలం శారీరక చర్యలలో లేదా బాహ్య ఉపచారాలలో మాత్రమే ఇది వ్యక్తం కాదు. పాదపూజలు భయం ఆధారంగా ఏర్పడతాయి – గౌరవం, ప్రేమ ఆధారంగా కాదు. ఇలాంటి భయ ఆధారిత సంబంధాలు పిల్లల విమర్శనాత్మక ఆలోచనకు అడ్డుపడతాయి. పిల్లలు ఏ విషయాన్నైనా ప్రశ్నించే ధైర్యాన్ని కోల్పోతారు. 'పెద్దవారు చెప్పిందే నిజం' అనే అభిప్రాయం అలవాటవుతుంది.

ఇప్పటి రాజకీయ వర్గాల్లో పాత విలువలు, గురుకుల పద్ధతులు, ధార్మిక విశ్వాసాల పేర్లతో, ఆధిపత్య నిర్మాణాలను తిరిగి బలపరిచే ప్రయత్నం జరుగుతున్నది. ఇది కేవలం సంస్కృతి పరిరక్షణ కాదు, అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నం. ప్రశ్నించే పిల్లలకు బదులుగా విధేయత చూపే తరం కావాలన్న లక్ష్యం దీని వెనక ఉన్నది. ఇది కొత్త తరం ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచనను అణిచివేస్తుంది. అలాంటి తరం ప్రభుత్వాన్ని ప్రశ్నించదు, సమాజపు తేడాలను ఎత్తి చూపదు, నియంత్రణను అంగీకరిస్తుంది. ఇది ఒక విధమైన సామాజిక మౌనాన్ని బలపరచే విధానం.

నూతన జాతీయ విద్యా విధానంలో 'గురుకుల పద్ధతి'కి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రాచీన సంస్కృత గ్రంథాలపై దృష్టి పెట్టి భారతీయతను నినాదంగా మార్చడం చూస్తుంటే, ఇది జ్ఞానం పెద్దవారివద్ద ఉండాలి, పిల్లలు వినాలి మాత్రమే అనే పద్ధతికి దారితీస్తోంది అనిపిస్తుంది.

విద్యార్థులు తలవంచే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని పొందాలి. విద్య విమర్శనాత్మక ఆలోచనను, స్వతంత్ర దృక్పథాన్ని ప్రోత్సహించాలి. సంప్రదాయ గౌరవ వ్యక్తీకరణలు ఆధునిక సమాజంలో భావాధారితంగా, పరస్పర గౌరవంతో కూడినవిగా పరిణమించాలి. విద్యార్థులలో స్వేచ్ఛ, సంభాషణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా మాత్రమే మనం సమసమాజాన్ని, పురోగమన దేశాన్ని నిర్మించగలం. తలెత్తి నడిచే విద్యార్థులు సమాజంలో సానుకూల మార్పులను తీసుకురాగల నాయకులుగా మారతారు.


– డా. కె.రమాప్రభ, సామాజిక కార్యకర్త

సృష్టి.. స్థితి.. లయంలో గాజా!

యుద్ధ బీభత్సాన్ని వ్యక్తం చేయలేని భాష ప్రపంచంలోనే ఉండదు. యుద్ధం ఏ స్థాయిదైనా కావచ్చు. అది ఆదిమ తెగల మధ్యదీ కావచ్చు, సమ ఉజ్జీల మధ్యదీ కావచ్చు. భాషలో ఒకపట్టాన వర్ణించలేని యుద్ధాలు చాలా అరుదు. మానవ సమూహాలన్నీ ఏదో ఒక దశలో యుద్ధంతో సహజీవనం చేశాయి. అందుకే వీర కావ్యాలూ గాథలూ లేని మానవ సమూహమే లేదు. కానీ నిరంతర బీభత్సమై, కిరాతకమై, నరమేధమై, సర్వస్వ హననమైన యుద్ధాలు మనుషుల విషాద వ్యక్తీకరణ సామర్థ్యానికే సవాలుగా నిలుస్తాయి. ఆ యుద్ధాలకు దూరంగా నివసించే మనుషులకు అదింకా కష్టంగా మారుతుంది. 2023 అక్టోబరు 7 నుంచి గాజాలో జరుగుతున్న జీవన విధ్వంసంపై ఇంకా గొంతుకలు పూర్తిగా పెగల్లేని పరిస్థితే ఉంది. మాటలకు తడుముకోవటమే ఉంది. వాక్యాల కోసం వ్యాకులత చెందటమే ఉంది. భావాల కోసం భాషలను గాలించటమే ఉంది. దృశ్యాలను ప్రదర్శించలేని అశక్తతే ఉంది. మన అనుభవం పూర్తిగా ఆకళింపు చేసుకోలేని, ఊహించుకోలేని విచ్ఛిన్న, విషాదకర, వివర్ణ పరిస్థితి గాజాలో నెలకొంది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం! కిందామీదా పడుతూ నిటారు కఠిన కొండ శిలలను ఎక్కి చుట్టూ పరచుకున్న ప్రపంచాన్ని ఎంతమేరకు చూడగలమో అందులో వెయ్యోవంతు స్థాయిలోనే ఇప్పుడు గాజా బీభత్సాన్ని చూడగలం. అది అసంపూర్ణం. అసమగ్రం. అయినా ఆ పరిమిత దృశ్యమే అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జరుగుతోన్న దారుణాలకూ కిరాతకాలకూ చరిత్ర మూలాల్లోకి వెళ్లేలా చేస్తోంది.

సరిహద్దు గోడలనూ, ఇనుపముళ్ల కంచెలనూ పగలగొట్టి హమాస్ తీవ్రవాద ప్రేరేపితులు (2023 అక్టోబరు 7) ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి 1200 మందికి పైగా చంపేశారు. ఎంతో మందిని బందీలుగా పట్టుకెళ్లారు. ఆ దారుణాన్ని అందరూ ఖండించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, సాంస్కృతిక భిన్నత్వాన్నీ మనసావాచాకర్మణా కోరుకునే వారిని నిలువెల్లా కలచివేసిన సంఘటన అది. అయినా హమాస్ లాంటి సంస్థలను ఎదుర్కొనటానికి యుద్ధాన్నే పరిష్కారంగా వారు భావించటం లేదు. ఏదో ఒక మిషతో గాజాపై యుద్ధాలు ప్రకటించటం, దాడులు చేయటం ఇజ్రాయెల్‌కు కొత్తకాదు. 2014 నాటికే గాజాపై 12 సార్లు ఇజ్రాయెల్ యుద్ధానికి పాల్పడిన విషయాన్ని ప్రముఖ ఫ్రెంచ్ చరిత్రకారుడు జీన్ పియర్ ఫిలియు పదేళ్ల కిందటే చెప్పారు. ఆ యుద్ధాల్లో ఇజ్రాయెల్ వేలాది మందిని చంపేసింది. అనేక భౌతిక సౌకర్యాలను విధ్వంసం చేసింది.

మధ్య ఆసియాలోనే కాదు, ప్రపంచంలోని ఏ దేశమూ ఇజ్రాయెలంత శత్రుదుర్భేద్యంగా ఉండదు. ఏదో చేస్తారన్న అనుమానంతో, అంచనాతో, ముందుగానే పడగొట్టాలనే ఆలోచనతో చుట్టుపక్కల దేశాలపై దాడులు చేయటంలో ఇజ్రాయెల్‌కు సాటి వచ్చే దేశమేదీ లేదు. అత్యాధునిక ఆయుధాలతో, డ్రోన్లతో, సైబర్ సెక్యూరిటీతో, క్షిపణి రక్షణ వ్యవస్థలతో, పటిష్ఠ గూఢచర్యంతో, అణ్వస్త్రాలతో ఇజ్రాయెల్ నెలకొల్పుకున్న ఆధిపత్యాన్ని సవాల్ చేయగలిగిన పరిస్థితి ఇరుగుపొరుగున కనపడదు. అయినా హమాస్ దాడితో తన అస్తిత్వానికే ముప్పు ఏర్పడిందనే కారణంతో గాజాపై 20 నెలలుగా కనీవినీ ఎరగని రీతిలో దాడులు చేస్తోంది. ఒక చిన్న ప్రదేశంపై చరిత్ర చూడని దాడులకు పాల్పడుతూ ఇప్పటికే 60 వేలకు పైగా మరణాలకు కారణమైంది. ఆహార పదార్థాలను అందనీయటం లేదు. మందులను చేరనీయటం లేదు. వితరణ హస్తాలనూ విరిచేస్తోంది. వేలభవనాలను శిథిలాలుగా మార్చుతోంది. మంచినీరునూ పారనీయటం లేదు. కరెంటుకు అంతరాయాలు సృష్టిస్తోంది. పాఠశాల భవనాలను కుప్పకూల్చుతోంది. ఆసుపత్రులపైనా బాంబుల వర్షం కురిపిస్తోంది. సొరంగాలు పేలుస్తోంది. ప్రాణం నిలుపుకోటానికి అవసరమైన ప్రతిదాన్నీ పనికి రాకుండా చేస్తోంది.



ఎంత ఆయుధశక్తి ఉన్నప్పటికీ హృదయాల్లో రగిలే పాలస్తీనా జాతీయ ఆకాంక్ష ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ స్థిమితత్వాన్ని ఇవ్వదు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనా సమస్య కేంద్రంగా మండుతోన్న అసంతృప్త జ్వాలా చల్లారదు. భయానక, అమానుష, జాతివిద్వేష రాజకీయాలు యూరపులో 60 లక్షల మంది యూదుల ప్రాణాలను బలితీసుకోవటం మానవ చరిత్రను ఇంకా వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆ బాధిత జాతి భద్రత పేరుతో గాజాను బలిపీఠం ఎక్కించటం ప్రపంచ మానవత్వాన్ని వెంటాడదా?

గాజా (గాజా స్ట్రిప్) అనేది 140 చదరపు మైళ్ల ప్రాంతం. దాని సృష్టే కృతకమైంది. 1948 నాటి యుద్ధ సమయాన అసంబద్ధ సరిహద్దులతో దాన్ని ఏర్పరచారు. ప్రాచీన నాగరికత చరిత్రలో ఘనమైన పాత్రను పోషించిన ఒక నగరాన్నీ దాని చుట్టుపక్కల ప్రాంతాన్నీ.. విశాల పూర్వ పాలస్తీనాతో సంబంధాలను తెంచి సామాజిక జీవనాడులను ఛిన్నాభిన్నం చేసిన దృశ్యమే 77 ఏళ్లుగా అక్కడ ఉంది. 28 మైళ్ల పొడవు, ఉత్తరాన 4.3 మైళ్ల వెడల్పు, దక్షిణాన 7.8 మైళ్ల వెడల్పు, మళ్లీ మధ్యలో 3.4 మైళ్లకు కుదింపు.. పశ్చిమాన మధ్యధరా సముద్రం.. ఇలా భౌగోళికంగా అసహజ సరిహద్దులను నిర్దేశించిన గాజాకు.. 1948 నుంచి విషాదాలు, వైపరీత్యాలు వెన్నాడుతూనే ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన పరిమితులను అతిక్రమించి పాలస్తీనాకు కేటాయించిన (44శాతం) భూభాగంలో అధిక భాగాన్ని 1948లో బలవంతంగా స్వాధీనం చేసుకోవటంతోనే ఇజ్రాయెల్ ఆక్రమణల చరిత్ర మొదలైంది. మరోవైపు గాజా ప్రాంతాన్ని ఈజిప్టు, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాన్ని జోర్డాన్ ఆక్రమించటంతో పాలస్తీనా ప్రజలకు తమదంటూ స్వేచ్ఛగా మసలే భూభాగమే లేకుండా పోయింది. ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న ప్రాంతాల్లో పాలస్తీనా ప్రజల్లో భయోత్పాతాన్ని కలిగించటానికి వందలాది గ్రామాలను నేలమట్టం చేశారు. ప్రజలను తరిమేసిన తర్వాత గ్రామాల అవశేషాలను లేకుండా చేశారు. చచ్చీచెడి ఎవరైనా పాలస్తీనా వ్యక్తి మమకారంతో స్వప్రాంతానికి వచ్చినా తన గ్రామం ఎక్కడుందో కనిపెట్టలేని దుస్థితికి తీసుకువచ్చారు.



■ రాహుల్ కుమార్

ఇజ్రాయెల్ ఘాతుకాలకు భీతావహులై పారిపోయిన ప్రజలు గాజాకు చేరుకున్నారు. 1948కి ముందు గాజాలో 80 వేల మంది ప్రజలు మాత్రమే ఉండేవారు. ఇజ్రాయెల్ తరిమివేయటంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని 2,50,000 మంది గాజాకు తరలి వచ్చారు. అప్పటి నుంచీ గాజా శరణార్థుల మెజారిటీ ప్రాంతమైపోయింది. ప్రపంచంలోనే ఒక చిన్న ప్రదేశంలో అత్యధిక శరణార్థులున్న ప్రాంతంగా గాజా మారిపోయింది. అదొక సంక్షుభిత పరిస్థితి. ప్రస్తుతం 24 లక్షలు ఉన్న గాజా జనాభాలో 70 శాతం మంది శరణార్థుల కుటుంబాలకు చెందినవారే! జనాభాలో సగం మంది 18 ఏళ్ల లోపు వాళ్లే. కిక్కిరిసిన జనసాంద్రతలో గాజాకు సాటివచ్చే ప్రాంతమే లేదు! 1948 నుంచి 1967 వరకూ గాజా ఈజిప్టు పాలన కింద ఉన్నా తన రాజ్యంలో విలీనం చేసుకోలేదు. గాజా వాసులకు పౌరసత్వాన్నీ ఇవ్వలేదు. స్వేచ్ఛగా ఈజిప్టుకు వచ్చిపోయే పరిస్థితినీ కల్పించలేదు. రహస్య సొరంగాలను తవ్వి ఆ మార్గాల ద్వారా ఈజిప్టులోకి ప్రవేశించి, మారుపేర్లతో కూలీలుగా వెళ్లటం, అక్రమంగా సరుకులు కొనుగోళ్లు, అమ్మకాలు చేయటం జీవన వ్యాపారమైంది. 1988లో హమాస్ ఏర్పడి, 2006లో గాజాలో అధికారాన్ని సొంతం చేసుకున్న తర్వాత సొరంగాల వ్యవస్థ (500 కిలోమీటర్లు) విస్తృతమైంది. సొరంగాలు ఆర్థిక జీవన కేంద్రాలుగా, సమరవ్యూహ–రక్షణ క్షేత్రాలుగా మారాయి.

1967 నాటి యుద్ధంలో గాజాను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. అంతకుముందు నుంచీ కూడా గాజాని ప్రమాదకరంగానే భావించింది. లక్షలాది శరణార్థులున్న చోటులో తీవ్ర ఇజ్రాయెల్ వ్యతిరేకతతో పాటు పాలస్తీనా విమోచన ఉద్యమాలూ అక్కడే ఊపిరిపోసుకున్నాయి. అందుకే గాజాను అన్ని విధాలుగా తొక్కిపెట్టటమే ఇజ్రాయెల్ భద్రతా వ్యూహంలో కీలకంగా మారింది. పగటిపూట కూలీలుగా పనిచేసి రాత్రి వెనక్కి వచ్చేసేలా 1967 తర్వాత గాజా ప్రజలకు కొంత వెసులుబాటు కల్పించినా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటానికి ఏ విధంగానూ ప్రయత్నించలేదు. పరిశ్రమలు అభివృద్ధి కాలేదు. వ్యవసాయం విస్తరించలేదు. రవాణా సౌకర్యాలను పొడిగించలేదు. విద్యావ్యాప్తికి దోహదం చేయలేదు. అంతర్జాతీయ సహాయంపై ఆధారపడటం గాజా వాసులకు తప్పలేదు. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచి ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించటానికి గాజాలో ఏ ప్రయత్నం జరగలేదు. నిరసన ప్రదర్శనలకు దిగినప్పుడూ, సైనికులపై రాళ్లు రువ్వినప్పుడూ, రాకెట్లను ప్రయోగించినప్పుడూ అసాధారణరీతిలో విరుచుకుపడి కాల్పులు జరపటం.. సామూహికంగా శిక్షలు విధించటం.. తీవ్రవాదులకు ఆశ్రయాలుగా ఉన్నాయనే నెపంతో ఇళ్లపై బాంబులు కురిపించటం.. విచారణలు లేకుండా జైళ్లల్లో ఉంచటం.. జన సంచారాన్ని నియంత్రించటం గాజాలో నిత్యకృత్యమైంది. ఇలాంటి దుర్భర పరిస్థితులు నుంచి యువకులు ఫిదాయీలుగా మారటం గాజాలో మొదలైంది.

పాలస్తీనా కోసం పోరాడే సంస్థల్లో మొదట్లో లౌకిక, వామపక్ష దృక్పథంతో ఉండేవే ఎక్కువ. ఈ సంస్థలు అనుకున్న విధంగా ఫలితాలు సాధించలేకపోవటంతో హమాస్, ఇస్లామిక్ జిహాద్ లాంటి సంస్థలు గాజాలో బలాన్ని సంపాదించుకున్నాయి. ఏడు ప్రధాన సంస్థల్లో ఆ రెండు మాత్రమే మతదృక్పథంతో, జిహాద్ పేరుతో కార్యకలాపాలు నిర్వహించేవి. పాలస్తీనా ఏర్పాటు లక్ష్యానికి మతాన్ని జోడించి ప్రచార వ్యూహాన్ని రూపొందించటంలో హమాస్ ప్రజలను ఆకర్షించగలిగింది. గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలకు పరిమిత పాలనాధికారాలు కల్పించటానికి ఉద్దేశించిన ఓస్లో ఒప్పందానికీ ఇజ్రాయెల్ తూట్లుపొడవటంతో గాజాలో అసంతృప్తి పెరిగిపోయింది. ఎంత అణచివేసినా ఆగని పోరాటాలతో సతమతమైన ఇజ్రాయెల్ గత్యంతరం లేని పరిస్థితుల్లో గాజా నుంచి వైదొలగింది. గాజాలో 2006 నాటి ఎన్నికల్లో హమాస్ విజయం సాధించింది. దీన్ని ఆమోదించని ఇజ్రాయెల్, అమెరికా, యూరోపియన్ యూనియను కూటమి గాజాపై ఆర్థిక దిగ్బంధాన్ని అమలుపరచాయి. 17 ఏళ్లుగా గాజా జీవితం మరింత తీవ్రంగా కుంగిపోయింది. గాజాలో తీవ్ర మానవ సంక్షోభం నెలకొందని వందలాది నివేదికలు వచ్చినా లక్ష్యపెట్టలేదు. మరోవైపు పాలస్తీనా సమస్య పరిష్కారం అంతర్జాతీయ రాజకీయ చిత్రపటం నుంచి చేజారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అరబ్ దేశాలు కూడా పాలస్తీనా సమస్యపై శీతకన్ను వేయటంతో హమాస్ అక్టోబర్ 7న రాకెట్టు దాడులకు దిగటం ప్రపంచాన్ని కుదిపివేసింది.

> కిందామీదా పడుతూ నిటారు కఠిన కొండ శిలలను ఎక్కి చుట్టూ పరచుకున్న ప్రపంచాన్ని ఎంతమేరకు చూడగలమో అందులో వెయ్యోవంతు స్థాయిలోనే ఇప్పుడు గాజా బీభత్సాన్ని చూడగలం. అది అసంపూర్ణం. అసమగ్రం. అయినా ఆ పరిమిత దృశ్యమే అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. జరుగుతోన్న దారుణాలకూ కిరాతకాలకూ చరిత్ర మూలాల్లోకి వెళ్లేలా చేస్తోంది.

ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించటానికీ, 1967 నాటికి ఉన్న సరిహద్దుల్లో స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకూ హమాస్ సిద్ధపడి 2017లో విధానాన్ని మార్చుకున్నా ముందడుగులు పడకపోవటం ఈ శతాబ్దపు విషాదంగానూ, చరిత్రాత్మక తప్పిదంగానూ భావించక తప్పదు. 44శాతం భూభాగం దక్కాల్సిన పాలస్తీనాకు గాజా, వెస్ట్‌బ్యాంక్‌తో కూడిన 22 శాతం భూమి ఇవ్వటానికి నిరాకరించటమే పరమ రాజకీయ లక్ష్యమైనప్పుడు.. ఎంత ఆయుధశక్తి ఉన్నప్పటికీ హృదయాల్లో రగిలే పాలస్తీనా జాతీయ ఆకాంక్ష ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ స్థిమితత్వాన్ని ఇవ్వదు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనా సమస్య కేంద్రంగా మండుతోన్న అసంతృప్త జ్వాలా చల్లారదు. భయానక, అమానుష, జాతివిద్వేష రాజకీయాలు యూరపులో 60 లక్షల మంది యూదుల ప్రాణాలను బలితీసుకోవటం మానవ చరిత్రను ఇంకా వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆ బాధిత జాతి భద్రత పేరుతో గాజాను బలిపీఠం ఎక్కించటం ప్రపంచ మానవత్వాన్ని వెంటాడదా?

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

దాశరథీ కవితా పయోనిధీ!



ఎత్తిన దీపమట్లు ప్రసరించెడి నీదగు పద్యకాంతిలో
చిత్తములెల్ల గ్రోలె మధు శీధువులన్; కవితా ప్రసూనముల్
గుత్తులు గుత్తులై విరిసె! కోటపయిన్ ధ్వజమల్లలాడె! వా
గ్దత్తమె నీ కలమ్ము సుమి! దాశరథీ! కవితా పయోనిధీ!

మూల మెరుంగుచున్– తెలుగు భూమి పయిన్ వెదజల్లి నాడ వా
గాలిబు గీతముల్– రసజగంబది హోరతులందజేసె– ఉ
ర్దూలలితాంగి నీ కలముతో గరచాలనము బొనర్చె– అం
దా లెదనార బోసితివి; దాశరథీ! కవితా పయోనిధీ!

సమర మొనర్చినాడవు నిజాము పయిన్ కవనంబుతోడ– ఖ
డ్గములు, తుపాకి గుండ్లు, విశిఖాలకు మించిన ఆయుధమ్ముగా
తిమిరము నూడ్చ గల్గినదదే కద! సైనిక పాత్ర నక్షరో
ద్యమమున నిల్పి దాల్చితివి దాశరథీ! కవితా పయోనిధీ!

మానితమై ప్రజాభ్యుదయ మానసమై భవదీయ లేఖినీ
గానము మేలుకొల్పె తెలగాణమునెల్ల; కవిత్వమెన్నడున్
గాని సమాజసేవ దిశగా బయనింపవలెన్; తెలుంగు లా
స్థానకవీ! నమస్సులివె! దాశరథీ! కవితా పయోనిధీ!

ఊరకనే వరింపదు మహోదయ వీధులలో కవిత్వమె
వ్వారిని గాని; నీకది య వారిత లీల లభించెగా కవీ
శా! రసశేఖరా! శతజయంతి రవీ! ఇవిగో నుతుల్ మహా
త్మా! రుచిరార్థ గేయనిధి! దాశరథీ! కవితా పయోనిధీ!

– రసరాజు

(నేడు దాశరథి కృష్ణమాచార్య శతజయంతి)


'నిత్య యవ్వనమే' సాధు సందేశం!

నేను ఒక ఏడాది క్రితం నా ఫేస్‌బుక్ వాల్‌పై మృత్యువు గురించి రాసిన ఒక కవితకు స్పందిస్తూ సాధు సుబ్రహ్మణ్య శర్మ ఇలా కామెంట్ చేసారు: "As age increases try to become younger. Don't await death. Let death take one unawares while fully immersed in executing a huge project, as in a battlefield!" ("వయసు పెరిగే కొద్దీ పడుచువారయ్యేందుకు ప్రయత్నించండి. చావు కోసం ఎదురుచూడవద్దు. ఏదో ఒక పెద్ద కార్యంలో పూర్తిగా నిమగ్నమై ఉండగా చావు మనకే తెలీకుండా వచ్చి మనల్ని లాక్కెళ్ళిపోవాలి, యుద్ధరంగంలో లాగ." – సాధుశర్మ)

సాధుశర్మ పరిపూర్ణ జీవితాన్ని ఆస్వాదించారు. ఈ ప్రపంచాన్ని ప్రేమించారు. తన చుట్టూ ఉన్న పిల్లలను ప్రోత్సహించారు. 90 ఏళ్ల వయసులో కూడా ఈ ప్రపంచాన్ని మార్చటానికి కొత్తకొత్త తాత్విక భూమికల గురించి అన్వేషిస్తూ, తాను కనుగొన్న సత్యాలను ప్రపంచంతో పంచుకొంటూ జీవించారు. పైన ఆయనే చెప్పినట్లు మరణించే సమయంలో కూడా ఏదో పెద్ద ప్రాజెక్టును ఊహిస్తూ ఉండి ఉంటారు.

లక్ష్మీనరసింహ శర్మ, సుబ్బమ్మ దంపతులకు 1932 మార్చి 6న సాధు సుబ్రహ్మణ్య శర్మ జన్మించారు. వీరి ప్రాథమిక చదువు బళ్ళారిలోను, కాలేజి చదువు అనంతపురం, హైదరాబాద్‌లోను జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖలో వివిధ హోదాలలో పనిచేసి, చివరకు జనరల్ మేనేజర్ ఇన్‌చార్జిగా 1990 మార్చి 31న పదవీ విరమణ చేసారు. ఈ జూలై 18న కాకినాడలోని స్వగృహంలో 93 ఏళ్ళ వయసులో మరణించారు.

సాధు సుబ్రహ్మణ్య శర్మ జ్ఞానదాహం అపారం. కవిత్వం, చరిత్ర, భాషాసంబంధ పరిశోధన, తత్త్వశాస్త్రం వంటి రంగాలలో వారు చేసిన ప్రామాణిక రచనలు అసాధారణం. 'సాధువాడిమాట–నవసహస్రాబ్ది బాట' అనే మకుటంతో సమకాలీన అంశాలు, నైతిక విలువలపై పద్యాలు రాశారు. 'కాలవాహిని' పేరుతో కవిత్వం రాశారు. అక్షరాలు దిద్దనవసరం లేకుండా తెలుగును బోధించేందుకు 'సాధుబాల శిక్ష' పాఠ్య పుస్తకం రాశారు. 'New Frontiers of Philosophy for an Alternate Model of Society or the Human Manifesto', 'Dialectics of Evolution, Systems Approach and New frontiers of Philosophy', 'Fight for Peace and Struggle for an Ideal Society' వంటి పుస్తకాలు ఇంగ్లీష్‌లో రాశారు. వీటిలో మొదటి పుస్తకం మానవజాతి ఎదుర్కొంటున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ పర్యావరణ సంక్షోభాలను చర్చిస్తుంది. సమకాలీన సమాజాన్ని, మానవ జీవనాన్ని పునర్నిర్మించే దిశగా ఒక గొప్ప మేధావి చేసిన ఆలోచనలు ఇందులో ఉన్నాయి. రెండవ పుస్తకంలో చరిత్రను ఒక కొత్త తాత్విక దృష్టితో ఎలా చూడాలో వివరిస్తూ, మరింత శాంతిమయ భవిష్యత్తును, శ్రేయస్సుతో కూడిన సమాజాన్ని సాధించేందుకు ఒక విన్–విన్ వ్యూహాన్ని ప్రతిపాదించారు. చరిత్ర పర్యంతం సామాన్య మానవుడు కేవలం విధేయత కలిగిన ఒక వస్తువుగానే ఉన్నాడని అతను మరింత తెలివైన పాత్ర పోషించాలి అని ఇందులో సాధుశర్మ అంటారు. మూడో పుస్తకంలో ఆధునిక సమాజం, హింస యుద్ధాల నుంచి ఎలా విముక్తి చెంది శాంతి వైపు ప్రయాణించాలో చర్చించారు. 770 పేజీల 'మేటి భారతదేశం' రచన మన చరిత్ర మూలాలను అన్వేషిస్తూ రాసిన విశ్లేషణాత్మక గ్రంథం. తెలుగువారు గర్వించదగిన గొప్ప తాత్విక రచనలను సుబ్రహ్మణ్య శర్మ చేసారు. వాటిపట్ల తెలుగునాట పెద్దగా చర్చ జరగకపోవటం నిజంగా బాధాకరం.



> సాధు సుబ్రహ్మణ్య శర్మ జ్ఞానదాహం అపారం. కవిత్వం, చరిత్ర, భాషాసంబంధ పరిశోధన, తత్త్వశాస్త్రం వంటి రంగాలలో వారు చేసిన ప్రామాణిక రచనలు అసాధారణం. తెలుగువారు గర్వించదగిన గొప్ప తాత్విక రచనలను సుబ్రహ్మణ్య శర్మ చేసారు. వాటిపట్ల తెలుగునాట పెద్దగా చర్చ జరగకపోవటం నిజంగా బాధాకరం.

సాధు సుబ్రహ్మణ్య శర్మ తెలుగు పాఠకులకు ఎక్కువగా తెలిసింది 'బంకోలా' నవల ద్వారా. 'బంకోలా' అంటే లైట్ హౌస్ అని అర్థం. నవలలోని కథా కాలం 18వ శతాబ్దం. అది విదేశీయులు వ్యాపార నిమిత్తం వచ్చి దేశ రాజకీయాలను గుప్పెట్లోకి తెచ్చుకొంటున్న కాలం. స్వదేశీయులు మూడురకాలుగా విడిపోయారు: ఈ మార్పుని తమకు అనుకూలంగా మలచుకొని బాగుపడాలనుకొన్నవారు కొందరు, 'రాజెవ్వడైతే మాత్రం నా కష్టమే కదా నాకు దిక్కు' అనుకొని తటస్థంగా ఉండిపోయినవారు కొందరు, రాబోతున్న ఉపద్రవాన్ని పసిగట్టి సమాజాన్ని అప్రమత్తం చేయటానికి ప్రయత్నించిన ఆలోచనాపరులు మరికొందరు. వీరందరి మధ్యా సంఘర్షణ ఫలితంగా జరిగిన నాటకీయ పరిణామాలే బంకోలా నవల. కథానాయకుడు భైరి, ఓడల యజమాని నరసింహనాయకర్ కొడుకు. భైరి ఆలోచనాపరుడు, ఆంగ్లేయ స్నేహితుల నుంచి ప్రపంచ విజ్ఞానం గ్రహిస్తాడు, బ్రిటిష్ రాజకీయ ఆధిపత్య ఆలోచనలను గుర్తిస్తాడు. యానాం ఫ్రెంచి వారి వద్ద గుమస్తాగా పనిచేస్తూ వారి దాష్టీకాలను ఎదిరించి గొడవ పడతాడు. మంజరి అనే వేశ్య ద్వారా విదేశీయుల దోపిడీని తెలుసుకొని ఢిల్లీ సుల్తానును కలిసి విదేశీయులను నిలువరించమని కోరటానికని ఢిల్లీ వెళతాడు. అక్కడ ఎవరూ ఇతని మాట ఖాతరు చేయకపోవటంతో తిరిగి కోరంగి వచ్చేస్తాడు. మరదలు పరదేశిని పెళ్ళాడి వ్యాపారంలో విజయం సాధిస్తాడు. అయితే బ్రిటిష్ వ్యతిరేక భావాలతో ఉన్నందుకు భైరి కొడుకును బ్రిటిష్ వారు హతమారుస్తారు. చివరకు, 1789 డిసెంబర్ 10న వచ్చిన కోరంగి సునామీలో భైరి, పరదేశి కొట్టుకుపోయి మరణించటంతో నవల ముగుస్తుంది. 'బంకోలా' నవలలో సుబ్రహ్మణ్య శర్మ ఆ కాలపు సామాజిక సంఘర్షణను నేపథ్యంగా తీసుకోవటం వల్ల ఇది గొప్ప చారిత్రక నవలగా రూపుదిద్దుకొంది. తెలుగులో ఈ కాలానికి సంబంధించి సామాన్యుల జీవితాలను ప్రతిబింబించే సాహిత్యం పెద్దగా లేదు. ఆ లోటు ఈ పుస్తకం తీర్చటంతో తెలుగు పాఠకులు దీనిని అపూర్వంగా ఆదరించారు.

ఇవేగాక, సాధుశర్మ రాసిన కొన్ని అముద్రిత రచనలూ ఉన్నాయి. 'జహిశత్రుల మహాబాహో', 'History of Freedom Struggle', స్వల్ప సంకేతాలతో సకల భాషలను రాసే విశ్వజనీన లిపిని కనిపెడుతూ ఆయన రాసిన మరో గ్రంథం ఇంకా అముద్రితాలే.

సాధు సుబ్రహ్మణ్య శర్మ 'సాధు ప్రైవేట్ లైబ్రేరీ'ని స్థాపించి స్కూల్ విద్యార్థుల కోసం స్వయంగా నడిపారు. పిల్లలు ఆటలు ఆడుకోవటానికి ఒక ఇల్లును అద్దెకు తీసుకొని అన్ని రకాల ఆట వస్తువులను వారికి అందుబాటులో ఉంచారు. ఇలా నిత్యయవ్వనంతో జీవించటమే ఆ గొప్ప తత్త్వవేత్త మనకు ఇచ్చిన సందేశం.

■ బొల్లోజు బాబా



షాపల్లిలో భర్త ఇంటి ముందు దీక్ష చేపట్టిన శ్రావణి

ప్లాట్ కొనిస్తేనే కాపురానికి తీసుకెళ్తారట..


- అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు
- షాపల్లిలో భర్త ఇంటి ఎదుట నిరసన

7

లక్ష్యాన్ని మించి బ్యాంకు లింకేజీ

- 2024-25లో మహిళా సంఘాలకు రూ.511 కోట్లు
- 2025-26లో రూ.483 కోట్లు లక్ష్యం
- ఇప్పటికే రూ.91 కోట్లు వితరణ
- మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లో ముందంజ
- జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ పంప్
- విజయవంతంగా మహిళా శక్తి క్యాంటీన్లు
- ధాన్యం సేకరణ ద్వారా రూ.1.55 కోట్ల ఆర్జన
- రూ.5 కోట్లతో నాలుగు సౌరశక్తి ప్లాంట్లు

వచ్చే ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అడుగులేస్తోంది. ఈ లక్ష్య సాధనకు మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను అందజేస్తోంది. ఆ దిశగా మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) ఇచ్చే బ్యాంకు లింకేజీ రుణ నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలోనే హనుమకొండ జిల్లా ముందున్నది.



హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 సంవత్సరంలో 8220 స్వయం సహాయక సంఘాలకు రూ.482.23 కోట్ల మేర బ్యాంకు లింకేజీ లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి 5052 సంఘాలకు రూ.511.09 కోట్ల వరకు లింకేజీతో 105.99 శాతం లక్ష్యాన్ని సాధించింది. హసన్‌పర్తి మండలంలో 351 ఎస్‌హెచ్‌జీలకు రూ. 31.29 కోట్లు, ఐనవోలులో 430 సంఘాలకు రూ. 49.08 కోట్లు, ధర్మసాగర్‌లో 444 సంఘాలకు రూ. 4816 కోట్లు, వేలేరులో 296 సంఘాలకు రూ. 26.54 కోట్లు, ఆత్మకూరులో 337 సంఘాలకు రూ. 42.45 కోట్లు, దామెరలో 292 సంఘాలకు రూ. 35.49 కోట్లు, నడికుడలో 211 సంఘాలకు రూ. 22.86 కోట్లు పరకాలలో 201 సంఘాలకు రూ.16.29 కోట్లు, కమలాపూర్‌లో 1064 సంఘాలకు రూ. 99.38 కోట్లు, భీమదేవరపల్లిలో 608 సంఘాలకు రూ. 56.68 కోట్లు ఎల్కతుర్తిలో 333 సంఘాలకు రూ. 45.15 కోట్లు, శాయంపేటలో 485 సంఘాలకు రూ. 37,72 కోట్లు లింకేజీ ఇచ్చారు. కాగా 2025-26 సంవత్సరంలో 7902 స్వయం సహాయక సంఘాలకు రూ. 483.40 కోట్ల రుణాలకు బ్యాంకు లింకేజీ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 909 సంఘాలకు రూ. 91.23 కోట్ల మేర ఇచ్చారు. 18.87 శాతం లక్ష్యాన్ని ఇప్పటికే సాధించారు.

మైక్రో ఎంటర్‌ప్రైజెస్

మహిళలు స్వయం ఉపాధిని పొందడం ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించే లక్ష్యంగా సూక్ష్మతరహా పరిశ్రమల స్థాపనకు రుణాలు ఇవ్వడంలో కూడా వందశాతం లక్ష్యాన్ని సెర్ప్ సాధించింది. 2024-25 సంవత్సరంలో 5837 ఎస్‌హెచ్‌జీలకు రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం. కాగా, 5921 సంఘాలకు రుణాలు ఇచ్చి 101 శాతం లక్ష్యాన్ని సాధించింది. 2025-26 సంవత్సరంలో 7149 సంఘాలకు రుణాలివ్వాలన్నది లక్ష్యం.

పెరుగుతున్న సభ్యత్వం

బ్యాంకు లింకేజీ, ప్రమాద బీమా, రుణ బీమాతో పాటు ప్రభుత్వం సకాలంలో వడ్డీలు చెల్లిస్తుండడంతో మహిళా సంఘాల్లో కొత్త సభ్యులు ఉత్సాహంగా చేరుతున్నారు. దీంతో పాటు మహిళా సంఘాల్లో చేరే సభ్యుల అర్హత వయసును సడలించారు. గతంలో 18 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళలకే అవకాశాలు ఉండగా ఇప్పుడు 15-65 ఏళ్ల మహిళలకు మహిళా సంఘాల్లో చేరే అవకాశం కల్పించారు. దీంతో పాటు దివ్యాంగ మహిళలకు ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ ఊపందుకుంది.

యూనిఫారాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు స్కూల్ యూనిఫామ్‌లను కుట్టే పనిని ఎస్‌హెచ్‌జీలకే అప్పగించారు. దీని వల్ల జిల్లాలో ఈ ఏడు 347 పాఠశాలలకు చెందిన 19246 మంది విద్యార్థులకు రెండేసి జతల చొప్పున యూనిఫామ్‌లు కుట్టడం ద్వారా మహిళా సంఘాలు రూ. 14,43,450 ఆదాయాన్ని సంపాదించాయి.

సోలార్ ప్లాంట్లు

మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంలో భాగంగా ఏర్పాటు చేసిన సౌరశక్తి పథకం(కుసుమ్) కింద జిల్లాలో నాలుగు సౌరశక్తి ప్లాంట్ల ఏర్పాటు జరుగుతోంది. ఎల్కతుర్తి మండలంలోని సూరారంలో, అలాగే ఆత్మకూరు మండల కేంద్రంలో 0.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌరశక్తి ప్లాంట్లను రెండేసి ఎకరాల చొప్పున మొత్తం 8 ఎకరాల్లో రూ. 5.80 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్నాయి. సూరారంలో భాగ్యలక్ష్మి, సరస్వతి, ఆత్మకూరులో స్నేహ, యమున గ్రామైక్య సంఘాలు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. ఒక్కోక ప్లాంట్లు వ్యయం రూ.1.45 కోట్లు.

ఇందిర మహిళాశక్తి క్యాంటీన్లు

మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయి. హసన్‌పర్తిలోని టీటీడీసీ ఆవరణలో ఆదర్శ ఎస్‌హెచ్‌జీ, ఐనవోలు క్రాస్ రోడ్డు వద్ద ఎల్లమ్మ ఎస్‌హెచ్‌జీ, ఎల్కతుర్తి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఐశ్వర్య ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో ఈ క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి.

ధాన్యం సేకరణ

జిల్లాలోని వివిధ ఎస్ఎస్‌హెచ్‌జీలు ధాన్యం సేకరణ ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. 2024-25లో 70 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా 8831 మంది రైతుల నుంచి 485424.8 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించడం ద్వారా కమిషన్ రూపంలో రూ. 1,55,33,594 సంపాదించాయి. ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఈవెంట్ మేనేజ్‌మెంట్ ద్వారా కూడా ఆదాయార్జనకు గాను సెర్ప్ రుణాలను అందజేస్తోంది. కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ వంటి ద్వారా కూడా ఎస్‌హెచ్‌జీలు జీవనోపాధి పొందేందుకు సైతం రుణాలను సమకూరుస్తోంది.

వుమెన్ హబ్

మహిళలకు ఆయా వృత్తుల్లో శిక్షణ ఇవ్వటమే కాకుండా వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు పరకాలలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యాన్యుఫ్యాక్టరింగ్ హెమ్(ఎస్‌డీఎంహెచ్) ద్వారా మహిళలు శిక్షణ పొందుతున్నారు. దామెర మండలం (మిగతా 8లో..)

అక్రమంగా ఇసుక తవ్వకాలు

పాకాల సరస్సును పరిరక్షించాలి

పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ కావ్య



హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎంపీ కడియం కావ్య సోమవారం పార్లమెంట్ లో గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, పాకాల సరస్సు అభయారణ్యం పరిరక్షణ, ఎకోటూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా పర్యావరణ అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉందని కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ గ్రీన్ ఇండియా మిషన్ మొక్కల పెంపకం ప్రాజెక్టు గురించి, పాకాల వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం ఏర్పాటు గురించి అడిగారు. ఇటీవల ఎకోటూరిజం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై జాతీయ గ్రీన్ ఇండియా మిషన్ నిధుల విడుదల గురించి ప్రశ్నించారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సమాధానం ఇస్తూ గోదావరి నది తీరాల్లో అక్రమ ఇసుక తవ్వకాల వల్ల కలిగే నష్టాన్ని బేరీజు వేస్తున్నామన్నారు. జాతీయ గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో చేపడుతున్న చర్యల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, ఇతర సాంకేతిక అంశాలను పరిగణలోకితీసుకోవడం ద్వారా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తమ వైపు నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇసుక అక్రమ రవాణా కార్యకలాపాల నిరోధానికి 2016, 2020 సంవత్సరాల్లో పర్యావరణ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వరంగల్‌లో గ్రీన్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణ అమలవుతుందన్నారు. మొక్కల పెంపకం, పచ్చదనం విస్తరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నుండి ప్రణాళిక వివరాలు అందాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు

రేషన్‌కార్డులు రెడీ

- 25 నుంచి మండల కేంద్రాల్లో పంపిణీ
- నూతన కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

6

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పేద కుటుంబాలకు సంజీవని రేషన్ కార్డులు
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పేదలకు రేషన్ కార్డులు ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కార్డులు పేద కుటుంబాలకు సంజీవని లాంటివేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 2,469 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కొత్త రేషన్ కార్డులను మేయర్ గుండు సుధారాణితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతీ పథకం అట్టడుగు వర్గాలకు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ప్రవేశపెట్టిన పథకాలు ఆరోగ్యశ్రీ, 104, 108, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలు పేదలకు బాసటగా నిలిచాయని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్‌కార్డుల మంజూరు, రుణమాఫీ, ప్రజా ప్రభుత్వం ద్వారానే సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు. సన్నబియ్యం పథకం ద్వారా ప్రతీ ఇంటికి సన్నబియ్యం సరఫరా అవుతున్నాయని చెప్పారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ పథకం పారదర్శకంగా అమలుచేస్తూ లబ్ధిదారులకు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు ఏనుగుల మానస రాంప్రసాద్, మామిండ్ల రాజు, శ్రీమాన్, జక్కుల రవీందర్, వేముల శ్రీనివాస్, విజయశ్రీ రజాలీ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్‌లో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి

అతిథి అధ్యాపకుల నియామకాలకు

24న ఇంటర్వ్యూలు

వడ్డెపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను వివిధ సబ్జెక్టులలో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకాలకు ఈ నెల 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ తెలిపారు. బయాటెక్నాలజీ, స్టాటిస్టిక్స్, అప్లైడ్ న్యూట్రిషన్, బీసీఏలలో ఒకటి చొప్పున, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ లో రెండు, డాటా సైన్స్, ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, బీబీఏ రిటైల్ ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. మైక్రోబయాలజీలో గల ఒక ఖాళీకి తాత్కాలిక అతిథి అధ్యాపకుడి నియామకం కోసం సైతం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బయోడేటాను ఈ నెల 23 లోపు కళాశాలలో అందజేయాలని, వివరాలకు సెల్ నంబర్ 98661 92306లో సంప్రదించాలని కోరారు.

అన్నదాతల్లో చిగురించిన ఆశలు

ఎట్టకేలకు పలకరించిన వరుణుడు

- మోస్తరు వర్షపాతం నమోదు..
- రోజంతా మేఘావృతమై వున్న వాతావరణం
- పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం
- సాగు పనులకు మళ్లీ శ్రీకారం



నర్సంపేట-రాజుపేట సమీపంలో పత్తి పంటలోకి చేరిన నీరు

నారు తీస్తున్న కూలీలు

హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో సోమవారం మోస్తరు వర్షాలు కురిసాయి. వర్షాలు ఆలస్యం కావడంతో ఆందోళనలో వున్న రైతులకు.. తాజా వాతావరణం ఉపశమనం కలిగిస్తోంది. ఈ నెల 27 వరకు వర్షాలు వున్నట్టు వాతావరణ శాఖ చెబుతుండటంతో ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. పత్తి, మొక్కజొన్న, పసుపు, పెసర పంటలు, పండ్లు, కూరగాయల తోటలకు ఈ వర్షాలు జీవం పోస్తున్నాయి. అయితే భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కూడా లేకపోవడం గమనార్హం.

హనుమకొండ జిల్లాలో సోమవారం తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉండి మధ్యాహ్నం మోస్తరు వర్షం పడింది. 15.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, దామెర, ఆత్మకూరు మండలాల్లో మోస్తరు వర్షం పడగా, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు, ఎల్కతుర్తి, కమలాపూర్ నడికూడ, పరకాల, (మిగతా 8లో..)

వరంగల్ జిల్లాలో...

వరంగల్ వ్యవసాయం (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో సోమవారం 33.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. మూడు గ్రామాల్లో భారీ వర్షం కురువగా తొమ్మిది గ్రామాల్లో సాధారణ వర్షం పడింది. మిగితా గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రైతులు వరి నార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం ఇప్పటి వరకు సుమారు 3లక్షల 13 వేల ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతానికి లక్షా నలభై వేల ఎకరాల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయి. నెల రోజులుగా వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ సాగు పనులు ఊపందుకునేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి.

గోదావరి పరవళ్లు

- ఎగువన వర్షాలతో కాళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద
- సమ్మక్క బ్యారేజీలోకి 1,15,070 క్యూసెక్కులు
- కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

6

పేదోళ్ల కలలు సాకారం చేస్తాం

- అప్పులు ఎన్ని ఉన్నా హామీలు నెరవేరుస్తాం
- ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు
- మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



భూపాలపల్లిలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

గణపురం/భూపాలపల్లిటౌన్/రేగొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి ఎన్ని అప్పులున్నా ఇచ్చిన మాటకు కట్టుబడి పేదోళ్ల కలలను నెరవేరుస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో సోమవారం వారు పర్యటించారు. కొత్తపల్లిగోరి, గణపురం మండలంలోని చెల్పూరు, భూపాలపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. గణపురం మండలం చెల్పూరులో బస్టాండు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. భూపాలపల్లి పట్టణంలో జిల్లా గ్రంథాలయ భవనాన్ని, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కార్యాలయాన్ని ప్రారంభించారు. భాస్కరగడ్డ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పట్టాలు పంపిణీ చేసి, గృహ ప్రవేశం చేయించారు. కొత్తపల్లిగోరి చెల్పూరు, భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వై.ఎస్.రాజశేఖరరెడ్డిని స్ఫూర్తిగా తీసుకున్న నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారని కొనియాడారు. మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ కేంద్రాలు, పెట్రోల్ బంక్‌లు, ధాన్యం సేకరణ కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు లాంటి కార్యక్రమాలను చేపడుతూ మహిళల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఎన్ని అప్పులున్నా... ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్లుగా భావించి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరిగేవారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.పేద విద్యార్థుల కోసం రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గణపురంలో 60ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేశామని, మహిళలకు మినీ ఇండస్ట్రీలు ఏర్పాటు చేయడం కోసం 20 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాకు బైపాస్ రోడ్డు, మైనింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. డీబీఎం 38కాల్వకు రూ. 320 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్టీసీ అధికారులు సలోమం, విజయభాను, ఇందు, సింగిల్ విండో చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు పెట్టుబడి కష్టాలు

ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులు

వరంగల్ జిల్లాకు 8,692 ఇళ్లు మంజూరు

వరంగల్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదవారి కోసం అందిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పెట్టుబడి కష్టాలు ఎదురవుతున్నాయి. వరంగల్ జిల్లాలో మొదటి విడత ఇళ్లు మంజూరు చేసి దాదాపు ఐదు నెలలు గడిచినా అనేక మంది నిర్మాణ పనులను ఇంకా ప్రారంభించలేదు. కొందరు పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తి చేసుకొని డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మరి కొందరు పాత ఇళ్లను తొలగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి డబ్బులు మంజూరు కావాలంటే ముందు లబ్ధిదారులు సొంత ఖర్చుతో బేస్‌మెంట్, పిల్లర్ల వరకు నిర్మించాలి. ఇందుకోసం దాదాపు రూ.60వేల నుంచి రూ.70వేలకు పైగా ఖర్చు అవుతోంది. అంత మొత్తం పెట్టుబడి పెట్టేందుకు ఆర్థిక స్థోమత లేక కొందరు పనులను ప్రారంభించలేకపోతున్నారు. ఈ కారణంగా దాదాపు 3,718 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేదని అధికారులు చెబుతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బంది..

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాము నివసిస్తున్న పాత ఇంటిని కూల్చివేసి కొత్త ఇంటిని నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఎందుకంటే ఇంటి నిర్మాణం పూర్తయ్యేందుకు కనీసం ఆరు నెలలు సమయం పడుతుందని, అప్పటి వరకు తాము ఎక్కడ నివసించాలని ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో అద్దెకు ఇళ్లు దొరికినా కూడా ఇంటి అద్దె కట్టడానికి తమకు ఆర్థిక స్థోమత లేదని వాపోతున్నారు. ఇక పోతే గ్రామీణ ప్రాంతాల్లో అద్దెకు ఇల్లు దొరకడం కష్టమని లబ్ధిదారులు చెబుతున్నారు.



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

ప్రారంభం కాని 3,718 ఇళ్లు

వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 8,692 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. అందులో గ్రౌండింగ్ లెవల్ 4,974 ఇళ్లు పూర్తి కాగా వాటిలో బేస్‌మెంట్ లెవల్ 1,599 పూర్తి అయ్యాయి. రూఫ్ ఆర్‌సీసీ లెవల్ వరకు 84 ఇళ్లు పూర్తి కాగా స్లాబ్ లెవల్ వరకు 47 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 3,718 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు.

రుణ సదుపాయం కల్పించాలి

ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు. మొదట సొంత డబ్బుతో బేస్‌మెంట్ నిర్మించుకుంటే ప్రభుత్వం వారి ఖాతాలో రూ.ఒక లక్ష జమ అవుతాయని, ఆ తరువాత దశల వారీగా పైకప్పు స్థాయి వరకు నిర్మించుకుంటే వెంట వెంటనే వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ముందస్తుగా డబ్బు ఖర్చు పెట్టలేని లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఇబ్బంది పడుతున్నారు.

మహిళా సంఘాల ద్వారా రుణం తీసుకోవచ్చు



ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారుల వద్ద డబ్బులు లేకుంటే మహిళా సంఘాల ద్వారా అప్పు తీసుకునే వెసులుబాటు కల్పించాం. ఈ విషయంపై ఆయా సంఘాలకు ఇప్పటికే సూచనలు ఇచ్చాం. అయినా కూడా ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రాకపోతే వారి స్థానంలో మరొకరికి కేటాయిస్తాం. ఉచితంగా ఇసుక అందజేయడానికి కమిటీలు వేశాం. కమిటీ నిర్ణయం రావడంతోనే ఉచితంగా ఇసుక అందజేస్తాం. కాబట్టి ఇల్లు నిర్మించుకొని లబ్ధి పొందాలి. - వి.గణపతి, ప్రాజెక్టు డైరెక్టర్, వరంగల్ జిల్లా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్) దశలవారి పోరాటాన్ని విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. సోమవారం సుబేదారిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో యూఎస్‌పీసీ హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో మండల తహసీల్దార్లకు, ముఖ్యమంత్రికి వినతిపత్రాలు సమర్పిస్తామని, ఆగస్టు 1వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అర్హత లేని డీఈవోలను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రమేశ్, పెండెం రాజు, సుజన్ ప్రసాద్‌రావు, ఊటుకూరి అశోక్, ఆకుల గోవిందరావు, గుడిశాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హడుప్సా నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) 2025-27 రెండు సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని సోమవారం గోపాల్‌పూర్‌లోని విద్యాధరి హైస్కూల్‌లో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల సంతోష్‌రెడ్డి, కోశాధికారిగా దామెరుప్పుల శంకర్, ఉపాధ్యక్షులుగా టి.రాజేశ్వర్‌రావు, కరుణాకర్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా జి.సురేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.వెంకట్‌రెడ్డి, సహాయ కోశాధికారిగా నవీన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారు వర్ధమాన్ జనార్దన్, సలహాదారులు పి.వెంకటరమణ, ఎన్.శ్రీనివాసరెడ్డి, పి.వేణుమాధవరావు, వై.వెంకటేశ్వర్‌రావు, హడుప్స సభ్యులు పాల్గొన్నారు.

'కాళోజీ' ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఫిర్యాదు

● విచారణ చేస్తున్న పోలీసులు

వరంగల్ మెడికల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కేంద్రంలోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై పోలీసులకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నాగార్జునరెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. విశ్వవిద్యాలయంలోని కొందరు సిబ్బందిని పోలీసులు విచారించారు. కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఫొటోలు, రికార్డులు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉప కులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డి మాటలను ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రికార్డు చేస్తూ బ్లాక్ మెయిల్‌కు దిగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గవర్నర్‌కు ఉద్యోగుల ఫిర్యాదు..

కాగా, విశ్వవిద్యాలయంలో ఇటీవల అకారణంగా ఏడుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించిన విషయంలో వారు విశ్వవిద్యాలయం ఉప కులపతిపై గవర్నర్‌తోపాటు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. చిరుద్యోగుల విషయంలో వైస్ చాన్స్‌లర్ వ్యవహరిస్తున్న తీరుపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని వీసీ ఇంట్లో పని చేసేందుకు అంగీకరించకపోవడంతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు.

23న సాగునీరు విడుదల చేస్తాం

● పది రోజులు మాత్రమే కాల్వలకు జలాలు

● నీటి తరలింపునకు మోటార్లలో సాంకేతిక సమస్యలు

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నార్లు ఎండిపోకుండా 23న నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్ల నుంచి కాల్వలకు సాగునీరు విడుదల చేస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి సాగునీరు అందించడానికి సాంకేతిక సమస్యలు తలెత్తి మోటార్లు నడవడం లేదన్నారు. గోదావరి నుంచి 1,200 క్యూసెక్కుల నీటిని దేవాదుల రిజర్వాయర్లకు తరలించాల్సి ఉండగా సాంకేతిక సమస్యలతో సాధ్యం కావడం లేదన్నారు. అయినా ఘన్‌పూర్, ధర్మసాగర్, మల్లన్నగండి, అశ్వరావుపల్లి రిజర్వాయర్లలో నీటి నిలువలు పెంచే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటితో నార్లను కాపాడుకొని, రైతులు నాట్లు వేసుకునేందుకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు.

మల్లన్నగండి కుడికాల్వ, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయడంతోపాటు, ఘన్‌పూర్- నవాబుపేట మెయిన్ కెనాల్‌కు, అనుసంధానంగా ఉన్న 1ఎల్ నుంచి 20ఎల్ సబ్ కెనాల్ వరకు జలాలను తరలించేలా చూస్తామని తెలిపారు. అశ్వరావుపల్లి రైట్ మెయిన్ కెనాల్ నుంచి కాల్వలకు, చీటకోడూరు రిజర్వాయర్‌కు వెళ్లే క్వాలకు నీళ్లను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కేవలం పదిరోజుల పాటు మాత్రమే కాల్వలకు ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలకు రైతులు సహకరించాలని కోరారు. కాలువల ద్వారా వచ్చే సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, సీహెచ్ నరేందర్ రెడ్డి, బూర్ల శంకర్, మామిడాల లింగారెడ్డి, బానోతు రాజేష్‌నాయక్, లింగాజీ, జగదీష్‌చందర్ రెడ్డి, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, తెల్లాకుల రామకృష్ణ, బొల్లం అజయ్, నీల గట్టయ్య, గట్టు రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హాస్టల్ నుంచి పారిపోయిన బాలిక

● తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై

● గంట వ్యవధిలో బాలిక ఆచూకీ లభ్యం

నెక్కొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ నుంచి పారిపోయిన విషయమై ఫిర్యాదు రావడంతో ఒక గంట వ్యవధిలో బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బాలిక నెక్కొండలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది. హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేని బాలిక సోమవారం సాయంత్రం 4.30 గంటలకు హాస్టల్ నుంచి పారిపోయింది. బాలిక హాస్టల్‌లో కనిపించకపోవడంతో సాయంత్రం 6.30 గంటలకు పోలీసులకు తెలిపారు. పోలీసులు మూడు బృందాలుగా బాలిక ఆచూకీ కోసం గాలించారు. బాలిక తన ఇంటికి వెళ్లే క్రమంలో వర్షం వస్తుండడంతో మండలంలోని అలంకానిపేట గ్రామంలోని బస్టాండ్‌లో ఉన్న విషయాన్ని గుర్తించిన ఎస్సై బాలికను అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల సమక్షంలో అక్షితను తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై మహేందర్‌కు బాలిక తల్లిదండ్రులు, తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జాబ్ మేళా

హనుమకొండ కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం వరంగల్ ములుగురోడ్‌లోని ఐటీఐ కళాశాలలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీమార్ట్ హనుమకొండ, నిర్మాణ్ ఆర్గనైజేషన్, హైదరాబాద్‌లో టెలీకాలర్స్, సీసీటీవీ మానిటరింగ్, హెచ్‌ఆర్, ఎగ్జిక్యూటివ్ తదతర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10 నుంచి 15 వేల వరకు వేతనం ఉంటుందని, అభ్యర్థులు 10వ తరగతి నుంచి డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఉద్యోగం కావాలనుకునే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఉదయం 10:30 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 78936 60741, 78933 94393 నెంబర్లలో సంప్రదించాలని మల్లయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

కేడీసీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో 2025-26 సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ, బీబీఏ కోర్సులలో 6 పోస్టులు, క్రాప్ ప్రొడక్షన్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఫిషరీస్, మైక్రో బయోలజీ, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులుండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్, అర్హత కలిగిన వారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 24, సాయంత్రం 4 గంటల వరకు కళాశాల పనిదినాల్లో దరఖాస్తులను అందచేయాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రజనీలతను సంప్రదించాలని కోరారు.

ప్రత్యూష మృతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉద్యోగ సంఘాల నాయకుల డిమాండ్

హసన్‌పర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యూష సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రత్యూష మృతి కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కొన్ని శక్తులు ఈ కేసును పక్కదారి పట్టించి నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఎటువంటి శక్తులకు లొంగకుండా కేసు దర్యాప్తును పూర్తి చేసి ఆ కుటుంబానికి, పిల్లలకు న్యాయం చేయాలని కోరారు.

ఈ సభలో పాల్గొన్న జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు, టీజీవో, టీఎన్‌జీవో, ట్రెస్సా, ఐఎన్‌టీయూసీ, పెన్షనర్లు, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు, వివిధ భాగస్వామ్య ఉద్యోగ సంఘాలన్నీ బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చి వారికి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సభకు సంఘీభావం తెలిపి నిందితులకు శిక్ష పడే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్, కార్యదర్శి సోమన్న, వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల రాంకిషన్, కార్యదర్శి వేణుగోపాల్, భూపాలపల్లి ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ బూరుగు రవి, కార్యదర్శి జనగాం దశరథ రామరాజు, ఉద్యోగ సంఘాల జిల్లా జేఏసీ చైర్మన్ ఖాజా పాషా, కార్యదర్శి శ్రీనివాస్, ములుగు జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ పోలురాజు, కార్యదర్శి చైతన్య, తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు దాస్య నాయక్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు బత్తిని సుదర్శన్‌గౌడ్, ప్రమోద్‌కుమార్, టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం నాయకులు శ్యాంప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ప్రత్యూష సంతాప సభలో పాల్గొన్న వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు

రేషన్‌కార్డులు రెడీ

25 నుంచి మండల కేంద్రాల్లో పంపిణీ

నూతన కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్/ వరంగల్ కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు మండల కేంద్రాల్లో రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల కలెక్టర్‌లకు సూచించారు. రేషన్‌కార్డుల పంపిణీ, వానాకాలం సాగు, భారీ వర్షాలు వంటి పలు అంశాలపై సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. భారీ వర్షాల వల్ల ప్రమాదాలు జరగకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల డీలర్ల దగ్గర ఉన్న స్టాక్ వివరాలు నోటీస్ బోర్డుపై నమోదు చేయాలన్నారు. వానాకాలం పంటల సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీఏవో రవీందర్‌సింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డీఏఓ అనురాధ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదావరి పరవళ్లు

● ఎగువన వర్షాలతో కాళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద

● సమ్మక్క బ్యారేజీలోకి 1,15,070 క్యూసెక్కులు ● కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

మహదేవపూర్/మహదేవపూర్ రూరల్/ కన్నాయిగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సోమవారం గోదావరి పెరిగింది. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురవడంతో ప్రాణహిత నదికి వరదనీరు చేరుతోంది. దీంతో త్రివేణి సంగమం వద్ద 6 మీటర్ల మేర గోదావరి ప్రవహిస్తోంది. రెండు రోజుల కంటే సోమవారం గోదావరి నీటిమట్టం పెరిగిందని అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి...

మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. వారం రోజులుగా బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 80వేల క్యూసెక్కులు ఉండగా సోమవారం 1.23 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 2.40 మీటర్లుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు.

సమ్మక్క బ్యారేజీలోకి...

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద సోమవారం గోదావరి స్వల్పంగా పెరిగింది. గురువారం వరకు సమ్మక్క సాగర్ బ్యారేజీని ఫ్రీ ఫ్లోగా ఉంచిన ఇరిగేషన్ అధికారులు శుక్రవారం నుంచి ఒక్కొక్క గేట్లు మూసుకుంటూ వస్తున్నారు. దీంతో బ్యారేజీలో నీటిమట్టం పెరుగుతోంది. ఆదివారం నుంచి గోదావరిలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగి 91,300 క్యూసెక్కులకు చేరింది. సోమవారం సాయంత్రానికి 1,15,070 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో బ్యారేజీలోని 53 గేట్లను మూసి ఆరు గేట్ల ద్వారా 1,09,470 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతు న్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.388 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద 78.90 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



కాళేశ్వరం వద్ద గోదావరి

దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం మండలంలోని గుట్టలగంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగు తోంది. ఆదివారం వరకు ఫేజ్-2 నుంచి రెండు మోటార్లు, ఫేజ్-3 నుంచి రెండు మొత్తం నాలుగు మోటార్ల ద్వారా 1078 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోసిన అధికారులు సోమవారం ఫేజ్-3లో మరో రెండు మోటార్లను ఆన్ చేశారు. దీంతో ఫేజ్-2లో రెండు, ఫేజ్-3లో నాలుగు మొత్తం ఆరు మోటార్ల ద్వారా 1661 క్యూసెక్కుల నీటిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్వెల్ వద్ద 79.10 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

ములుగు జిల్లాకు నిధుల వరద

- రెండేళ్లలో సుమారు వెయ్యి కోట్ల నిధులు
- ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి సీతక్క
- రూ. 556.1 కోట్ల ఆర్అండ్‌బీ నిధులు
- రూ. 301.47 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ నిధులు
- రూ. 98 కోట్ల గిరిజన అభివృద్ధి శాఖ నిధులు

ములుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వెనుక బడిన జిల్లాలో ఒకటైన ములుగు జిల్లా గత కొంత కాలంగా అభివృద్ధి పదంలో పయనిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారరంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి సీతక్క జిల్లా అభి వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో జిల్లా సమగ్రా భివృద్ధి కోసం ఇప్పటి వరకు సుమారు వెయ్యి కోట్లపైనే ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ నుంచి రూ. 301.47 కోట్ల నిధులు, రహదా రులు, భవనముల శాఖ నుంచి 556.1 కోట్లు, గిరిజన అభివృద్ధి శాఖ నుంచి రూ. 98 కోట్లు వెచ్చించి పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, ఇందిరా మహిళా శక్తి, కలెక్టరెట్ భవన సముదాయం, మేడారం అభివద్ధి పనులు వంటివి చేపట్టారు. అందులో కొన్ని పనులు పూర్తి కగా మరి కొన్ని పనులు కొనసాగుతున్నాయి.


ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

పంచాయతీ రాజ్ శాఖ నిధులు

గత రెండు సంవత్సరాలలో రూ. 301.47 కోట్లతో జిల్లాలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల, అంగ న్వాడి సెంటర్లు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేం దుకు పనులు ప్రారంభించారు. ఇందులో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వార రూ. 17.29 కోట్ల అంచనా వ్యయంతో 24 సీసీ రోడ్లు, 38 గ్రామ పంచాయతీ భవనాలు, 49 అంగన్వాడి కేంద్రాలు, 76 పాఠశాలల్లో మరుగుదొడ్ల పనులు చేపట్టారు. సీఈఆర్ పథకం ద్వార రూ.73.98 కోట్లతో 37 రోడ్లు, ఎంఆర్ఆర్ పథకం ద్వార 109.76 కోట్లతో 62 రోడ్లను వేసేందుకు చర్యలు చేపట్టారు. ఎఫ్‌డీఆర్, ఎస్డీఆర్ పథకాల ద్వార రూ. 28.49 కోట్ల నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. ఎస్ డీ ఎఫ్ గ్రాంటు కింద, ఎస్టీ కంపోనెంట్స్ లో రూ. 33.25 కోట్ల నిధులతో 10 రోడ్లను మంజూరు చేశారు. సీసీఆర్ గ్రాంట్ కింద రూ. 31.20 కోట్ల నిధులతో 666 ఇంటర్నల్ సీసీ రోడ్లు మంజూరు చేశారు. రూ. 5 కోట్లతో జిల్లా కేంద్రంలో ఇందిరా శక్తి భవనాన్ని నిర్మిస్తున్నారు. సీ ఎస్ ఆర్ నిధులు రూ. 2.50 కోట్ల నిధు లతో జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగా రంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పలు పనులు పూర్తి కాగా మరి కొన్ని పనులు కొనసాగుతున్నాయి.

ఆర్ అండ్ బి నిధులు

జిల్లాలో పలు అభివృద్ధి పనుల కోసం రహదారులు, భవనాల శాఖ నుంచి రూ. 556.1 కోట్లు వెచ్చించి పలు పనులను చేపట్టారు. ఇందులో ఎస్టీ యస్ డీ ఎఫ్, ఆర్ డీ ఎఫ్ తదితర పథకాల ద్వార రూ. 492.60 కోట్ల నిధులతో 72 అభి వృద్ధి పనులు చేపట్టారు. అలాగే రూ.63.50 కోట్ల నిధులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని (కలెక్టరెట్) నిర్మిస్తున్నారు.

గిరిజన శాఖ నిధులు

ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నిర్వహించిన మినీ మేడారం శ్రీ సమ్మక్క- సారల్మ జాతర కోసం రూ. 5.33 కోట్లు వెచ్చించి 69 పనులు పూర్తి చేశారు. ఎస్టీ, ఎస్డి ఎఫ్ పథకంలో భాగంగా గత రెండు సంవత్సరాలలో రూ. 68.51 కోట్లతో 52 రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో 12 రోడ్లు పూర్తి కాగా మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. రూ. 5కోట్లతో 25 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో 2 భవనాలు పూర్తి కాగా మిగినవి పురోగతిలో ఉన్నవి. ఏఎస్ఎస్‌టీ టూ ఐటీడీఏ లో భాగంగా 7.23 కోట్ల నిధులతో 110 పనులు చేపట్టారు. రూ. 11.65 కోట్లతో అంగన్వాడి సెంటర్లు, ఆశ్రమ పాఠశాలలు, సబ్ సెంటర్ల మర మ్మతులు చేపట్టారు. 2024లో జరిగిన మేడారం మహా జాతర కోసం రూ. 115 కోట్లు వెచ్చించారు. 2026 జనవరి 28నుంచి ప్రారంభం కానున్న మేడారం మహా జాతర కోసం శాశ్వత రోడ్లు నిర్మించేందుకు రూ. 33 కోట్లు వెచ్చించారు. ఇటీవల ములుగు జిల్లా కేంద్రంలో రూ.4.80 కోట్లతో అదునాతన బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేశారు. అలాగే రూ. 6.28 కోట్లతో ఏటూరునాగారంలో బస్ డిపోను ఏర్పాటు చేయున్నారు. రూ. 52 లక్షలతో మంగపేటలో బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలగ వద్దని బుచ్చంపేట, అడవిరంగాపూర్, గట్టమ్మ, జగ్గన్నపేట, నార్లాపూర్, లింగాల, రొయ్యూరు గ్రామాలలో సబ్‌స్టేషన్‌లు ఏర్పాటుకు మంత్రి కృషి చేస్తున్నారు. ఇప్పటికే భూమి కొను గోలు చేశారు. పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

అక్షరాల అగ్నిధార దాశరథి

- తెలంగాణ అస్తిత్వపు భావాజాలాన్ని చాటిన సాహితీ యోధుడు
- నేడు శత జయంతి


చిన్నగూడూరులో2008లో ఏర్పాటు చేసిన దాశరథి కృష్ణమాచార్య విగ్రహం

చిన్నగూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నిజాం ఏలుబడిలో రజాకార్ల అరాచకాలను ఎదిరించిన అక్షరాల అగ్నిధార దాశరథి కృష్ణమాచార్య. తన అక్షరాలతో తెలంగా ణలో విప్లవాగ్నిని రగిలించి, తెలంగాణ విముక్తి కోసం అలుపెరగని పోరాటంచే శారు. నిర్బంధించినా ప్రళయంలాంటి కవిత లతో విరుచుకుపడ్డారు. ఆయనను జైలులో బంధించినప్పుడు జైలు గోడలపై నిజాంకు వ్యతిరేకంగా బొగ్గుతో కవితలు రాశారు. ఓ నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగెలనుతెంపి అగ్నిలో దించినావు నాతెలంగాణ కోటి రత్నాల వీణ అని ఎలుగెత్తారు. తన రచనలతో తెలం గాణ అస్తిత్వపు భావజాలాన్ని నలుదిశలా చాటిన సాహితీ యోధుడు దాశరథి. అందుకే తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఓ ధ్రువతారలా నిలిచారు. నిజాం అరాచక పాలనలో మగ్గిపోతున్న తెలంగాణను తన కవిత్వంతో తట్టిలేపిన ప్రజాకవి. సినీరంగ ప్రవేశం చేసి అద్భుత గీతాలెన్నో రాసి, సినిమా పాటల పయోనిధిగానూ ప్రసిద్ధుడ య్యాడు.

తెలుగు సినిమా పాటలకు ఉర్దూపద సౌందర్యాన్ని అద్దిన ఘనతా ఆయనదే. ఆయనకు కళాప్రపూర్ణ బిరుదుతోపాటు 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి. 1974లో కేంద్ర సాహిత్య అకా డమీ బహుమతి, వెంకటేశ్వర యూనివర్సిటీ గౌరవ డి-లిట్‌ను అందుకున్నారు. దాశరథి కృష్ణమాచార్యులు 1925 జూలై 22న చిన్న గూడూరులో జన్మించారు. దాశరథి తన తండ్రి వెంకటాచార్య నుంచి సంస్కృతం, తల్లి వెంకటమ్మ నుంచి భాగవతం నేర్చుకు న్నారు. కౌశవర్య శాస్త్రి వద్ద వేదాలు, ఉపని షత్తులు నేర్చుకున్నారు. 15 ఏళ్ల వయ స్సులో 25 పద్యాలను అవలీలగా చెప్పి అప్పటి సుబేదార్ నారాయణరావు ప్రశం సలు పొందారు. ఉపాధ్యాయుడిగా, పంచా యతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణిలో ఉద్యో గాలు చేశారు. 1961లో సినీరంగ ప్రవేశం చేసి వందలాది పాటలు రాశారు. కృష్ణమా చార్యులను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఘనంగా సత్కరించారు. 1987 నవంబర్ 5వతేదిన ఆయన పరమపదించారు.

దాశరథి విగ్రహం ఏర్పాటు

మహబూబాబాద్ సమైక్య విద్యా సంస్థల వ్యవస్థాపకడు అడ్డగోడ నరేశ్ తన సొంత ఖర్చులతో చిన్నగూడూరులో 2008 నవం బర్ 30న విగ్రహం ఏర్పాటు చేసి ప్రజాకవి గద్దర్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేశారు. దాశరథి శత జయంతి వేడుకలకు ఆయన స్వగ్రామం చిన్నగూడూరులోని దాశరథి ప్రాంగణం ముస్తాబవుతోంది. జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించ డానికి దాశరథి ఉత్సవ కమిటీ, ఆయన అభి మానులు ఏర్పాట్లు చేస్తున్నారు.


గూడూరు మండలం భీమునిపాదంలో జాలువారుతున్న జలపాతం

భీమునిపాదంలో జలసవ్వడి

వర్షాలతో పెరిగిన జలపాత ఉధృతి

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో పచ్చని ప్రకృతి నడుమ నిరంతర భీమునిపాదం జలపాతం ఉన్న విషయం తెలి సిందు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ జలపాతం ఉధృతి స్వల్పంగా పెరిగింది. 70 అడుగుల ఎత్తు నుంచి జాలు వారుతున్న నీటిని చూసి పర్యాటకులు అబ్బురపడుతున్నారు. గలగలపారే సెలయేరు ఒక్కసా రిగా మాయమై గుట్టపై నుంచి జాలువారుతుంటే చూసేందుకు ప్రకృతి ప్రేమి కులను ఆకట్టుకుంటోంది. ఈ జలపాతానికి రాష్ట్రంలో అరుదైన గుర్తింపు ఉంది. వృక్షసంపదతో పాటు రకరకాల పక్షులు కనువిందు చేస్తున్నాయి. ట్రెక్కింగ్, క్యాంపింగ్, అడ్వెంచర్ ఎకో టూరిజానికి అనువైన ప్రాంతంగా నిలుస్తోంది. ఈ దిశగా అటవీ, పర్యాటక శాఖలు చొరవ చూపి ఈ సౌకర్యాలను ఏర్పాటు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి అవాం ఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌రావు, రేంజ్ అధికారి సురేష్‌ల పర్యవేక్షణలో సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ప్లాట్ కొనిస్తేనే కాపురానికి తీసుకెళ్తాడంటా..

- అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు
- షాపల్లిలో భర్త ఇంటి ఎదుట నిరసన
- బాధితురాలు శ్రావణికి అండగా నిలిచిన స్థానికులు


షాపల్లిలో భర్త ఇంటి ముందు దీక్ష చేపట్టిన శ్రావణి

జఫర్‌గడ్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హైద రాబాద్‌లో ప్లాట్ కొని వ్వాలని, అదనపు కట్నం తేవాలంటూ భర్త కాపురానికి తీసుకె ళ్లడం లేదని, తనకు న్యాయం చేయాలని శివరాత్రి శ్రావణి తన భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈఘటన సోమవారం జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం షాపల్లిలో చేసుకుంది. బాధితురాలు శ్రావణి కథనం ప్రకారం. రఘు నాథ్‌పల్లి మండలం కుర్చపల్లికి చెందిన గుర్రంస్వామి -నీలమ్మ దంపతుల కుమార్తె శ్రావణిని, జఫర్‌గడ్ మండలం షాపల్లికి చెందిన శివరాత్రి లక్ష్మీ-వెంక టేశ్‌ల కుమారుడు శ్రీకాంత్‌తో 2023, జూన్‌లో వివాహమైంది. కట్నం కింద రూ.30లక్షలు ఇచ్చారు. శ్రీకాంత్ గ్రామాల్లో చిన్నచిన్న రోడ్డు కాంట్రాక్టులు చేస్తుం టాడు. రెండు నెలలు వీరి కాపురం సాఫీగానే సాగింది. ఆ తర్వాత గొడవలు ఆరంభమయ్యాయి. భర్త, అత్తమామలు అదనపు కట్నం తెమ్మని వేధింపులకు గురిచేస్తూ, ఏడాది క్రితం శ్రావణిని కొట్టి ఇంట్లో నుంచి గెంటేశారు. అప్పటి నుంచి ఆమె పుట్టింటిలోనే ఉంటోంది. కాపురానికి తీసుకెళ్లాలని పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా అతడిలో మార్పు రాలేదు. తాజాగా హైద్రాబాద్‌లో తనకు ప్లాట్ (స్థలం)కొనిస్తేనే కాపురానికి తీసుకువెళ తానంటూ భర్త తేల్చి చెప్పాడు. ప్రస్తుతం భర్త, అత్తమామలు ఘట్‌కేసర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. భర్త శ్రీకాంత్ కూడా అక్కడే ఉంటున్నాడు. కాగా, సోమవారం శ్రావణి షాపల్లిలోని ఇంటికి కుటుంబ సభ్యులతో చేరుకుని ఆందో ళన చేపట్టింది. ప్రస్తుతం ఇంటికి తాళం వేసి ఉండగా, అత్తింటివారు వచ్చిన తనను కాపురానికి తీసుకెళ్లే వరకు ఇక్కడే పోరాటం చేస్తానని శ్రావణి పేర్కొం టోంది. ఆమె ఆందోళనకు గ్రామస్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అక్కడే వంట చేసుకుని నిరసన తెలిపింది.

పచ్చదనం పరిఢవిల్లేలా..

- జిల్లాలోని 337 నర్సరీల్లో 3 లక్షల మొక్కలు సిద్ధం
- వనమహోత్సవానికి అధికారుల ప్రణాళికలు
- జూలై 26 నుంచి ప్రభుత్వ శాఖల అధ్వర్యంలో ఏర్పాట్లు

నెక్కొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొం దించారు. ఇందుకోసం జిల్లాలోని 337 నర్సరీల్లో 32,02,515 మొక్కలను పెంచుతున్నారు. ఈ వనమహోత్సవంలో 70 నుంచి 80 నకాలకు చెందిన 32 వేల మొక్కలు నాటేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని మండలాల అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా సంరక్షకులను నియమించి నీడనిచ్చే మొక్కలు మొదలు పూల, పండ్ల మొక్కలను పెంచారు. నాటిన ఒక్కో మొక్కకు రూ.150 ఖర్చుచేసి రెండేళ్ల వరకూ కాపాడనున్నారు. మొత్తం 26 ప్రభుత్వ శాఖలు పచ్చదనం పరిఢవిల్లేలా కృషిచేయనున్నాయి.

ఒక్కో నర్సరీకి రూ.1.40లక్షల ఖర్చు

ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లాలోని 328 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు అటవీ శాఖ రెండు, జీడబ్ల్యూఎంసీ నాలుగు, నర్సంపేట మునిసి పాలిటీ 7, వర్ధన్నపేట మునిసిపాలిటీలో ఒకటి చొప్పున నర్సరీలు నిర్వహి స్తున్నారు. ఒక్కో నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచుతుండగా ఇందుకోసం నర్సరీకి దాదాపు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కాగా మొక్కల సంరక్షణకు ప్రతీ రోజు రెండు సార్లు నీరుపోయడమే కాకుండా వాటిని ఎండ వేడిమి నుంచి కాపాడుటకు గ్రీన్ పట్టాలను ఏర్పాటు చేశారు. నర్సరీలను సంబంధితాధికారులు ఎప్పటికప్పుడు పర్య వేక్షిస్తున్నారు. నిర్వహకులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇస్తున్నారు.


నెక్కొండ మండలంలోని ముదిగొండ, గుండ్రపల్లి గ్రామాల్లోని నర్సరీలో పెరిగిన మొక్కలు


మొక్కలకు నీరు పోస్తున్న వాచర్

ఇంటింటికి ఆరు రకాల మొక్కల పంపిణీకి ఏర్పాట్లు

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటుటకు కార్యచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థలో మొక్కలు నాటడంతో పాటు ప్రతీ ఇంటికి ఆరు రకాల మొక్కలు పంపిణీ చేయడానికి సిద్ధం చేశాం. నాటిన ప్రతీ మొక్కను రక్షించే బాధ్యత అయా కార్యాలయ అధికారులు, ఇంటి యాజమానులదే. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛం దంగా వారి బాధ్య తను నిర్వహిం చాలి.

\- డీఆర్‌డీవో కౌసల్యాదేవి


భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఎమ్మెల్యే వైఖరిపై జర్నలిస్టుల నిరసన

అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ర్యాలీ

భూపాలపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వైఖరిపై జర్నలిస్టులు సోమవారం నిరసనకు దిగారు. తమపై ఎమ్మెల్యే అనుచితంగా వ్యాఖ్యలు చేశారంటూ ఆందోళన చేపట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటనను బహిష్కరిం చారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేతబూని ప్రెస్‌క్లబ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ తీసి బైఠాయించారు. మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు పర్యటన నేపథ్యంలో భూపాలపల్లిలో ఆది వారం మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అనంతరం విలేకరులతో చిట్ చాట్ చేశారు. ఈ క్రమంలో ఇద్దరు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒకరు తనను ఇసుక కావా లని అడిగారని, అలా పంపడం సాధ్యం కాదని తాను ఖరాకండిగా అన్నానని చెప్పారు. మరో జర్నలిస్టు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వార్తా కథనాలు రాస్తున్నారని అన్నారు. 'విలేకరులు ఏం రాసినా నాకేం కాదు.. నన్ను ఎవరేం పీ... లేరు' అని వ్యాఖ్యా నించారు. దీనిపై భగ్గుమన్న జర్నలిస్టులు సోమ వారం సమావేశమై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిం చారు. మంత్రుల పర్యటనను బహిష్కరించి నిరస నకు దిగాలని నిర్ణయించారు. అనంతరం ర్యాలీ నిర్వ హించి రోడ్డుపై బైఠాయించారు. జర్నలిస్టుల పట్ల అనుచితంగా మాట్లాడిన ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో జర్నలిస్టులు క్యాతం సతీష్‌కుమార్, మంథెన సమ్మయ్య, ఎర్రం సతీష్‌కుమార్, సారేశ్వర్‌రావు, తడక సుధాకర్, చెరుకు సుధాకర్, తాళ్లపల్లి సమ్మయ్య, సామంతుల శ్యామ్, సామల శ్రీనివాస్, ఎడ్ల సంతోష్, తిక్క ప్రవీణ్, రాంబాబు, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో జరిగిన మంత్రుల సభకు రేగొండ జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

నేను అనుచితంగా మాట్లాడలేదు..

తాను ఉద్దేశపూర్వంగా జర్నలిస్టులు ఎవరి పట్ల కూడా అనుచితంగా మాట్లాడలేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. కొంత మంది విలేకరులు ఫోన్ చేసి సిమెంట్, ఇసుక పంపాలని అడిగారని మాత్రమే చిట్‌చాట్ సందర్భంగా చెప్పానని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరిని కించపరిచే ఉద్దేశం తనకు లేదని అన్నారు.

\- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వానాకాలం వరి నాట్లు షురూ

కాటారం, జూలై 21(ఆంధ్రజ్యోతి):మండ లంలో వానకాలం వరి నాట్లు వేయడం ప్రారంభమైంది. గత రెండు మూడు రోజు లుగా కురుస్తున్న వర్షాలతో బోరు బావులు, చెరువుల కింద నార్లు పోసిన రైతాంగం వ్యవసాయ పనుల్లో బిజీ అయింది. బోర్ల కింద రైతులు తమ పొలాలను ఒడ్లు చె క్కించి, కేజీవీల్స్, రోటవేటర్‌తో దున్ని, జం బులు కొట్టి కూలీలతో వరి నాట్లు వేయిస్తు న్నారు. సీజన్ ప్రారంభంలో వానలు సరిగా కురియకపోవడం, ఇటీవల వర్షాలు కురియ డంతో కొంతమంది రైతులు నార్లు పోయ కుండా కొద్దిగా మొలకెత్తిన వడ్లను వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. మండలంలో వానకాలం సీజన్‌లో సుమారు 13వేల ఎక రాల విస్తీర్ణంలో వరి సాగు కానుంది. స్వ ల్పకాలిక, మధ్యకాలిక రకాల వరి వంగడా లను నార్లుగా పోసుకున్న రైతులు నాట్లను మొదలుపెట్టారు. సిఫారస్ చేసిన మేర డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కి లోనే మొత్తం వేసుకొని కలియదున్ని నాట్లు వేసుకోవాలని, 48గంటల ముందే జింక్ సల్ఫేట్ వేసుకుని ఇతర జాగ్రత్తలు తీసుకో వాలని ఏవో పూర్ణిమ సూచిస్తున్నారు.


నారు తీస్తున్న కూలీలు


నాట్లు వేస్తున్న కూలీలు

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

వడ్డెపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 58వ డివిజన్ ఎస్వీఎస్ కాలనీలోని రాఘవేంద్రనగర్ ఫేజ్-2లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సోమవారం సంబరాలు నిర్వహించుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశం మేరకు ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసుకొని ముగ్గులను పోశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరేందర్‌రాజు, 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, కాంగ్రెస్ శ్రేణులు తాళ్లపెల్లి విజయ్‌కుమార్, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవి, తాళ్లపెల్లి మేరి, ప్రసన్న, కాలనీ వాసి అంజన్‌రావు, రామారావు, ఇందిరమ్మ లబ్ధిదారురాలు అరుసు స్వప్న, వార్డు ఆఫీసర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటికి ముగ్గు పోసి లబ్ధిదారుకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న దృశ్యం



పోతురాజుల వేషధారణలో విద్యార్థులు

బాపూజీ పాఠశాలలో బోనాల పండుగ

వడ్డెపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్ ఇంజనీర్స్ కాలనీలోని బాపూజీ పాఠశాలలో బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థులు పోతరాజుల వేషధారణలతో పలు విన్యాసాలను ప్రదర్శించి ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశ్యంతోనే తమ పాఠశాలలో బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు విద్యార్థులకు చిన్నతనం నుంచే అలవడాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్య, శ్రీదేవి, జ్యోతి, అనిత, సోని, గంగాభవాని, కాలనీ అధ్యక్షుడు శంకర్‌రావుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి.

ఫిల్టర్‌బెడ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌లో ట్రాన్స్‌ఫారమ్ కాలిపోవడంతో పనులు పూర్తిచేసి నగర ప్రజలకు మంచి నీరు అందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌ను అకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ ట్రాన్స్‌ఫారమ్‌ను వెంటనే మరమ్మతు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈ రవికుమార్, డీఈ కార్తీక్‌తో పాటు ఏఈలు పాల్గొన్నారు.

సోషల్ డెమోక్రటిక్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్



వడ్డెపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ డెమోక్రటిక్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండ పట్టణానికి చెందిన బండారి రవీందర్ నియమితులయ్యారు. సోషల్ డెమోక్రటిక్ జాతీయ చైర్మన్ కోల జనార్దన్ ఆదేశం మేరకు రాష్ట్ర చైర్మన్ ఎన్.చెన్నరాములు ముదిరాజ్ నియామక ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీలతో పాటు బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని బండారి రవీందర్ పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాజీపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం... వడ్డెపల్లి రైల్వే ట్రాక్ కింద సోమవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.. మృతుడి 40 సంవత్సరాలు ఉంటాయి. ఎత్తు 4.5, బ్లాక్ కలర్ జీన్స్, బ్లాక్ బెల్ట్, గ్రీన్ కలర్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడి కుడి చేతిపై హిందో రాధ అనే పచ్చబొట్టు, కుడి వైపున పొట్టపై పుట్టు మచ్చ ఉంది. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు 8712658609, 9440027342 నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

బేకరీలో చోరీ..

కాజీపేట సిద్దార్థనగర్‌లోని ఓ బేకరీలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. నలుగురు దుండగులు షాపు షట్టర్‌ను కొంత వరకు పైకి తీసి రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. దుండగులు నలుగురు బయట ఉన్న సీసీ కెమెరాల కనెక్షన్ కట్‌చేసి చోరీకి పాల్పడ్డారు. బేకరీ లోపల ఉన్న సీసీ కెమెరాలను దుండగులు గమనించక పోవడంతో చోరీ జరిగిన తీరు వాటిలో రికార్డు అయింది. బాధితుడు బిన్ను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే నాయిని జన్మదిన వేడుకలు



మడికొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కేక్ కట్ చేయిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మేయర్, కుడా చైర్మన్ తదితరులు



గోకుల్ జంక్షన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళసంపత్ యాదవ్

మడికొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని పెట్రోల్ పంపు ఆవరణలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు, కేఆర్.నాగరాజు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణలు నాయిని రాజేందర్‌రెడ్డితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

కేయూ క్యాంపస్ : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం కేయూ మొదటి గేటు వద్ద ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కేయూ జేఏసీ నేతలు కేక్ కట్ చేసి సంబురాలు చేశారు.

కాజీపేట : కాజీపేట 47వ డివిజన్‌లోని బాపూజీనగర్, డీజిల్‌కాలనీ చౌరస్తాలో సోమవారం ఎమ్మెల్యే నాయిని జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బాపూజీనగర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే నాయిని హాజరై ప్రారంభించగా 50 మంది యువకులు రక్తదానం చేశారు. మైసారపు సిరిల్ లారెన్స్, పసునూరి మనోహర్, యమడాల హనుకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎండీ అంకూస్ పాల్గొన్నారు.

వడ్డెపల్లి : హనుమకొండలోని గోకుల్ జంక్షన్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళసంపత్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరిగాయి. గోకుల్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను రాజేందర్‌రెడ్డి కట్ చేసి మొక్కలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు బంక సతీష్, బంక చంద్రశేఖర్ యాదవ్, బొల్లు లలిత, తేళ్ల సుగుణకిశోర్, దొంగర శ్రీనివాస్, సూత్రపు కవిత, కరుణ, విజయ, స్వరూప, బొంత సుజాత తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ సిటీ : హనుమకొండలోని స్పందన మానసిక వికలాంగుల కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, డాక్టర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. మానసిక వికలాంగులకు పండ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్వేత, జగన్ గౌడ్, మహేందర్, కృష్ణ డేవిడ్, నాగభూషణ్, సుధాకర్, మేరీ, సుకన్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఉద్యోగుల సంఘం నేతలు రాజేశ్‌గౌడ్, జగన్మోహన్‌రావు, రాజ్‌కుమార్, తెలంగాణ ఫిషర్‌మెన్ కమిటీ సభ్యుడు మండల సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు జనగం శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియచేనశారు.

వరంగల్ కార్పొరేషన్ : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆయన నివాసంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు పూల మొక్కలను అందించి అభినందనలు తెలిపారు.

యాదవనగర్‌లో చైన్ స్నాచింగ్

- రెండున్నర తులాల పుస్తెలతాడు అపహరణ
- కేసు నమోదు చేసిన పోలీసులు

హసన్‌పర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల చైన్‌స్నాచర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట చైన్‌స్నాచింగ్ జరుగుతున్న ఘటనలు మహిళలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేసినప్పటికి ఇటువంటి ఘటనలు పునరావృతం కావడంతో మహిళలు రోడ్డు మీదకు రావాలంటేనే జంకుతున్నారు.

ఈ క్రమంలో సోమవారం కేయూ పోలీసు స్టేషన్ పరిధి యాదవనగర్ కెనాల్ సమీపంలో భగత్‌సింగ్ నగర్‌కు చెందిన లింగంపల్లి కోమల నడుకుంటూ వెళ్తుంది. వెనక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని చైన్‌స్నాచర్ ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడును లాక్కెళ్లాడు. విషయం తెలిసిన కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. అనంతరం బాధితురాలు కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు.

అనితా రెడ్డికి మండేలా పీస్ అవార్డు



డాక్టర్ అనితా రెడ్డి

హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డికి మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ మండేలా పీస్ అవార్డు-2025 ప్రదానం చేసింది.

డాక్టర్ అనితారెడ్డి ప్రపంచ శాంతి కోసం, దేశభక్తిని పెంపొందించడం కోసం ఎన్నో కార్యక్రమాలను చేయడంతో పాటు గత 30 సంవత్సరాలుగా అనాథ పిల్లలకు, మానసిక, శారీరక దివ్యాంగులకు అమ్మ ప్రేమను అందిస్తూ వారి సంక్షేమానికి పాటుపడుతున్నందుకు గుర్తింపుగా ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేశామని మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు.

డైట్‌లో చెట్ల నరికివేతపై కలెక్టర్ సీరియస్

- వివరాలు సమర్పించాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశం
- నరికిన చెట్ల తరలింపు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఛాత్రోపధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లోని చెట్లను విచక్షణారహితంగా నరికివేడయంపై కలెక్టర్ స్నేహ శబరీష్ సీరియస్ అయినట్టు తెలిసింది. 'డైట్‌లో చెట్ల నరికివేత శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తాకథనం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో స్పందించిన కలెక్టర్ శబరీష్ సీరియస్ అయ్యారు. చెట్ల నరికివేత వ్యవహారంపై డైట్ ప్రిన్సిపాల్, సంబంధిత ఇతర సిబ్బంది నుంచి సంజాయిషీ కోరినట్టు సమాచారం. చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా ? అసలు చెట్లను ఎందుకు నరికివేయాల్సి వచ్చింది ? నరికివేసిన చెట్ల స్థానే తిరిగి చెట్లను పెంచేందుకు ఎలాంటి నష్టనివారణ చర్యలు తీసుకుంటున్నారు ? తదితర అంశాలపై వివరణ కోరినట్టు తెలిసింది. కాగా, నరికివేసిన చెట్లను ఆదివారం ట్రాక్టర్‌లో తరలించారు. డైట్‌లో పని చేసే ఒక ఉద్యోగితో పాటు మరొకరు సుమారు ఆరు ట్రాక్టర్లలో కలప దుంగలను తీసుకువెళ్లినట్టు సమాచారం. అయితే కలపను డైట్ యాజమాన్యం విక్రయించిందా? లేక ఉచితంగానే తీసుకువెళ్లారా అనేది తెలియరాలేదు.

శ్రావణమాసం మహిళలకు ప్రత్యేకం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అత్యంత ప్రాచీనమైన ఆలయాల్లో పూజలను నిర్వహించడం వల్ల సకల ఐశ్వర్యాలు కలుగుతాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ వేయిస్తంభాలగుడిలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రావణమాస పూజల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యంగా శ్రావణమాసం మహిళలకు ప్రత్యేక మాసమని పేర్కొంటూ శ్రావణ మంగళ గౌరీ వ్రతాలు, వరలక్ష్మి వ్రతాలు, రాఖీ పౌర్ణమి లాంటి ఎన్నో పర్వదినాలు ఈ మాసంలోనే జరుగుతాయని అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో వేయిస్తంభాలగుడిలో రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు పెద్ద ఎత్తున జరుగుతాయ న్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి పి. అనిల్ కుమార్, కార్పొరేటర్ జక్కుల రవీంద్ర యాదవ్, పదవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమార్ యాదవ్, రాహుల్‌రెడ్డి, ఠాకూర్, తోట పవన్, సాంబరాజు వికాస్, ఆలయ అర్చకులు సందీప్ శర్మ, వేద పండితులు గంగు మణికంఠ శర్మ అవధాని, ఆలయ సిబ్బంది మధుకర్, రజిత తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సోలార్ స్టోర్స్ బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతికతను సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు రైతులకు సూచించారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డులో సోమవారం మెగా మల్టీ సోలార్ స్టోర్స్ బ్రాంచిని వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌రాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు.

రైతుల కోసం ప్రత్యేకంగా సోలార్‌తో పనిచేసే నీటి మోటార్లు మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకువచ్చిన మెగా మల్టీ సోలార్ స్టోర్స్ బ్రాంచి యాజమాన్యం సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, గడ్డం విష్ణు, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, గడ్డం శివరాం, కొంక హరిబాబు, ఎస్‌డీఎల్‌సీ డైరెక్టర్ కొంగర జగన్, విద్యుత్ సంఘం నాయకులు రౌతు రమేష్, మాజీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మడికొండ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మడికొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాకు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించిన సందర్భాన్ని పురస్కరించుకొని మడికొండ చౌరస్తాలో 46వ డివిజన్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు పెనుకుల వినయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, పైడిపాల రఘుచందర్, పల్లపు అర్జున్, బిల్ల రవీందర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయినికి కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ : వరంగల్‌లో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ముఖ్యమంత్రిని ఒప్పించడాన్ని పురస్కరించుకొని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయభాను తదితరులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం హనుమకొండలోని ప్రజాభవన్‌లో రాజేందర్‌రెడ్డిని కలిసి శాలువా, పులమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మట్టాడ కుమారస్వామి, దండ్రి రమేశ్, బండారి ప్రభాకర్ పాల్గొన్నారు.

శివాజీనగర్ సీసీరోడ్డుకు మోక్షం

కార్పొరేషన్ జనరల్ ఫండ్ నిధుల కేటాయింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పూర్తయిన శివాజీనగర్ సీసీ రోడ్డు

హసన్‌పర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం శివాజీనగర్ కాలనీ ప్రధాన రహదారి పనులను సదరు కాంట్రాక్టర్ పూర్తి చేయకుండా రెండు సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై గత జూన్ 30వ తేదీన 'రోడ్డును సత్వరమే పూర్తి చేయాలి' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కార్పొరేషన్ అధికారులు స్పందించారు. మేయర్, కమిషనర్ తక్షణమే కార్పొరేషన్ జనరల్ ఫం డ్ ద్వారా నిధులు మంజూరి చేయించి కాంట్రాక్టర్‌కు తిరిగి పనులు అప్పగించడంతో పూర్తి చేశారు. రోడ్డు సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ఎఆంధ్రజ్యోతికి శివాజీనగర్ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యాన్ని మించి బ్యాంకు లింకేజీ

(5వ పేజీ తరువాయి)

ల్యాదెళ్లలో ఏర్పాటు చేసిన ఇంటగ్రేటెడ్ సెంటర్‌లో వివిధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ మహిళలకు ఎంతో దోహదకారిగా పని చేస్తోంది.

పెట్రోల్ బంక్‌లు

మహిళల ఆర్థిక స్వావలంబనకు మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతీ జిల్లాలో కనీసం ఒక పెట్రోల్ బంక్ అయినా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా సమాఖ్యలు ఈ పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తాయి. ఇందులో భాగంగా కాజీపేట మండలంలోని మడికొండలో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆవరణలో 12 గుంటల స్థలంలో పెట్రోల్ పంపు ఏర్పాటుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఈ స్థలాన్ని పరిశీలించి ఫీజుబులిటీ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది.

ఈ మేరకు ట్రైపార్టీ ఒప్పందం కూడా కుదిరింది. పెట్రోల్ బంక్ పనులు మొదలయ్యాయి. నవంబరు నాటికి పెట్రోల్ బంక్ సిద్ధమవుతుంది. ఈ బంక్ ఏర్పాటుకయ్యే రూ.2 కోట్ల వ్యయాన్ని బీపీసీఎల్ భరిస్తోంది.

అన్నదాతల్లో చిగురించిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

శాయంపేట మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. రానున్న 24గంటల్లో హనుమకొండ జిల్లాలోని కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయనీ వాతావరణ కేంద్రం తెలిపింది.

జనగామ జిల్లాలో...

జనగామ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో సోమవారం పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్మి చల్లబడిపోయింది. జిల్లా కేంద్రంలో గంట పాటు ముసురు వాన కురువగా అక్కడక్కడా వర్షం కురిసింది. జఫర్‌గఢ్‌లో అత్యధికంగా 27.5 మి.మీ., కూనూరులో 19.5, పాలకుర్తిలో 14.5, రఘునాథపల్లిలో 13.0, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 12.0, తరిగొప్పులలో 11.8, చిలుపూరులో 10.0, జనగామలో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మానుకోట జిల్లాలో...

మహబూబాబాద్ అగ్రికల్చర్: మహబూబాబాద్ జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణశాఖ ప్రకటించింది. భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో జిల్లాను ఆరెంజ్ అలర్ట్‌గా వాతావరణశాఖ ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో సోమవారం నుంచి ప్రత్యేక కంట్రోల్ రూం 7995074803 నంబర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భారీ వర్షాలే కురియనున్న తరుణంలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే ఈనెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించింది. గత సీజన్‌లో భారీ వర్షాలు కురిసి కేసముద్రం, తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ కింది నుంచి కంకరకొట్టుకు పోయి తీవ్ర అంతరాయం కలగడంతో పాటు జిల్లాలోని వివిధమండలాల్లో వంతెనలు, రోడ్లు, చెరువు కట్టలుతెగిపోయాయి. ఆ ఘటనలు గుర్తుంచుకున్న జిల్లా యంత్రాంగం ముందుగానే మేల్కొని కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది.

విస్తరించిన వర్షాలు

వరాలు ఆదివారం నుంచి జిల్లా అంతటా విస్తరించాయి. లోటు వర్షపాతం ఉన్న జిల్లాలో సోమవారం ఉదయం నుంచి కొత్తగూడ, నర్సింహులపేట, గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం, పెద్దవంగర, ఇనుగుర్తి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కొత్తగూడ మండలంలో మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. గార్ల, డోర్నకల్, బయ్యారం, మహబూబాబాద్, సీరోలు, మరిపెడ, తొర్రూరు మండలాల్లో 15 నిమిషాల పాటు ఒక్కసారి జల్లులు కురిసి ఆగిపోయాయి. కొన్ని మండలాల్లో ముసురు అలుముకుంది.

వ్యాధి నిర్ధారణ



పొట్టలో నొప్పికి పలు కారణాలు. వాటిలో కొన్ని స్వల్పమైనవి కావచ్చు, కొన్ని తీవ్రమైనవీ కావచ్చు. జీర్ణాశయం, పెద్ద, చిన్న పేగులు, పిత్తాశయం, క్లోమం... ఇలా పలు అవయవాలు కిక్కిరిసి ఉండే పొట్టలో నొప్పి తలెత్తితే, అందుకు అసలు కారణాలను ఆరా తీయడం అవసరం అంటున్నారు వైద్యులు.

పొట్ట నొప్పి పని పట్టేలా...

పొట్టలో పలు చోట్ల నొప్పి తలెత్త వచ్చు. ఎగువ పొట్ట, కింది పొట్ట, కుడి, ఎడమ డొక్కల్లో, పొత్తికడుపు... ఇలా పొట్టలో నొప్పి తలెత్తే ప్రదేశాన్ని బట్టి ఆ నొప్పికి అసలు కారణాలను వైద్యులు అంచనా వేయగలుగుతారు. కొన్నిసార్లు పొట్టలో తలెత్తే నొప్పి వెన్నులోకి పాకవచ్చు. ఇంకొన్ని సందరాల్లో నొప్పి వచ్చిపోతూ ఉండొచ్చు. క్రమేపీ పెరిగిపోవచ్చు. పొడిచినట్టు, పిండినట్టు, మెలి పెట్టినట్టు... ఇలా భిన్నమైన లక్షణాలతో బాధిస్తూ ఉండవచ్చు. నొప్పికి అదనపు లక్షణాలు తోడవవచ్చు. అయితే అన్నిటికంటే ముందు, నొప్పితో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన ఏర్పరుచుకోవడం ఎంతో అవసరం.

కారణాలు పలు రకాలు

అసిడిటీ: కడుపులో ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవడం వల్ల, ఆహారం తిన్న వెంటనే, పైపొట్టలో మంట, నొప్పి మొదలవుతుంది


పిత్తాశయంలో రాళ్లు: ఈ సమస్యతో తలెత్తే నొప్పి పైపొట్టలో కుడివైపున వేధిస్తుంది. తిన్న వెంటనే నొప్పి తలెత్తుతూ ఉంటుంది.

మూత్రపిండాల్లో రాళ్లు: కుడి, ఎడమ డొక్కలో ఒకేసారి తీవ్రమైన నొప్పి మొదలవుతుంది. తెరలు తెరలుగా వచ్చిపోతూ, క్రమేపీ తీవ్రత పెరుగుతూ ఉంటుంది. వాంతి, జ్వరం కూడా మొదలవుతాయి

ప్యాంక్రియటైటిస్: పైపొట్టలో వచ్చే నొప్పి వెన్ను వైపు పాకుతూ ఉంటుంది

కండరం చిరిగితే?

కొందరికి విశ్రాంత స్థితిలో ఎలాంటి నొప్పి లేకపోయినా, కదిలేటప్పుడు పొట్టలో నొప్పి వేధించవచ్చు. వెన్నుపూసల్లో సమస్యలు, కండరాల సమస్యలే ఇలాంటి నొప్పికి కారణాలు. కొందరికి బరువులు ఎత్తే సమయంలో పొట్టలో నొప్పి తలెత్తవచ్చు. కండరం చిరిగిన సందర్భాల్లో ఈ నొప్పి తలెత్తుతుంది. ఇదే చీలిక పెద్దదైతే అది హెర్నియాకు దారి తీస్తుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.



ప్రధాన కారణాలు

పేగులు అతుక్కుపోవడం: పలు సర్జరీల ఫలితంగా కొన్ని సందర్భాల్లో పేగులు అతుక్కుపోతాయి. ఈ సమస్యలో కూడా పొట్ట నొప్పి ఉంటుంది

అపెండిసైటిస్: బొడ్డు దగ్గర, పొత్తికడుపు దగ్గర తట్టుకోలేనంత నొప్పి వేధిస్తుంది. ఈ నొప్పి నెమ్మదిగా మొదలై క్రమేపీ తీవ్రమవుతుంది. మొదట పొట్ట ఉబ్బరంతో మొదలవుతుంది. బొడ్డు దగ్గర బిగుతుగా ఉన్న భావన కలుగుతుంది. ఆ తర్వాత నొప్పి పొట్టలో కుడివైపుకు పాకుతుంది. వాంతి అవుతున్న భావన కూడా కలుగుతుంది

గుండెపోటు: కొందర్లో పొట్టనొప్పి గుండెపోటుకు సూచన. పైపొట్టలో నొప్పితో పాటు, ఆయాసం, చమటలు పడితే గుండెపోటుగా భావించి సత్వరం వైద్యులను కలవాలి. ప్రత్యేకించి ముందు నుంచి గుండె సమస్యలున్నవారు, అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవాళ్లు, అధిక కొలెస్ట్రాల్ ఉన్న వాళ్లు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి

హెర్నియా: పొట్ట, పొత్తి కడుపు దగ్గర ఉబ్బెత్తుగా ఉండి, నొప్పి వేధిస్తే, హెర్నియాగా భావించాలి. అంతర్గత చర్మపు పొరలు పలుచబడడం వల్ల పేగులు ఆ జాగాలోకి చొరబడే సమస్యే 'హెర్నియా'. ప్రధానంగా బొడ్డు దగ్గర, పురుషుల్లో గజ్జల్లో హెర్నియా కనిపిస్తూ ఉంటుంది. సర్జరీలు జరగడం, పెద్ద వయసు హెర్నియాకు

ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలి?

పొట్టనొప్పి తలెత్తితే వైద్యుల దగ్గరకు పరుగులు పెట్టే వాళ్లు చాలా తక్కువ. చేతికి అందిన నొప్పి నివారణ మాత్రలు లేదా యాంటాసిడ్ మాత్రలు వేసేసుకుని, విశ్రాంతి తీసుకుంటారే తప్ప, నొప్పిని తీవ్రంగా పరిగణించరు. అయితే పొట్ట నొప్పిని తీవ్రంగా పరిగణించవలసిన సందర్భాలు కూడా ఉంటాయి. అవేంటంటే...

- గంటకు మించి కొనసాగినా
- ఒకే ప్రదేశానికి పరిమితమైనా
- తాకినప్పుడు నొప్పి పెరుగుతున్నా
- వాపు, ఉబ్బు కనిపించినా
- వాంతులు అవుతున్నా
- విరోచనం ఆగిపోయినా, నీళ్ల విరోచనాలు అవుతున్నా
- పొట్ట ఉబ్బరించినా
- నొప్పితో పాటు వాంతి, జ్వరం మొదలైనా

నొప్పి తలెత్తే ప్రదేశంతో పాటు అదనపు లక్షణాల ఆధారంగా వైద్యులు అసలు సమస్యను అంచనా వేయగలుగుతారు. సమస్యను కచ్చితంగా గుర్తించడంలో స్కానింగ్ సహాయపడుతుంది.

డాక్టర్ ఎమ్.ఎన్. పవన్ కుమార్
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్



ఈ మందులు చెత్తబుట్టలో వేయొద్దు

కాలం చెల్లిన కొన్ని మందులను చెత్తబుట్టలో పారేయడం ప్రమాదకరమని కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ చెబుతోంది. నొప్పి, ఆందోళన మొదలైన సమస్యలకు వాడే ట్రమడాల్, టాపెంటడాల్, డైజిపామ్, ఆక్సికోడోన్, ఫెంటానిల్ వంటి 17 రకాల మందులు ఎంతో ప్రభావంతమైనవని ఔషధ నియంత్రణ సంస్థ వెల్లడించింది. వైద్యులు సూచించిన రోగులు మినహా వాటిని ఎవరు తీసుకున్నా, తీవ్రమైన ప్రభావాన్ని కనబరుస్తాయనీ, ప్రాణాలకు కూడా ప్రమాదం ఉంటుందనీ, కొన్నిసార్లు ఒక్క డోసు తీసుకున్నా ప్రాణాలు పోయే అవకాశాలు ఉంటాయిని ఔషధ నియంత్రణ సంస్థ హెచ్చరిస్తోంది. అలాంటి ఆ మందులు మిగిలిపోయినా, కాలం చెల్లినా, లేదా లేబుల్ చిరిగిపోయినా చెత్తబుట్టలో పారేయవద్దని సూచిస్తోంది. అలా పారేస్తే, వాటిని పొరపాటున చిన్న పిల్లలు, పారిశుద్ధ్య కార్మికులు, జంతువులు తినే ప్రమాదం ఉందని తెలిపింది. ఆ మందులు జంతువులు తాగే నీటిలో కలిసే ప్రమాదం కూడా లేకపోలేదని వివరించింది. చెత్తలోకి చేరిన ఆ మందులు అక్రమార్కుల చేతిల్లోకి చేరుకుంటే అవి దుర్వినియోగం అవడం లేదా మళ్లీ మార్కెట్‌లోకి చేరుకునేప్రమాదం ఉందని హెచ్చరించింది. అందుకే ఆ మందులను టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేయాలని సూచించింది.



మీకు తెలుసా?

గుండెపోటుకు ముందు...

గుండెపోటుతో అకస్మాత్తుగా కుప్పకూలిపోతున్న వాళ్లను చూస్తున్నాం! నిజంగానే గుండెపోటు అకస్మాత్తుగా తలెత్తుతూ ఉంటుందా? ముందస్తు లక్షణాలేవీ లేకుండానే ప్రాణాలను హరిస్తుందా? వాస్తవమేంటో తెలుసుకుందాం!



గుండెపోటుకు కొన్ని రోజులు, వారాల ముందు కొన్ని లక్షణాలు బయల్పడుతూ ఉంటాయి. వాటిని సకాలంలో గుర్తించి, అప్రమత్తం కాగలిగితే గుండెపోటుకు గురికాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు అంటున్నారు ప్రముఖ కార్డియాలజిస్ట్, మొనిసోలా అడానిజో. ఆ లక్షణాలు ఏవంటే..

ఛాతీలో నొప్పి, అసౌకర్యం: నొక్కినట్టు, బరువుగా ఉన్నట్టు అనిపించడం, ఛాతీలో మంట. ఈ లక్షణాలు ఛాతీ మధ్యలో లేదా ఎడమవైపున కనిపించవచ్చు. లక్షణాలు వచ్చి పోతూ ఉండవచ్చు.

ఇతరత్రా నొప్పులు: గుండె సమస్య ఛాతీకే పరిమితం కావాలనే నియమమేమీ లేదు. వెన్ను, మెడ, దవడ, పైపొట్ట... ఈ శరీర భాగాల్లో కూడా నొప్పి రూపంలో బయల్పడవచ్చు.

శ్వాస ఇబ్బంది: గుండె జబ్బులు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గించి, శ్వాసను కష్టతరం చేస్తాయి. కాబట్టి నెమ్మదిగా మెట్లు ఎక్కుతున్నప్పుడు, లేదా పడుకుని ఉన్నప్పుడు శ్వాస ఇబ్బందికరంగా మారితే అప్రమత్తం కావాలి.

చమటలు: చల్లని గదిలో ఉన్నా, పడుకుని ఉన్నా అకస్మాత్తుగా చమటలు పట్టేస్తుంటే, వెంటనే గుండె వైద్యులను కలవాలి.

తలతిరుగుడు: గుండెపోటుకు ముందు తలతిరుగుడు, అజీర్తి, ఛాతీలో మంట, వాంతులు లాంటి లక్షణాలను ఎంతోమంది ఎదుర్కొంటూ ఉంటారు. కాబట్టి పొట్టలో అసౌకర్యాలకు ఛాతీలో ఇబ్బంది, నిస్సత్తువ, చమటలు కూడా తోడైతే వెంటనే వైద్యులను కలవాలి.

నిస్సత్తువ: ఎలాంటి శారీరక శ్రమకు లోను అవకపోయినా, ఉన్నట్టుండి నిస్సత్తువ ఆవరిస్తున్నా, చిన్నపాటి పనికే విపరీతంగా అలసట ఆవరిస్తున్నా గుండెలో సమస్య తలెత్తుతోందని అర్థం.

అలవాట్లు - పొరపాట్లు

ఆహార కోరికలకు కళ్లెం వేద్దాం

కొన్నిసార్లు తీపి మీదకు మనసు లాగుతుంది. ఇంకొన్నిసార్లు పులుపుల్లగా ఏదైనా తినాలనిపిస్తుంది. ఆకలితో సంబంధం లేకుండా తలెత్తే ఇలాంటి ఆహార కోరికలకు పోషక లోపాలు కారణమంటున్నారు పోషకాహార నిపుణులు. పదార్థాల పట్ల ఆపేక్షల వెనకుండే మతలబుల గురించి తెలుసుకుందాం!

భోజనం తిన్న వెంటనే తీపి తినాలనిపిస్తోందా? అర్ధరాత్రి ఉప్పటి స్నాక్స్ మీదకు మనసు మళ్లుతోందా? లేదంటే చీజ్ పిజ్జాలూ, పన్నీర్ పకోడీలను లాగించేయాలనిపిస్తోందా? ఈ కోరికలు పూర్తిగా మానసికమైనవి కాకపోవచ్చు. వీటి వెనక భౌతిక, పోషణపరమైన కారణాలు కూడా ఉంటాయి. వీటి గురించిన అవగాహన లోపంతో తినాలనిపించినవన్నీ తినేస్తూ ఉంటే, అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయి ఊబకాయంతో పాటు, సంబంధిత ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నవాళ్లం అవుతాం! కాబట్టి ఆహార కోరికల్లో రకాలతో పాటు అవెందుకు కలుగుతాయో, వాటితో ఎలా వ్యవహరించాలో, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎలా ఎంచుకోవాలో తెలుసుకోవడం అవసరం.

తీపి కోరికల కారణాలు

ఎదురుగా ఎన్ని పదార్థాలున్నా తీయగా ఏదైనా తినాలనిపిస్తే, అందుకు కారణాల కోసం అన్వేషించాలి. ఈ కోరిక వెనకుండే ప్రధాన కారణాలు ఏవంటే...

- రక్తంలో చక్కెల మోతాదుల్లో హెచ్చుతగ్గులు
- మానసిక సంతృప్తి లేదా ఒత్తిడి నుంచి ఉపశమనం
- నిద్ర లేమి
- మెగ్నీషియం లేదా క్రోమియం లోపం

ప్రత్యామ్నాయాలు ఇవే!

- తాజా పండ్లు
- డార్క్ చాక్లెట్ (70%+ కోకో)
- దాల్చిన చెక్క టీ
- నట్ బటర్, ఓట్స్‌తో చేసిన స్మూతీలు

మాంసాహార కోరికకు కారణాలు

చికెన్, మటన్, చేపలు... ఇలా తరచూ మాంసాహారం తినాలనిపిస్తుంటే...

- ప్రోటీన్ లేదా ఐరన్ లోపం
- విటమిన్ బి 12 లోపం
- గర్భం లేదా అధిక శారీరక శ్రమ

ప్రత్యామ్నాయాలు ఇవే!

- లేత మాంసం
- ఉడకబెట్టిన గుడ్లు, గ్రిల్ చేసిన చేపలు
- మొలకలు, పప్పుధాన్యాలు, టోఫు, ఫోర్టిఫైడ్ ఆహారపదార్థాలు

ఆరోగ్యకరమైన ఆహారం మీద మక్కువ పెరిగేదెలా?

- **క్రమేపీ అలవాటు చేసుకోవాలి:** అనారోగ్యకరమైన పదార్థాల స్థానాన్ని ఆరోగ్యకరమైన పదార్థాలతో అంచెలవారీగా భర్తీ చేస్తూ ఉండాలి
- **మనసు పెట్టాలి:** తినాలనే కోరికను భావోద్వేగాలు ప్రభావితం చేస్తున్నాయా? లేదంటే భౌతిక ఆకలితోనే తినాలనే కోరిక కలిగిందా? అన్నది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. తినే సమయంలో ఇంద్రియాలకు పని పెట్టాలి
- **సమతులాహారం:** భోజనంలో మాంసకృత్తులు, పీచు, ఆరోగ్యకరమైన కొవ్వులు చేర్చుకోవాలి
- **సంతృప్తినిచ్చే మార్గాలు:** ఆహారంతో సంబంధం లేని నడక, సంగీతం వినడం, అభిరుచులను సాధన చేయడం లాంటి అలవాట్లు అలవరుచుకోవాలి
- **లోపాలను సరిదిద్దుకోవాలి:** పోషకాహార లోపాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ, శరీరంలో కొరవడిన ఖనిజ లవణాలు, విటమిన్లను భర్తీ చేసుకోవాలి
- **పేగుల ఆరోగ్యం కీలకం:** పులిసిన పదార్థాలు, పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- **సరిపడా నీరు:** శరీరంలో నీటి పరిమాణం తగ్గకుండా చూసుకోవాలి.

పుల్లటివి తినాలనిపిస్తే...

గర్భిణులకే కాదు అప్పుడప్పుడూ అందరికీ పులుపు తినాలనిపిస్తుంది. ఎందుకంటే...

- జీర్ణ వ్యవస్థ సమస్యలు
- విటమిన్ సి లోపం
- గర్భధారణ సంబంధిత హార్మోన్లలో మార్పులు

ప్రత్యామ్నాయాలు ఇవే!

- నిమ్మరసం
- ఉసిరి జ్యూస్ లేదా పుల్లని క్యాండీ
- పెరుగు వంటి పులిసిన పదార్థాలు



ఆహార కోరికలు శరీరం అందించే సూచనలు. ఈ కోరికలు పోషక లోపాలు, భావోద్వేగాలు, అలవాట్లకు మూలాలు. కాబట్టి తినాలనే కోరికలను అర్థం చేసుకుని, ఆరోగ్యకరమైన మార్గంలో వాటిని సంతృప్తి పరుచుకోగలిగితే పోషక లోపం తలెత్తకుండా చూసుకోవచ్చు. నిజానికి పదార్థాలు తినాలనే కోరికలు చెడ్డవేమీ కావు. పోషక లోపాలను గ్రహించి సరిదిద్దుకునే వీలు కల్పించే సాధనాలుగా వాటిని భావించాలి. నిరంతర అలవాట్లు, క్రమేపీ మార్పులతో ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఆస్వాదించగలుగుతాం!

చేదు, కారం కోరికకు కారణాలు

అరుదుగా చేదు, కారాల మీదకు కూడా మనసు మళ్లుతుంది. అలా ఎందుకంటే...

- జీర్ణ సంబంధ ప్రేరకం కోసం...
- కాలేయం విషాలను వదిలించుకోవడం కోసం

ప్రత్యామ్నాయాలు ఇవే!

- మెంతులు. కూరల్లో మెంతిపిండి చల్లుకుని తినాలి
- కాకరకాయ కూరలు, వేపుళ్లు తినొచ్చు
- హెర్బల్ టీ

ఉప్పని స్నాక్స్ కోరిక వెనక

బంగాళాదుంప చిప్స్, సాల్టెడ్ పీనట్స్ లాంటి ఉప్పని స్నాక్స్ తినాలనిపిస్తే ఒంట్లో ఖనిజలవణాలు లోపించాయని అర్థం.

- డీహైడ్రేషన్ లేదా ఎలక్ట్రోలైట్ అసమతుల్యత
- ఒత్తిడి
- అడ్రినల్ ఫెటీగ్

ప్రత్యామ్నాయాలు ఇవే!

- పింక్ సాల్ట్ కలిపి వేయించిన నట్స్
- ఉప్పు కలిపిన కొబ్బరి నీరు
- వేయించిన శనగలు లేదా మఖానా

కోరిక	లోపం	ప్రత్యామ్నాయం
చాక్లెట్	మెగ్నీషియం	నట్స్, గింజలు, పచ్చని ఆకుకూరలు
రెడ్ మీట్	ఐరన్ లేదా బీ12	పప్పు, పాలకూర, గుడ్లు, లీన్ మీట్
చీజ్, క్రీమ్‌ఫుడ్	కాల్షియం, మంచి కొవ్వుల	నువ్వులు, బాదం పప్పు, డెయిరీ పదార్థాలు
తీపి	క్రోమియం, మెగ్నీషియం లోపం, నిద్ర లేమి	అరటిపండ్లు, నట్స్, తృణధాన్యాలు
ఉప్పు	సోడియం లోపం, డి హైడ్రేషన్	పింక్ సాల్ట్ , కొబ్బరి నీరు, ఆకు పచ్చని ఆకు కూరలు

డాక్టర్ అడ్డు కిరణ్మయి
సీనియర్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.



పరిశోధన

డిప్రెషన్ మందులతో నాడీ సంబంధ ముప్పు

కుంగుబాటు, ఆందోళన, నిద్ర సమస్యలకు వాడే మందుల వలన ప్రాణాంతక నాడీ సంబంధిత వ్యాధి, అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ (ఎఎల్ఎస్) బారిన పడే ప్రమాదం ఉందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ అధ్యయన వివరాలివీ..

ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ గురించి అందరికీ తెలుసు. ఆయన 21 ఏళ్ల వయసులో కండరాలకు సంబంధించిన అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ వ్యాధికి గురై చక్రాల కూర్చీకే పరిమితమైపోయారు.



స్టీఫెన్ హాకింగ్‌ను వేధించిన ఇదే వ్యాధి మానసిక రుగ్మత మందుల వల్ల కూడా తలెత్తే ప్రమాదం ఉందనే ఒక అధ్యయనం జామా న్యూరాలజీలో ప్రచురితమైంది. డిప్రెషన్, ఆందోళన నిద్ర మాత్రల వలన ఎఎల్ఎస్ వచ్చే ప్రమాదముందని స్వీడన్ పరిశోధకులు ఆ అధ్యయనంలో వెల్లడించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా వెయ్యి మంది పైగా ఏఎల్ఎస్ రోగులు, అయిదు వేలమందిపైగా ఆరోగ్యవంతుల సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. మానసిక వ్యాధుల మందులు వాడిన వారు తర్వాతి కాలంలో ఎఎల్ఎస్ బారిన పడినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ కోవకు చెందిన వారిలో ఎఎల్ఎస్ నిర్ధారణ కూడా ఆలస్యమవుతోందని, దాంతో కోలుకునే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని తెలుసుకున్నారు. ఎఎల్ఎస్ ప్రారంభ దశలోనూ ఆందోళన, నిద్రలేమి, డిప్రెషన్ లక్షణాలు ఉంటాయని దర్శశిల నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ పాండురంగ తెలిపారు. ఈ మందుల వలన ఎఎల్ఎస్ వస్తుందనే కచ్చితమైన రుజువు లేనప్పటకీ, నాడీ సంబంధిత వ్యాధుల లక్షణాలు ఉన్నవారికి ఈ మందులు సూచించేటప్పుడు వైద్యులు ఒక సారి ఆలోచించాలని సర్ గంగా రామ్ హాస్పిటల్ వైస్ ఛైర్‌పర్సన్, డాక్టర్ అన్షు రోహత్గి అభిప్రాయపడుతున్నారు.

తెలుసుకుందాం

రోజుకు ఎన్నిసార్లు తినాలి?

సాధారణంగా రోజుకు మూడు సార్లు ఆహారం తీసుకుంటాం. అయితే కొందరు అంతకంటే ఎక్కువసార్లు తింటారు. ఇలా చేయడం వలన ఆరోగ్యం మీద ఎలాంటి ప్రభావం ఉంటుందో, వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

రోజులో మూడు కంటే ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వలన కొన్ని ప్రయోజనాలు, కొన్ని నష్టాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మనం ఏం తింటున్నాం?, ఎంత మోతాదులో తింటున్నాం? అన్న దాని మీదే శరీరానికి లాభమా? నష్టమా? అనేది ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు. శరీరానికి సమతుల్య పోషకాహారం అవసరం. కొద్ది, కొద్దిగా ఎక్కువసార్లు తినడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా మధుమేగ రోగులకు, ఇన్సులిన్ సెన్సిటివిటీ ఉన్నవారికి దీని వలన ప్రయోజనం చేకూరుతుందని లక్డీకాపూల్‌లోని గ్లెనీగేల్స్ హాస్పిటల్ చీఫ్ డైటీషియన్, డాక్టర్ పి భావన తెలిపారు. ఇలా తినడం వల్ల రక్తంలో చక్కెరస్థాయులు సిరంగా ఉంటాయనీ, ఇలా కొద్ది కొద్దిగా తినడం వలన జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందనీ అంటున్నారు. ఛాతీ మంట, జీర్ణకోశ సమస్యలతో బాధపడే వారికి దీనిని సిఫారసు చేస్తారని కూడా ఆమె చెప్పారు. ఇలా తినవడం వలన రోజంతా శక్తి సమకూరే అవకాశం ఉంటుంది. అయితే ఎక్కువసార్లు తినడం వలన నష్టాలు కూడా లేకపోలేదు. తరచూ తినడం వల్ల సహజంగా కలిగే ఆకలి సంకేతాలకు భంగం కలుగుతుందని ముంబైలోని గ్లెనీగల్స్ హాస్పిటల్ ఇంటర్నల్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్, డాక్టర్ మంజూష అగర్వాల్ పేర్కొన్నారు. ఆహారం జీర్ణమవడానికి సరిపడా సమయం ఉండకపోవడం, ఎక్కువ మొత్తంలో తింటూ ఉండడం, క్యాలరీలు, చక్కెర, కొవ్వులు ఎక్కువగా ఉన్న ఆహారం తినడం వలన అధిక బరువు సమస్య పొంచి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అలాగే ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుందని, గ్యాస్, ఉబ్బరం, అజీర్తి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అలాగే మెటబాలిక్ సమస్యల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాల్లో తేలిందని డాక్టర్ మంజూష అగర్వాల్ వెల్లడించారు. అయితే భోజనానికి, భోజనానికి మధ్య ఎంత సమయం అవసరం అన్నది వ్యక్తుల జీవనశైలి, ఆరోగ్య పరిస్థితి మీద ఆధారపడి ఉంటుందని ఆమె వెల్లడించారు.





విమానం కూలిపోయిన చోట శకలాలు, కాలిపోయిన స్కూల్ భవనం

స్కూల్‌పై కూలిన విమానం

» పైలట్ సహా 20 మంది దుర్మరణం.. బంగ్లాదేశ్‌లో ఘటన

ఢాకా, జూలై 21: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఎయిర్‌ఫోర్స్ శిక్షణ విమానం కూలి 20 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 171 మంది గాయపడ్డారు. బంగ్లాదేశ్ సైన్యానికి చెందిన ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) కథనం ప్రకారం.. బంగ్లాదేశ్ వాయుసేనకు చెందిన ఎఫ్-7బీజీఐ శిక్షణ విమానం సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఢాకా ఎయిర్ బేస్ నుంచి గాల్లోకి ఎగిరింది. కాసేపట్లోనే ఆ విమానంలో సాంకేతిక లోపాలు తలెత్తి.. 1.08 గంటల సమయంలో సమీపంలోని మూడంతస్తుల మైల్స్ స్టోన్ స్కూల్‌పై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ విమానంలో ఒక పైలట్ ఉన్నారు. ఈ ప్రమాదంలో పైలట్‌తో పాటు మైల్స్ స్టోన్ బడిలోని ఇద్దరు ఉపాధ్యాయులు, 17 మంది విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 171 మందికి గాయాలయ్యాయి. సాంకేతిక కారణాలతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐఎస్‌పీఆర్ వివరించింది. "ప్రమాదం జరిగిన సమయంలో ఆ విమానంలో పైలట్.. లెఫ్టినెంట్ మహమ్మద్ తౌఖీర్ ఇస్లాం ఉన్నారు. సాంకేతిక లోపంపై ఆయన ఏటీసీకి సమాచారం అందించారు. నిజానికి ఆ విమానం జనసమ్మర్ధత అధికంగా ఉండే ప్రాంతంలో పడేది. కానీ, పైలట్ సమయస్ఫూర్తితో ఉత్తర ఢాకా వైపు మళ్లించారు" అని ఐఎస్‌పీఆర్ వివరించింది.

ముంబై విమానాశ్రయంలో ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం

» రన్‌వే పక్కకు దూసుకెళ్లిన కోచి విమానం

ముంబై, జూలై 21: ముంబై విమానాశ్రయంలో సోమవారం ఎయిరిండియా విమానం స్వల్ప ప్రమాదానికి గురైంది. కోచి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ముంబై బయలుదేరిన ఎయిరిండియా విమానం.. సోమవారం ఉదయం 9.27 గంటలకు ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అయితే.. ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై ఆ విమానం అదుపుతప్పినట్లు ఎన్డీటీవీ ప్రచురించిన దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. విమానం రన్‌వే పక్కకు చొచ్చుకుపోవడంతో.. ఓవైపు వంగిపోయింది. ఈ ఘటనలో రన్‌వే పక్కన ఉండే మూడు సైన్ బోర్డులు, రన్‌వే అంచుల్లో ఉండే నాలుగు లైట్లు దెబ్బతిన్నాయి. విమానంలోని కుడి ఇంజన్ దెబ్బతిన్నది. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఎయిరిండియా కూడా స్పందించింది. విమానంలోని ఇద్దరు పైలట్లను విధుల నుంచి తప్పించినట్లు ప్రకటించింది. మరోవైపు, ఎయిరిండియా విమానం సాంకేతిక సమస్య కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టు వద్ద టేకాఫ్‌ను రద్దు చేసుకున్న ఉదంతం సోమవారం చోటుచేసుకుంది. ఏఐ2403 విమానం ఢిల్లీ నుంచి కోల్‌కతా బయలుదేరడానికి సిద్ధంగా ఉండగా పైలట్లు సాంకేతిక లోపాలను గుర్తించారని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. అయితే.. టేకాఫ్‌ను రద్దు చేసుకునే సమయంలో విమానం రన్‌వేపై 155 కి.మీ వేగంతో వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పైలట్లు సాంకేతిక లోపాన్ని గుర్తించారు.

అన్ని హద్దులూ దాటేస్తున్నారు!

(మొదటిపేజీ తరువాయి)



చేయొద్దని ఏఎస్‌జీని కోరింది. సోమవారం రెండు కేసుల విచారణ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. వీటిలో ఒకటి కర్ణాటక సీఎం సిద్దరామయ్య భార్యకు ముడా కేసులో ఉపశమనం కల్పిస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈడీ అప్పీలుకు సంబంధించినది కాగా, రెండోది క్లైంట్‌లకు సలహాలు ఇచ్చినందుకు సీనియర్ న్యాయవాదులకు ఈడీ సమన్లు జారీ చేసిన కేసు. ముడా(మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ) స్థలాల అక్రమ కేటాయింపుల కేసులో కర్ణాటక సీఎం సిద్దరామయ్య భార్య బీఎం పార్వతి, కర్ణాటక పట్టణాభివృద్ధి మంత్రి బైరాతి సురేశ్‌లపై మనీలాండరింగ్ ప్రొసీడింగ్స్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేయడంతో ఈడీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. తాజాగా హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ కేసులో దిగువ కోర్టుతోపాటు హైకోర్టు కూడా చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చినప్పటికీ ఈడీ అప్పీలు చేయడాన్ని సీజేఐ ప్రశ్నించారు. 'విచారణ కోర్టు తీర్పును సింగిల్ జడ్జి సమర్థించారని మీకు బాగా తెలుసు. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వరకే పరిమితం కానివ్వండి. ఇందులో మిమ్మల్ని ఎందుకు వాడుకుంటున్నారు? దురదృష్టవశాత్తూ మహారాష్ట్రలోనూ ఈడీ నుంచి ఇలాంటి వైఖరినే చూశాం. ఇంతకుమించి వ్యాఖ్యానించేలా మాపై ఒత్తిడి తీసుకురావొద్దు. లేదంటే ఈడీ గురించి ఇంతకంటే కఠినంగా మేం మాట్లాడాల్సి వస్తుంది' అని సీజేఐ పేర్కొన్నారు. దీంతో అప్పీలును ఉపసంహరించుకుంటున్నామని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) ఎస్వీ రాజు తెలపగా, కఠిన పదాలు వాడకుండా మమ్మల్ని కాపాడారంటూ ఆయనకు సీజేఐ ధన్యవాదాలు తెలిపారు.

ఈడీకి అడ్డుకట్ట వేసేందుకు మార్గదర్శకాలు అవసరం

తమ క్లైంట్‌లకు న్యాయ సలహాలు ఇచ్చారంటూ సీనియర్ న్యాయవాదులు డి.అరవింద్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ సమన్లు జారీ చేయడంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. న్యాయ వృత్తిపై ఈడీ చర్యలు భయంకరంగా ఉన్నాయన్న సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్.. కొన్ని అంతర్జాతీయ ఘటనలనూ విచారణలో ప్రస్తావించారు. 'టర్కీలో మొత్తంగా బార్ అసోసియేషన్‌నే రద్దు చేయడం చూశాం. చైనాలోనూ అలాంటిదే చూశాం. మనం ఆ దిశలో వెళ్లకూడదు. కొన్ని మార్గదర్శకాలు రూపొందించాలి' అన్నారు. దీనికి సీజేఐ అంగీకరించారు. ఈ అంశంలో అమికస్ క్యూరీని నియమిస్తామని తెలిపారు. దీంతో సీనియర్ న్యాయవాదులకు జారీ చేసిన సమన్లను ఈడీ ఉపసంహరించుకుంది. ఇకపై ఈడీ డైరెక్టర్ అనుమతి లేకుండా లాయర్లకు సమన్లు జారీ చేయబోమంటూ ఈడీ ఒక లేఖను విడుదల చేసింది. కాగా, ఈడీపై తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.

మీరేమీ సూపర్ పోలీసు కాదు

» ఈడీపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, జూలై 21: 'మీ దృష్టికి వచ్చిన ఏ అంశంపైనైనా దర్యాప్తు చేయడానికి మీరేమీ సూపర్ పోలీసు కాదు. లేదా ప్రతి నేర కార్యకలాపంపైనా దాడి చేయడానికి మీరేమీ డ్రోన్ కాదు' అంటూ ఈడీపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నైకి చెందిన ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన రూ.901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్తంభింపజేస్తూ ఈడీ జనవరి 31న జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు పక్కన పెట్టింది. ఈ అంశం ఈడీ పరిధిలోకి రాదని తేల్చిచెప్పింది. 2006లో ఛత్తీస్‌గఢ్‌లోని ఒక థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు బ్లాకులు కేటాయించడంపై దాఖలైన పిల్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఆ కేటాయింపును రద్దు చేయడంతోపాటు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించగా, 2014లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా అదే ఏడాది మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసింది. ఈ ఏడాది జనవరి 31న ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సోదాలు నిర్వహించిన ఈడీ.. ఆ సంస్థకు చెందిన రూ.901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్తంభింపజేసింది. దీన్ని ఆర్‌కేఎం పవర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ సవాలు చేయగా.. ఈ కేసు మనీలాండరింగ్ నిరోధక చట్టం పరిధిలోకి రాదంటూ ఈడీ ఆదేశాలను ధర్మాసనం పక్కనపెట్టింది.

భారత్‌పై చైనా కుయుక్తులు!

(మొదటిపేజీ తరువాయి)

పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన 32 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.75 లక్షల కోట్ల) విలువైన స్మార్ట్‌ఫోన్ల ఎగుమతి లక్ష్యాన్ని ప్రమాదంలో పడేస్తుందని హెచ్చరించింది. 'ప్రపంచ తయారీ హబ్‌గా భారత్ ఆవిర్భావాన్ని, భారత సరఫరా చైన్లను దెబ్బతీయడమే లక్ష్యంగా చైనా ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు పాల్పడుతోందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. చైనా నియంత్రణలపై తక్షణం జోక్యం చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. మరీ ముఖ్యంగా ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా, కేవలం మౌఖిక సూచనల ద్వారానే చైనా ఒక ప్రణాళిక ప్రకారం, క్రమ పద్ధతిలో ఆంక్షలకు పాల్పడుతోందని ఐసీఈఏ పేర్కొంది. ఇండియా సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్‌లో ప్రముఖ సంస్థలైన యాపిల్, గూగుల్, మోటోరోలా, ఫాక్స్‌కాన్, వివో, ఒప్పో, లావా, డిక్సాన్, ఫ్లెక్స్, టాటా ఎలక్ట్రానిక్స్ ఉన్నాయి. కాగా, భారత్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్లలో పనిచేస్తున్న తమ దేశ ఇంజనీర్లు, టెక్నీషియన్లు వెంటనే అక్కడి నుంచి వచ్చేయాలని చైనా కోరినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. యాపిల్‌కు వాణిజ్య భాగస్వామి, అతిపెద్ద ఐఫోన్ల తయారీదారు ఫాక్స్‌కాన్ తన భారత్‌లోని ఉత్పత్తి కేంద్రాల్లో 300 మందికి పైగా చైనా ఇంజనీర్లు, టెక్నీషియన్లను రీకాల్ చేసిందని బ్లూమ్‌బర్గ్ ఇటీవలి కథనాలు వెల్లడించాయి. భారత్‌లో ఐఫోన్-17 తయారీకి యాపిల్ సంస్థ సిద్ధమవుతున్న వేళ.. ఇది ఇబ్బందిగా మారనుంది. ఈ పరిస్థితిపై కేంద్రం స్పందించింది. దీన్ని తట్టుకొనేందుకు యాపిల్ సంస్థ వద్ద ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని విశ్వసిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నట్లు వార్తాసంస్థ పీటీఐ పేర్కొంది. ఇది ప్రధానంగా యాపిల్, ఫాక్స్‌కాన్‌లకు చెందిన విషయమని అధికార వర్గాలు అందులో పేర్కొన్నాయి.

బరాక్ ఒబామా అరెస్టు!

» ఏఐ వీడియో పోస్ట్ చేసిన ట్రంప్



న్యూఢిల్లీ, జూలై 21: అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా లక్ష్యంగా.. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ వివాదాస్పద చర్యకు పాల్పడ్డారు. ఒబామాను పోలీసులు అరెస్టు చేస్తున్నట్లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా సృష్టించిన వీడియోను ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' సోషల్‌లో పోస్ట్ చేశారు. ట్రంప్, ఒబామా ఇద్దరూ వైట్‌హౌస్‌లో కూర్చుని ముచ్చటించుకుంటుండగా.. ఎఫ్‌బీఐ పోలీసులు అక్కడికి వచ్చి ఒబామా రెక్కలు విరిచి బేడీలు వేసినట్లు, ట్రంప్ కాళ్ల వద్ద ఒబామా పడిపోయినట్లు ఈ వీడియోను సృష్టించారు. ఒబామాను అరెస్టు చేస్తుంటే ట్రంప్ చిరునవ్వులు చిందిస్తున్నట్లుగా వీడియోలో కనిపిస్తుంది. పైగా, 'చట్టానికి ఎవరూ అతీతులు కాదు' అన్న వ్యాఖ్య కూడా వీడియోలో కనిపిస్తుంది. అనంతరం ఒబామా ఖైదీ దుస్తుల్లో జైల్లో కటకటాల వెనక ఉన్నట్లుగా చిత్రీకరించారు. 2016 ఎన్నికల సమయంలో ట్రంప్ అధ్యక్షుడు కాకుండా అడ్డుకునేందుకు, ఎన్నికయ్యాక ఆయన పాలనను నియంత్రించేందుకు ఒబామా ప్రయత్నించారంటూ అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ట్రంప్ ఎన్నికలో రష్యా ప్రమేయం ఉందన్నట్లుగా ప్రచారం చేసినట్లు ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఈ వీడియోను పోస్ట్ చేయడం సంచలనంగా మారింది. ట్రంప్ చర్యను నెటిజన్లు తప్పుబట్టారు. అయితే లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ సంబంధాలు కొనసాగించినట్లుగా వార్తలు వస్తున్న వేళ.. దాని నుంచి దృష్టి మరల్చేందుకే ట్రంప్ ఈ చర్యకు దిగారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ముంబై రైళ్లలో పేలుళ్ల కేసులో ఆ 12 మందీ నిర్దోషులే

» నిందితులను హింసించి నేరం ఒప్పించారు

» బాంబే హైకోర్టు సంచలన తీర్పు

» ఉరిశిక్ష పడిన ఐదుగురు సహా నిందితులందరి విడుదలకు ఆదేశం

ముంబై, జూలై 21: ముంబై లోకల్ ట్రైన్లలో వరుస బాంబుపేలుళ్ల కేసులో శిక్షలుపడిన మొత్తం 12 మందినీ విడుదల చేయాలని బొంబాయి హైకోర్టు ఆదేశించింది. 2006 జూలై 11 నాటి ఈ ఘటనలో 189 మంది మరణించగా, 800మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసులో నిందితులుగా పోలీసులు పేర్కొన్న 12 మందికి 2015 సెప్టెంబరు 30న మోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్) ప్రత్యేక కోర్టు శిక్షలు విధించింది. వీరిలో ఐదుగురికి మరణశిక్షను, మిగతావారికి యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. మరణశిక్షలు పడిన ఐదుగురు ఈ తీర్పును సవాల్ చేస్తూ బాంబే హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ ఎస్సీ చంద్రక్‌లతో కూడిన ప్రత్యేక బెంచ్ 8 నెలలపాటు ఈ పిటిషన్లపై విచారణ జరిపి గత నెల 31న తీర్పును రిజర్వు చేసింది. సోమవారం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో అరెస్టు చేసిన 12 మందిని దోషులుగా నిర్ధారించే ఆధారాలేవీ ప్రాసిక్యూషన్ సమర్పించలేకపోయిందని 671 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. తమ పిటిషనర్లను తీవ్ర చిత్రహింసలకు గురిచేసి నేరాన్ని ఒప్పించారన్న న్యాయవాది వాదనతో ఏకీభవించింది. పేలుళ్లకు ఏ రకం పదార్థం ఉపయోగించారనేది వివరించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని స్పష్టం చేసింది. ఘటన జరిగిన నాలుగేళ్లకు నిందితులను గుర్తించడానికి పరేడ్ నిర్వహించడం అసాధారణమని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. పౌరు లు చట్టం, కోర్టుల పట్ల ఉంచిన విశ్వాసాన్ని తక్కువచేసే విధంగా ప్రాసిక్యూషన్ చర్య ఉందని ఆక్షేపించింది. కాగా, ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజా ఠాకారే వాదనలు వినిపించారు. మహారాష్ట్రలోని పలు జైళ్లలో ఉన్న పిటిషనర్లు వీడియోకాన్ఫరెన్సింగ్ పద్ధతిలో విచారణలో పాల్గొన్నారు. మరణశిక్ష పడి నాగపూర్ కేంద్ర కారాగారంలో ఉన్న నవేద్ హుస్సేన్ ఖాన్ తన వాదనలు తానే వినిపించుకున్నారు. కాగా, హైకోర్టు తీర్పు విస్మయం కలిగించిందని, సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మా కుటుంబానికి సన్నిహితుడు



ఇటీవల కన్నుమూసిన సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను డాక్టర్ మోహన్‌బాబు పరామర్శించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని, నాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. కోట శ్రీనివాసరావు మరణించిన రోజున తాను హైదరాబాద్‌లో లేనని, అందుకే ఈ రోజు ఇలా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చానని మోహన్‌బాబు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కోట శ్రీనివాసరావు నాకు అత్యంత ఆప్తుడు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. 'కన్నప్ప' సినిమా విడుదలైన రోజున నాకు ఫోన్ చేసిన 'సినిమా చాలా బాగుంది. విష్ణుకు మంచి పేరు వచ్చింది' అని చెప్పారు. 1987లో 'వీర ప్రతాప్' సినిమాలో మాంత్రికుడిగా ఆయనకు మెయిన్ విలన్‌గా అవకాశం ఇచ్చాను. ఆ తర్వాత మా బేనరులోనే కాకుండా బయటి చిత్రాల్లో కూడా ఇద్దరం కలసి నటించాం. ఏ పాత్ర అయినా అవలీలగా పోషించగల గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. అలాగే రకరకాల మాడ్యులేషన్స్‌లో డైలాగులు చెప్పగలిగిన నటుడు. మా కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు' అన్నారు.

శరవేగంగా మ్యూజిక్ సెషన్స్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'వీటీ15(వర్కింగ్ టైటిల్)' సినిమా మ్యూజిక్ సెషన్లు శరవేగంగా జరుగుతున్నాయి. థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ - థమన్ కాంబినేషన్ మరోసారి అద్భుతమైన ఆల్బమ్ ఇవ్వబోతున్నారని, ఇప్పటికే రెండు పాటలు పూర్తయ్యాయని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మూడు మేజర్ షెడ్యూళ్లను ఇండియా, విదేశాల్లో చిత్రీకరించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. త్వరలోనే టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

250 రోజుల షూటింగ్.. మూడేళ్ల కష్టం



రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న భారీ చిత్రం 'కాంతార చాప్టర్-1'. 'రాజకుమార', 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన హోంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు 'కాంతార చాప్టర్-1' మేకింగ్ వీడియోను విడుదల చేశారు. దాదాపు 250 రోజుల షూటింగ్, మూడు సంవత్సరాల కష్టాన్నంతా ఈ వీడియోలో చూపించారు. ఆర్ట్ డైరెక్టర్ వినేష్ ఆధ్యాత్మిక దృశ్యాలను అద్భుతంగా డిజైన్ చేశారు. కాగా, ఈ సినిమా అక్టోబరు 2న కన్నడ, హిందీ, తెలుగు, మలయాళం, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ కానుంది.



అన్నం పెట్టిన పరిశ్రమకు అండగా ఉంటా

పవన్ కల్యాణ్

'నిర్మాతలు కనుమరుగవుతున్న ఈ సమయంలో ఒక బలమైన చిత్రం నిర్మించి, ఒడుదొడుకులు తట్టుకొని నిలబడిన నిర్మాతకు అండగా ఉండాలనే ఉద్దేశంతో.. నా బిజీ షెడ్యూల్‌ని వదిలేసి, ప్రత్యర్థులు నన్ను విమర్శిస్తున్నా ఇక్కడికి వచ్చాను. ఎందుకంటే సినీ పరిశ్రమ నాకు అన్నం పెట్టింది. అలాంటి పరిశ్రమకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను' అని అన్నారు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'ఒక సినిమా చేయడమంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. అది ఆర్థికంగా కావచ్చు, సృజనాత్మకంగా కావచ్చు. ప్రాంతీయ స్థాయి సినిమాని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఏ.ఎమ్.రత్నం. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా రత్నం పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి ప్రతిపాదించాను. ఆయన నా నిర్మాత అని కాదు.. ఇలాంటి వ్యక్తి ఉంటే సినీ పరిశ్రమ బాగుంటుందని ప్రతిపాదించాను. సినిమా అంటే నాకు అపారమైన గౌరవం. రత్నం లాంటి నిర్మాత ఇబ్బంది పడకూడదని ఈ సినిమాని నా భుజాలపైకి తీసుకున్నాను. కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతిభ ఉంటే ఎవరైనా సినీ రంగంలో రాణించవచ్చు. 'భీమ్లానాయక్' విడుదలైనప్పుడు అందరి సినిమాల టిక్కెట్లు వందల్లో ఉంటే, నా సినిమాకు పదుల్లో ఉండేవి. నేనెప్పుడూ రికార్డుల కోసం ప్రయత్నించను. అసలు నేను యాక్టర్ అవ్వాలనే కోరుకోలేదు. ఒక సగటు మనిషిగా జీవించాలనే ఆలోచన తప్ప నాలో ఏం లేదు. ఒక సినిమా చేయాలంటే చాలా కష్టం. హిట్లు, ఫ్లాప్స్ కాకుండా నేను అభిమానులు చూపే ప్రేమనే నమ్మాను. నా బలం మీ అందరి అభిమానమే. కీరవాణి అద్భుతమైన సంగీతం ఇచ్చారు. మనోజ్ పరమహంస ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. చిత్రీకరణకు వారానికి ఐదు రోజుల్లో రోజూ రెండు గంటలే కేటాయించినా, దానికి తగ్గట్లు వర్క్ చేసిన టీమ్ కృషి వెలకట్టలేనిది. చిత్ర ప్రమోషన్స్ కోసం నిధి అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. ఈ విషయంలో ఆమెను అభినందించాలి. ఈ సినిమా సబ్జెక్ట్ నాకు చాలా ఇష్టమైనది. ఇందులో నేను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ ఉపయోగించిన క్లైమాక్స్‌లో 18 నిమిషాల ఫైట్ కంపోజ్ చేశా" అని అన్నారు. చిత్ర దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ '17వ శతాబ్దం మొఘల్స్ నేపథ్యంలో ఉండే సినిమా ఇది. ఆ సమయంలో ఔరంగజేబుకి, వీరమల్లు అనే కల్పిత పాత్రకి మధ్య జరిగే యుద్ధం ఈ సినిమా' అని చెప్పారు. నిర్మాత ఏ.ఎమ్ రత్నం మాట్లాడుతూ "నేను ఇన్ని సినిమాలు నిర్మించినా, ఇది చాలా స్పెషల్. ఇందులో పవన్‌కల్యాణ్ విశ్వరూపం చూస్తారు. ఈ చిత్రాన్ని నిర్మించినందుకు గర్వంగా ఉంది" అని తెలిపారు. నిర్మాత దయాకర్ రావు మాట్లాడుతూ "అభిమానులకు ఈ సినిమా విందుభోజనంలా ఉండబోతోంది. మీరు ఊహించిన దానికంటే ఎక్కువ వినోదం అందివ్వబోతున్నాం" అని చెప్పారు. నిధి అగర్వాల్ మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్‌తో పనిచేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు, కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ కండ్రే, నటులు బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు పాల్గొన్నారు.



నెగెటివ్ పాత్రలకు సిద్ధమే

త్రిప్తీ డిమ్రి

వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు త్రిప్తీ డిమ్రీ. ఇటీవలె ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' సినిమాలో అవకాశం కొట్టేసిన ఆమె, దర్శకుడు విశాల్ భరద్వాజ్ చేసే చిత్రంలోనూ నటిస్తున్నారు. అలాగే, సిద్దార్థ్ చతుర్వేదితో ఆమె నటించిన 'ధడక్ 2' ఆగస్టు 1న ప్రేక్షకులు ముందుకు వస్తోంది. చిత్ర ప్రచారంలో భాగంగా ఆమె మీడియాతో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఇందులో నేను కాలేజీ విద్యార్థిగా కనిపిస్తాను. నేనిప్పటివరకూ ఎన్నో కామెడీ, లవ్ చిత్రాల్లో నటించాను. కానీ యాక్షన్ జానర్‌లో రూపొందిన చిత్రాల్లో నటించలేదు. ఒకవేళ అటువంటి సినిమాల్లో అవకాశం వస్తే అస్సలు వదులుకోను. యాక్షన్ పాత్రలు చేయడం ద్వారా నా నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించొచ్చని భావిస్తా. కంటెంట్ బాగుంటే నెగెటివ్ పాత్రలు చేయడానికైనా సిద్ధమే" అని పేర్కొన్నారు.

టికెట్ ధరల పెంపునకు అనుమతి

తెలంగాణలో 'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే సినిమా ముందు రోజు (ఈనెల 23న) రాత్రి 9 గంటలకు ప్రీమియర్ షోకు సైతం అంగీకరించింది. ఈ షోకు టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. ఈనెల 24 నుంచి 27 వరకు మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.200, సింగిల్ స్ర్కీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.150 వరకు పెంచుకునేందుకు అనుమతినిచ్చింది. అలాగే ఈనెల 28 నుంచి ఆగస్టు 2 వరకు మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.150, సింగిల్ స్ర్కీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.106 వరకు పెంచుకునేందుకు అనుమతిని ఇచ్చింది.

మేకోవర్ మొదలైంది



రామ్‌చరణ్ కథానాయకుడిగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు కీలక షెడ్యూళ్ల చిత్రీకరణను పూర్తి చేసింది చిత్ర బృందం. తదుపరి జరిగే షెడ్యూల్ కోసం బీస్ట్ లుక్‌లోకి మారిపోయారు రామ్‌చరణ్. ఈ సందర్భంగా కండలు తిరిగిన దేహంతో జిమ్‌లో కసరత్తులు చేస్తున్న పిక్‌ను రామ్‌చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'పెద్ది' కోసం మేకోవర్ మొదలైంది. ఈ సవాలు కఠినమైనదైనా.. ఎంతో సంతోషాన్ని ఇస్తోంది" అని పేర్కొన్నారు. ఇప్పుడీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవలె విడుదల చేసిన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర శక్తిమంతంగా ఉండబోతోంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న చిత్రం విడుదలవుతోంది.

బెట్టింగ్ యాప్‌ల కేసు..

- రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండకు నోటీసులు
- మంచు లక్ష్మికి కూడా.. రేపు ఈడీ ముందుకు రానా
- ఆ తర్వాతి వరుసలో ప్రకాశ్ రాజ్

బెట్టింగ్ యాప్‌ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్స్ చేసిన సినీ నటులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీచేసింది. యాప్‌ల ప్రమోషన్ల వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. మొత్తం 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసిన ఈడీ.. తాజాగా నోటీసులు జారీచేసింది. ఈ నెల 23న తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ దగ్గుబాటి రానాకు నోటీసులు జారీ అయ్యాయి. జూలై 30న ప్రకాశ్‌రాజ్, ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, ఆగస్టు 13న మంచు లక్ష్మిని తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ అధికారులు వారికి జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేశారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేయడానికి కారణాలేంటి? వీరికి రెమ్యునరేషన్ ఏ రూపంలో అందింది? తదితర అంశాలపై ఈడీ వీరి వాంగ్మూలాన్ని రికార్డు చేయనుంది. హవాలా, మనీలాండరింగ్ కోణాలపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. సినీ నటుల మాటలు నమ్మి లక్షల మంది అమాయకులు బెట్టింగ్ యాప్‌ల వలలో పడి, నిలువుదోపిడీకి గురైన విషయం తెలిసిందే..! కొందరైతే ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

గ్లాండ్ ఫార్మా రేసులో బ్రూక్‌ఫీల్డ్, ఈక్వ్యూటీ

ఫోసన్ నుంచి 51.8% వాటా కొనుగోలుకు సన్నాహాలు • ప్రతిబంధకంగా కంపెనీ షేరు ధర



దేశీయ ఫార్మా రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే గ్లాండ్ ఫార్మా యాజమాన్యం మళ్లీ చేతులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కంపెనీ ఈక్విటీలో 51.8 శాతం వాటా ఉన్న చైనా కంపెనీ ఫోసన్ గ్రూప్ తన వాటాను అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు బ్రూక్‌ఫీల్డ్, ఈటీక్యూ ఈ వాటా కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. సీవీసీ క్యాపిటల్ పార్ట్‌నర్స్, వార్‌బర్గ్ పింకస్ అనే పీఈ సంస్థలు కూడా త్వరలో ఈ వాటా కొనుగోలుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు.

ఫోసన్ వాటా విలువ రూ.30,000 కోట్లు

గ్లాండ్ ఫార్మా షేరు సోమవారం బీఎస్ఈలో స్వల్పలాభంతో రూ.2,012.15 వద్ద క్లోజైంది. గత నెల రోజుల్లోనే కంపెనీ షేరు ధర 16 శాతం పెరిగింది. ఈ లెక్కన గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో చైనా కంపెనీ ఫోసన్‌కు ఉన్న 51.8 శాతం వాటా విలువ దాదాపు రూ.30,000 కోట్ల వరకు ఉంటుంది. దీంతో పాటు మైనారిటీ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటాను ఓపెన్ ఆఫర్ ద్వారా కొనుగోలు చేయాలి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే ఇందుకు ఎంత లేదన్నా మరో రూ.25,800 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇంత భారీ మొత్తం పెట్టేందుకు ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు వెనుకాడుతున్నట్లు సమాచారం. దీంతో ఈ అమ్మకం ఎంత వరకు ముందుకు కదులుతుందన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

1978లో ఏర్పాటు: గ్లాండ్ ఫార్మాను 1978లో పీవీఎన్ రాజు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో ఇంజెక్టబుల్స్, కొత్త ఔషధాల అభివృద్ధి, తయారీ (సీడీఎంఓ)లో కంపెనీకి మంచి పట్టుంది. 2016లో చైనా కంపెనీ ఫోసన్ గ్రూప్..గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో 86 శాతం వాటాను మరో పీఈ సంస్థ కేకేఆర్ నుంచి 126 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. గల్వాన్ సరిహద్దు ఘర్షణ తర్వాత కేంద్రం చైనా కంపెనీలపై పట్టు బిగిస్తోంది. అప్పటి నుంచి చైనా కంపెనీ ఓపెన్ మార్కెట్లో షేర్లు విక్రయించడం ద్వారా ప్రస్తుతం తన వాటాను 51.8 శాతానికి కుదించుకుంది. ఈ వాటాను కూడా ఏదైనా పీఈ సంస్థలకు విక్రయించి గ్లాండ్ ఫార్మా నుంచి పూర్తిగా తప్పుకోవాలని ఫోసన్ భావిస్తోంది.

డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ మరింత కట్టుదిట్టం: ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకుల డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్‌ను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరింత పటిష్ఠం చేసింది. ఈ చానల్స్‌తో బ్యాంకులు మరో సంస్థకు చెందిన ఉత్పత్తులు, సేవలు ప్రదర్శించడాన్ని నిషేధించింది. బ్యాంకుల అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీలకూ ఇది వర్తిస్తుందని తెలిపింది. దీనికి సంబంధించి 'ఆర్‌బీఐ (డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ ఆథరైజేషన్) డైరెక్షన్స్, 2025 పేరుతో సోమవారం కొన్ని ముసాయిదా నిబంధనలు విడుదల చేసింది. ఈ ముసాయిదా నిబంధనలపై వచ్చే నెల 11లోగా బ్యాంకులు, సంబంధిత పార్టీలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ప్రతి బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం రిస్క్ ఆధారిత లావాదేవీల పర్యవేక్షణ, నిఘా వ్యవస్థలను కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌బీఐ కోరింది.

పదేళ్లలో 12 లక్షల క్రెటా కార్ల విక్రయం

హైదరాబాద్: హ్యుండయ్ మోటార్ ఇండియాకు చెందిన మిడ్‌సైజ్ ఎస్‌యూవీ కారు క్రెటా భారత్‌లో అడుగుపెట్టి పదేళ్లు పూర్తయింది. ఈ పదేళ్ల విజయవంతమైన ప్రయాణంలో



మొత్తం 12 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి. 2015లో భారత్‌లో మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో సాహసోపేతంగా అడుగు పెట్టి ఇప్పుడు 12 లక్షల మంది కస్టమర్ల ఇళ్లలో ఆనందాలు నింపుతున్నామని, పదేళ్లుగా ఈ సెగ్మెంట్‌లో క్రెటా నంబర్ 1 స్థానం నిలబెట్టుకుంటూనే వస్తోందని హ్యుండయ్ మోటార్ ఇండియా ఎండీ ఉన్‌సూ కిమ్ అన్నారు. 2015 నాటికి ఈ సెగ్మెంట్‌లో కేవలం రెండు మోడళ్లుండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 12కి పెరిగినప్పటికీ అంత పోటీలో కూడా క్రెటా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటూ రావడం లక్షలాది మంది కస్టమర్ల విశ్వాసానికి ప్రతీక అని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ అన్నారు. గత పదేళ్లలో క్రెటా వార్షిక అమ్మకాలు రెట్టింపు పైబడి పెరిగాయని, 2015-16 ఆర్థిక సంవత్సరంలో 92,996గా ఉన్న అమ్మకాలు 2024 నాటికి 1,86,919కి చేరాయని ఆయన వెల్లడించారు. మిడ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో క్రెటా 31 శాతం మార్కెట్ వాటా కలిగి ఉందన్నారు. ప్రస్తుతం క్రెటా.. పెట్రోల్, డీజిల్, టర్బో, ఎలక్ట్రిక్ వేరియెంట్లలో మాన్యువల్, ఆటోమేటిక్ ఆప్షన్లలో అందుబాటులో ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22న తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	543	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

జీసీసీల అడ్డా హైదరాబాద్

273 జీసీసీలతో దేశంలో రెండో స్థానం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీలతో పాటు గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కూ హైదరాబాద్ కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ జీసీసీలు కొలువుదీరాయి. దేశంలో ఉన్న దాదాపు 1,700 జీసీసీల్లో 29 శాతం (487) బెంగళూరులో ఉంటే, 273 జీసీసీలతో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. అమెరికా కేంద్రంగా పనిచేసే రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ వెస్టియన్ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.

డిల్లీ-ఎన్‌సీఆర్ (272), ముంబై (207), పుణె (178), చెన్నై (162) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా నగరాల్లో పెరుగుతున్న మౌలిక వసతులు, నిపుణులైన ఉద్యోగులు దొరకడం, ప్రభుత్వాల ప్రోత్సాహం, ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ ఖర్చులు మన దేశంలో పెద్దఎత్తున జీసీసీల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి.

నివేదికలోని ఇతర ప్రధానాంశాలు

- దేశంలోని మొత్తం జీసీసీల్లో 55 శాతం (922) బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లోనే
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3,200 జీసీసీల్లో 53 శాతం భారత్‌లోనే
- దేశంలోని మొత్తం జీసీసీల్లో 94 శాతం ఆరు నగరాల్లోనే ఉన్నాయి
- 2028 నాటికి దేశంలో జీసీసీల సంఖ్య 2,100 దాటే అవకాశం
- ఏటా కొత్తగా 150 జీసీసీల ఏర్పాటు
- దేశంలోని జీసీసీల్లో దాదాపు సగం ఐటీ, ఐటీఈఎస్ ఆధారిత జీసీసీలు

నిధుల వేటలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

త్వరలో రూ.6,000 కోట్ల ఎన్‌సీడీల జారీ!

న్యూఢిల్లీ: జీఎంఆర్ గ్రూప్ మరోసారి పెద్ద ఎత్తున నిధుల సమీకరణకు సిద్ధమవుతోంది. గ్రూప్ కంపెనీ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రుణ పత్రాల జారీ ద్వారా త్వరలో రూ.4,000 కోట్ల నుంచి రూ.6,000 కోట్ల సమీకరించబోతున్నట్టు సమాచారం. ఈ నిధులను కంపెనీకి ఉన్న రూ.5,700 కోట్ల అధిక వడ్డీ రుణాలు చెల్లించేందుకు ఉపయోగిస్తారని భావిస్తున్నారు. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) రూపంలో జారీ చేసే ఈ రుణ పత్రాలను సాధారణ ప్రజానీకం, సంస్థాగత మదుపరులకు కాకుండా మ్యూచువల్ ఫండ్స్‌కు జారీ చేస్తారని సమాచారం.

యూకో బ్యాంక్ లాభం రూ.607 కోట్లు

కోల్‌కతా: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.607 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.551 కోట్లతో పోల్చితే లాభం 10.16% పెరిగింది. బలమైన రుణ వృద్ధితో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడడం ఇందుకు దోహదపడినట్టు బ్యాంక్ తెలిపింది. ఇటు వడ్డీ ఆదాయం, అటు వడ్డీయేతర ఆదాయం కూడా పెరిగాయని బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వినీ కుమార్ తెలిపారు. రుణాలపై ఆర్జించిన వడ్డీ ఆదాయమే రూ.6,000 కోట్ల నుంచి రూ.6,400 కోట్లకు పెరిగిందన్నారు. దీనికి తోడు నిర్వహణా వ్యయాలు 4% మాత్రమే పెరగడం లాభదాయకత పెరుగుదలకు దోహదపడిందని తెలిపారు. అయితే రుణాలపై వడ్డీ సవరణ ముందస్తుగానే ప్రకటించిన కారణంగా నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) గతంలో అంచనా వేసిన 3-3.10% నుంచి 2.9-3 శాతానికి తగ్గవచ్చని ఆయన చెప్పారు. జూన్ త్రైమాసికంలో ఎన్ఐఎం 2.96 శాతంగా ఉన్నట్టు తెలిపారు. జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.51% వృద్ధితో రూ.5,23,736 కోట్లకు పెరగగా, రుణాలు 16.48% వృద్ధితో రూ.2,25,101 కోట్లకు, డిపాజిట్లు 11.37% వృద్ధితో రూ.2,98,635 కోట్లకు చేరాయని పేర్కొంది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.32% నుంచి 2.63 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.78% నుంచి 0.45 శాతానికి తగ్గాయి.

దొడ్ల డెయిరీ లాభంలో క్షీణత

దొడ్ల డెయిరీ జూన్ త్రైమాసికంలో రూ.62.87 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.65.02 కోట్లతో పోల్చితే లాభం 3 శాతం తగ్గింది. అయితే సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.918.53 కోట్ల నుంచి రూ.1,023.78 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయం రూ.825.73 కోట్ల నుంచి రూ.942.80 కోట్లకు పెరిగింది.

ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ కారు

ధర రూ.69.90 లక్షలు



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. మార్కెట్లోకి ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ లిమోసిన్ కారును తీసుకువచ్చింది. ఈ కారు పరిచయ ధర రూ.69.90 లక్షలు (ఎక్స్‌షోరూమ్). కంపెనీ లగ్జరీ రిటైల్ విభాగం ఎంజీ సెలెక్ట్ ద్వారా ఈ కార్లను విక్రయించనుంది. రూ.లక్ష చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చని ఎంజీ వెల్లడించింది. ఆగస్టు 10 నుంచి ఈ కారు డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. 90కేడబ్ల్యూహెచ్ నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్ఎంసీ) బ్యాటరీతో కూడిన ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 548 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. 160 కేడబ్ల్యూ డీసీ ఫాస్ట్ చార్జర్‌తో ఈ బ్యాటరీ కేవలం గంటన్నరలోనే వంద శాతం చార్జింగ్ అవుతుంది.

మళ్లీ లాభాల్లోకి మార్కెట్లు

● సెన్సెక్స్ 442 పాయింట్లు అప్

ముంబై: గత వారాంతంలో వరుసగా రెండు రోజులు నష్టాలు చవిచూసిన దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం మళ్లీ లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 442.61 పాయింట్ల వృద్ధితో 82,200.34 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు చేపట్టడం ఇందుకు దోహదపడింది. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి.

బ్రిగేడ్ హోటల్ ఐపీఓ ధరల శ్రేణి రూ.85-90: బెంగళూరుకు చెందిన రియల్టీ కంపెనీ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఆతిథ్య సేవల అనుబంధ విభాగమైన బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ లిమిటెడ్ రూ.760 కోట్ల ఐపీఓ ఈ నెల 24న ప్రారంభమై 28న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ధరల శ్రేణిని రూ.85-90గా నిర్ణయించింది.

జేన్ స్ట్రీట్‌పై నిషేధం ఎత్తివేసిన సెబీ

న్యూఢిల్లీ: అమెరికా హెడ్జ్ ఫండ్ సంస్థ జేన్ స్ట్రీట్‌పై విధించిన నిషేధాన్ని సెబీ ఎత్తివేసింది. ఈ నెల 3న తాను ఆదేశించిన విధంగా జేన్ స్ట్రీట్ ఎస్క్రో ఖాతాలో రూ.4,843 కోట్లు జమ చేయడంతో ఈ చర్య తీసుకున్నట్టు సెబీ తెలిపింది. జేన్ స్ట్రీట్ ఇక స్టాక్ మార్కెట్లో నిబంధనల మేరకు అనుమతించిన అన్ని రకాల లావాదేవీల్లో పాల్గొనవచ్చని పేర్కొంది. అయితే ఈ సంస్థ లావాదేవీలపై ఒక కన్నేసి ఉంచాలని సెబీ స్టాక్ ఎక్స్ఛేంజీలను కోరింది. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ఈ సంస్థ అనేక అక్రమాలకు పాల్పడి వేల కోట్లు వెనకేసిందని ఆరోపణలు రావడంతో సెబీ ఈ నెల 3న నిషేధం వేటు వేసింది. నిర్దేశించిన జరిమానాను ఎస్క్రో ఖాతాలో జమ చేయడంతో జేన్‌స్ట్రీట్‌పై నిషేధం తొలగిస్తున్నట్టు ప్రకటించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,150 ▲	91,800 ▲	1,26,000 ▲
విజయవాడ	1,02,000 ▲	96,000 ▼	1,16,800 ▲
విశాఖపట్నం	1,02,290 ▲	91,800 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,00,150 ▲	91,800 ▲	1,16,100 ▲
ప్రొద్దుటూరు	98,500 ▲	90,620 ▲	1,01,470 ▼
ముంబై	98,896 ▲	90,589 ▲	1,13,465 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	112
వరంగల్	109	గుంటూరు	117
కరీంనగర్	109	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	109
కర్నూలు	109	నెల్లూరు	114
విశాఖపట్నం	95	అనంతపురం	114
గోదావరి	112		

స్పోర్ట్స్

సెమీఫైనల్లో భారత్ X చైనా

- ఫైనల్-4కు దివ్య దేశ్‌ముఖ్
- టైబ్రేక్‌లో హారికపై గెలుపు
- మహిళల చెస్ వరల్డ్‌కప్


దివ్య

బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్ కప్‌లో ఇద్దరు భారత ప్లేయర్లు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ సెమీస్ చేరి సరికొత్త చరిత్ర సృష్టించారు. 2003 టోర్నీలో ద్రోణవల్లి హారిక క్వార్టర్స్ చేరడం అత్యుత్తమం కాగా.. ఇప్పుడు హంపి, దివ్య ఆ రికార్డును అధిగమించారు. హంపి ముందుగానే ఫైనల్-4 బెర్త్‌ను సొంతం చేసుకోగా.. సోమవారం జరిగిన టైబ్రేక్‌లో సహచర జీఎం హారికపై గెలిచిన దివ్య సెమీస్‌కు దూసుకెళ్లింది. కాగా, క్వార్టర్ ఫైనల్స్‌లో దివ్య 3-1తో హారికపై నెగ్గింది. వీరిమధ్య తొలి రెండు గేమ్‌లు డ్రా కావడంతో 1-1తో సమంగా నిలిచారు. అయితే, టైబ్రేక్‌లో రెండు గేముల్లోనూ హారికకు దివ్య ఝలక్ ఇచ్చింది. మొత్తంగా ఇద్దరు భారత మాస్టర్లు, ఇద్దరు చైనా ప్లేయర్లు ఫైనల్-4కు చేరుకోవడం విశేషం. మంగళవారం జరిగే సెమీస్‌లో జీఎం లీ టింగ్జీతో హంపి, జీఎం టాన్ జోంగ్‌యితో దివ్య తలపడనున్నారు.

మెరుగైన ప్రదర్శనపైనే సాత్విక్ జోడీ దృష్టి

- బరిలో సింధు, ప్రణయ్, లక్ష్య సేన్
- చైనా ఓపెన్ నేటి నుంచి



చాంగ్‌జౌ: వరల్డ్ చాంపియన్‌షిప్స్ నేపథ్యంలో.. భారత డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకోవాలనుకొంటోంది. మంగళవారం నుంచి జరిగే చైనా ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. పారిస్‌లో వచ్చే నెల 25 నుంచి జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ ముందు ఇదే మేజర్ ఈవెంట్. ఈ సీజన్‌లో సాత్విక్ జోడీ మూడు టోర్నీల్లో సెమీస్‌కు చేరుకొంది. అయితే, సాత్విక్ అనారోగ్యం ఆందోళన కలిగిస్తుండగా.. చిరాగ్ కూడా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. సింగిల్స్‌లో లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, పీవీ సింధు, ఉన్నతి హుడా బరిలో నిలవనున్నారు. డబుల్స్‌లో కవిప్రియ-సిమ్రన్, రుతుపర్ణ-శ్వేతపర్ణ, అమృత-సోనాలి, రుత్విక శివాని-రోహన్ కపూర్ జంటలు ఆడనున్నాయి.

బరిలోకి దిగకుండా.. ఆరుగురు భారత షట్లర్ల అడ్డగింత!

వివాదాస్పదంగా వరల్డ్ యూనివర్సిటీ క్రీడలు

న్యూఢిల్లీ: జర్మనీలో జరుగుతున్న వరల్డ్ యూనివర్సిటీ క్రీడలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన 12 మంది భారత ఆటగాళ్లలో సగం మందికి ఆడేందుకు అనుమతి లభించలేదు. జర్మనీ వెళ్లిన ఆరుగురు షట్లర్లు అధికారుల వైఫల్యం కారణంగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. కాగా, ఈ నెల 16న జరిగిన మేనేజర్ల సమావేశంలో అందరి పేర్లను సరిగ్గా సమర్పించక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు తెలుస్తోంది. అయితే, ఈ తప్పిదానికి కారణమేంటనేది కచ్చితంగా ఎవరూ బయటపెట్టడం లేదు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేపడతామని భారత యూనివర్సిటీల సంఘం (ఏఐయూ) కార్యదర్శి పంకజ్ మిట్టల్ చెప్పాడు. 'సమావేశంలో భారత్ తరఫున బరిలోకి దిగే 12 మంది ఆటగాళ్ల జాబితాను సమర్పించారు. ఆ లిస్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి మిస్ అయిన వారు, గాయపడిన వారి స్థానాలను మరొకరితో భర్తీ చేయాలి. అయితే, నిర్వాహకులు తేలిగ్గా తీసుకొన్నార'ని విశ్వసనీయ వర్గాల సమాచారం. కనీసం సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ కేటగిరీల్లో ఎవరెవరు బరిలోకి దిగుతారో కూడా పేర్కొనలేదట. కానీ, ట్రయల్స్‌లో విజేతలుగా నిలిచిన ప్లేయర్లు మిక్స్‌డ్ డబుల్స్ నుంచి తప్పుకోవడంతో.. అధికారులు ఆరుగురి పేర్లను మాత్రమే లేఖలో పొందుపరిచారనే టాక్ కూడా వినిపిస్తోంది. మరోవైపు సెలెక్షన్ ట్రయల్స్ నుంచి అవకతవకలు జరిగినట్టు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ట్రయల్స్‌కే డుమ్మాకొట్టిన ఆటగాళ్లు కూడా ఈ టోర్నీకి ఎంపికైనట్టు ఆరోపణలు వినవస్తున్నాయి.

బుమ్రా బరిలోకి..

తేల్చిన పేసర్ సిరాజ్



పంత్ కీపింగ్ ప్రాక్టీస్.. అన్షుల్‌కు చాన్స్!

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరిగే కీలకమైన నాలుగో టెస్టుకు భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే సిరీస్‌లో 1-2తో వెనుకబడిన దశలో టీమిండియాకు మాంచెస్టర్ టెస్టు చావోరేవో లాంటిది. ఇందులో గెలిస్తేనే సిరీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. అలాంటి ముఖ్యమైన టెస్టుకు పనిఒత్తిడిలో భాగంగా బుమ్రాకు విశ్రాంతినివ్వడం సరికాదని విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే ఈ సస్పెన్స్‌కు పేసర్ మహ్మద్ సిరాజ్ తెర దించాడు. ఈనెల 23 నుంచి ఇక్కడి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే టెస్టులో బుమ్రా బరిలోకి దిగుతాడని తేల్చాడు. 'నాకు తెలిసినంత వరకు నాలుగో టెస్టులో బుమ్రా ఆడతాడు. గాయాల కారణంగా రోజురోజుకూ మా కాంబినేషన్ మారుతూ వస్తోంది. గాయంతో బాధపడుతున్న ఆకాశ్ దీప్ ఫిజియో పర్యవేక్షణలో ఉన్నాడు. సోమవారం ఉదయం తను బౌలింగ్ కూడా చేశాడు. కానీ అతడి ప్రాతినిధ్యంపై ఫిజియో నుంచి ప్రతిస్పందన రావాల్సి ఉంది. ఇక


సిరాజ్

ఇంగ్లండ్ ఆటతీరును బట్టి మా బౌలింగ్ వ్యూహాలను మార్చుకుంటాం' అని సిరాజ్ తెలిపాడు. ఇక బుమ్రా రాకతో జట్టు బౌలింగ్ విభాగం బలంగా మారనుంది. తాజా సిరీస్‌లో తను తొలి, మూడో టెస్టు ఆడి బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్నాడు. అలాగే చివరి టెస్టుకు అందుబాటులో ఉంచాలని ముందుగా భావించారు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో నాలుగో టెస్టులోనే తనను ఆడించాల్సిన అవసరం ఏర్పడింది.

వెంటాడుతున్న గాయాలు

నాలుగో టెస్టుకు ముందు భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మోకాలి గాయంతో సిరీస్‌కు దూరమైనట్టు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. పునరావాస శిబిరంలో పాల్గొనేందుకు స్వదేశం వెళతాడని పేర్కొంది. జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా అతడి మోకాలి లిగమెంట్ దెబ్బతింది. అలాగే పేసర్ అర్ష్‌దీప్ ఎడమచేతి బొటన వేలి గాయంతో ఈ టెస్టుకు అందుబాటులో లేడు. ఇక మరో పేసర్ ఆకాశ్‌దీప్ వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. అతడి ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. అందుకే ముందు జాగ్రత్తగా హరియాణా యువ పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను ఇంగ్లండ్‌కు రప్పించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో బుమ్రా, సిరాజ్‌కు జతగా మూడో పేసర్ స్థానంలో అన్షుల్‌తో అరంగేట్రం చేయించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

కీపింగ్‌కు పంత్ సిద్ధమా?

మూడో టెస్టులో వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఎడమ చేతి చూపుడు వేలికి గాయమైంది. దీంతో తను బ్యాటింగ్ మాత్రమే చేసి కీపింగ్ బాధ్యతలను ధ్రువ్ జురెల్‌కు అప్పగించాడు. అందుకే నాలుగో టెస్టులో పంత్ ప్రాతినిధ్యంపై కూడా సందేహాలు వ్యక్తమయ్యాయి. ఆదివారం నెట్స్‌లోనూ తను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా.. జురెల్ కీపింగ్ చేస్తూ కనిపించాడు. దీంతో మాంచెస్టర్‌లో పంత్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించి కీపర్‌గా జురెల్‌ను బరిలోకి దించుతారని అంతా భావించారు. కానీ ఈనెల 10 తర్వాత తొలిసారిగా పంత్ సోమవారం నెట్స్‌లో కీపింగ్ గ్లోవ్స్ ధరించడం కనిపించింది. దీంతో కీపర్‌గా పంత్ కొనసాగవచ్చని సమాచారం. అదే జరిగితే జురెల్‌కు స్థానం కష్టమే. కానీ నితీశ్ సిరీస్‌కు దూరమయ్యాడు కాబట్టి.. అతడి స్థానంలో జురెల్‌ను ఆడిస్తారా? లేక మరో ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను బరిలోకి దింపుతారా? అనేది వేచిచూడాల్సిందే.

పేసర్లకే అనుకూలం

మాంచెస్టర్ పిచ్ పచ్చికతో కళకళలాడుతోంది. అలాగే కొన్ని రోజులుగా ఇక్కడ కురుస్తున్న వర్షాల కారణంగా అవుట్‌ఫీల్డ్ మాత్రం తడిగా ఉంది. ఇక వికెట్‌పై గ్రీన్ టాప్ కారణంగా బంతి స్వింగ్‌తో పాటు చక్కటి సీమ్ అయ్యే అవకాశం ఉంది. దీంతో పిచ్ ఫాస్ట్ బౌలర్లకు లాభించనుంది. ఆరంభ సెషన్లలో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారనుంది.

ఏకాంశ్ సింగ్ శతకం

- ఇంగ్లండ్ 309 ఆలౌట్
- భారత్ 51/1
- యూత్ టెస్ట్


ఏకాంశ్ సింగ్ (117)

చెమ్స్‌ఫోర్డ్: ఏకాంశ్ సింగ్ (117) శతకంతో రాణించడంతో.. భారత అండర్-19తో రెండో అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 309 పరుగులకు ఆలౌటైంది. ఆటకు రెండో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 229/7కు ఇంగ్లండ్ మరో 80 పరుగులు జోడించి మిగతా మూడు వికెట్లు చేజార్చుకొంది. నిన్నటి బ్యాటర్ ఏకాంశ్ వంద మార్క్ దాటాడు. నమన్ పుష్పక్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 51/1 స్కోరు చేసింది. కెప్టెన్ ఆయుష్ మహత్రే (24), విహాన్ మల్హోత్రా (6) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (20)ను గ్రీన్ పెవిలియన్ చేర్చాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు భారత్ 258 పరుగుల దూరంలో ఉంది.

తుది జట్టులో డాసన్

నాలుగో టెస్టుకు ఇంగ్లండ్ టీమ్



మాంచెస్టర్: భారత్‌తో ఈనెల 23 నుంచి జరిగే నాలుగో టెస్టు కోసం ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించారు. చేతి వేలి గాయంతో జట్టుకు దూరమైన స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో 35 ఏళ్ల లెఫ్టామ్ స్పిన్నర్ లియామ్ డాసన్‌కు చోటు కల్పించారు. లార్డ్స్ టెస్టులో ఆడిన ఇంగ్లండ్ జట్టులో ఇదొక్కటే మార్పు కావడం గమనార్హం. దీంతో డాసన్ ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు ఆడబోతున్నాడు. కెరీర్‌లో తను మూడు టెస్టులు ఆడగా 2017లో చివరిసారి దక్షిణాఫ్రికాపై బరిలోకి దిగాడు.

తుది జట్టు: స్టోక్స్ (కెప్టెన్), క్రాలే, డకెట్, రూట్, పోప్, బ్రూక్, స్మిత్, వోక్స్, డాసన్, కార్స్ ఆర్చర్.

రద్దయితే పీసీబీకి భారీ నష్టమే..

ఆసియాకప్

కరాచీ: ఈ ఏడాది జరగాల్సిన ఆసియా కప్ టీ20 టోర్నమెంట్ నిర్వహణపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఒకవేళ ఆసియా కప్ రద్దయితే మాత్రం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆదాయానికి భారీ గండి పడినట్టే. ఈ ఆర్థిక సంవత్సరానికి ఐసీసీ నుంచి తమ వాటాగా పీసీబీ రూ.233 కోట్ల ఆదాయాన్ని ఆశిస్తోంది. అలాగే ఆసియా కప్ నుంచి రూ.48 కోట్లు, ఇతర క్రికెట్ టోర్నమెంట్ల ద్వారా రూ.66 కోట్లు ఆర్జించే చాన్సుంది.

ఎవరిదో సిరీస్ ?

నేడు భారత్ X ఇంగ్లండ్ మహిళల మూడో వన్డే

చెస్టర్ లీ స్ట్రీట్: మూడు వన్డేల సిరీస్‌లో 1-1తో సమంగా ఉన్న భారత్-ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య నేడు (మంగళవారం) చివరి వన్డే జరుగనుంది. తొలి వన్డేలో బ్యాటర్లు విశేషంగా రాణించడంతో మ్యాచ్ నెగ్గిన భారత్.. వర్షాభావ రెండో మ్యాచ్‌లో మాత్రం బ్యాట్లెత్తేశారు. కేవలం మంధాన, దీప్తి శర్మ మాత్రమే ఆకట్టుకోగలిగారు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడ్డారు. నేటి కీలక మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, జెమీమా, ఓపెనర్ ప్రతీక, రిచా ఘోష్ తమ స్థాయికి తగ్గట్టు ఆడితే భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. అటు బౌలర్లు కూడా నిరాశపర్చడంతో లార్డ్స్‌లో సిరీస్ పట్టేయాలనుకున్న అమ్మాయిలకు నిరాశే ఎదురైంది. ఇక సిరీస్‌లో కచ్చితంగా గెలవాల్సిన రెండో మ్యాచ్‌లో సివర్ సేన అదరగొట్టింది. అన్ని విభాగాల్లోనూ సంపూర్ణ ఆధిపత్యం చూపింది. ఈ మూడో వన్డేలోనూ ఎలాంటి అలక్ష్యం లేకుండా చెలరేగి సిరీస్‌ను పట్టేయాలని భావిస్తోంది.



అన్యాయాలు, అసమానతల మీద 'అగ్నిధార'ను కురిపించిన కవితా సారథి ఆయన! నిజాం నియంతృత్వంపై అక్షర క్షిపణులు సంధించిన చైతన్య వారధి. అన్నార్తులు, అనాథలు ఉండని సమసమాజాన్ని కాంక్షించిన సామ్యవాది. 'రుద్రవీణ'తో తెలంగాణను తట్టి లేపిన ప్రగతిశీలి. అద్భుతమైన పాటలతో తెలుగు సినీ సాహిత్యంపైనా తనదైన ముద్ర వేసిన గీత రచయిత. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని సగర్వంగా ఎలుగెత్తి చాటిన ఆ కవితా శరధి.. కవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి నేడు.

ఈ సందర్భంగా ఆ మహాకవి జీవిత పుటలోని కొన్ని స్మృతులు..

కవితా శరధి..

కవి దాశరథి



- కలంతో సమాజాన్ని జాగృతం చేసిన ఉద్యమ శీలి
- నిజాం నిరంకుశ పాలనపై కురిసిన కవితా 'అగ్నిధార'
- నియంతృత్వంపై అక్షర క్షిపణులు సంధించిన ధైర్యశాలి

నేడు దాశరథి కృష్ణమాచార్య శత జయంతి

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)

'రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే' ..అంటూ నిజాం రాజుపై అక్షరాల నిప్పులు కురిపించినందుకు జైల్లో పెడితే..

'ఓ నిజాము పిశాచమా! కానరాడు.. నిను బోలిన రాజు మాకెన్నడేని... తీగెలను తెంపి అగ్నిలో దింపినావు.. నా తెలంగాణ కోటి రతనాల వీణ' ..అంటూ జైలు గోడలపై రాసి నిర్భయంగా గానం చేసిన ధీశాలి.. దాశరథి కృష్ణమాచార్య. తెలుగు సాహిత్య వినీలాకాశంలో మేరు నగధీరుడిగా విరాజిల్లిన మేటి కవి. నిజాం వ్యతిరేక పోరాటంలో అక్షరాలను తుటాలుగా మలచి ఊరూవాడా జన జాగృతికి పాటు పడిన ఉద్యమశీలి. వచనం, గేయం తదితర అన్నీ ప్రక్రియల్లో సాహితీ సృజన చేసి, జనుల హృదయాలలో ప్రజాకవిగా నిలిచారు. ఉర్దూ మాతృక గజళ్ల, రుబాయిలను తెలుగు సాహితీలోకానికి పరిచయం చేశారు. గాలిబ్, ఇక్బాల్, నజ్రులిస్లాం సాహిత్యాన్ని తెనుగీకరించి పాఠకుల మన్ననలు అందుకున్నారు. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న జన్మించారు. ఆయన పుట్టి, పెరిగింది.. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ మండలంలోని గూడూరు గ్రామంలో. చిన్నప్పుడు బడిలో.. 'ప్రళయకాలం వరకూ దేవుడు ఈ రాజ్యాన్ని సుస్థిరంగా వుంచుగాక' అంటూ తోటి విద్యార్థులు ప్రార్థన చేస్తుంటే.. వారితో గొంతుకలపనంటూ బెత్తం దెబ్బలకు సైతం వెరవకుండా విద్యార్థి దశలోనే నియంతృత్వాన్ని నిరసించారు దాశరథి. 'కవులు రాజకీయ పార్టీల కక్ష్యల్లో ఇరుక్కోవడమంటే మృత్యువే' అని ఎలుగెత్తిన ఆయన.. నిజాం ప్రభుత్వాన్ని ధిక్కరించి మరీ కవితాగానం చేసి సాహసిగా జననీరాజనాలు అందుకున్నారు. ఓరుగల్లు కోట వేదికగా 1944లో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవాలపై రజాకార్ల గుంపు దాడి చేసి పందిళ్లకు నిప్పు పెడితే.. కాలిన బూడిద కాళ్ల కింద సెగలు కక్కుతున్నా ఆగక.. 'ఓ పరాధీన మానవా! ఓపరాని దాస్యము విదల్చలేని శాంతమ్ము మాని.. తలుపులను ముష్టిబంధాన కలచివైచి.. చొచ్చుకొని పొమ్ము, స్వాతంత్ర్య సురపురమ్ము...' అంటూ దాశరథి కవితాలాపన చేసి, భయం ఆవరించిన సభలో ధైర్య సాహసాలను నింపారు.

తొలి అరెస్టు...

వరంగల్ జిల్లా మానుకోట దగ్గర జయ్యవరం గ్రామంలో ఆంధ్రమహాసభ కార్యకర్తలతో కలసి నిజాం పాలనకు వ్యతిరేకంగా దాశరథి సభ నిర్వహించిన అనంతరం తన సొంతూరు గూడూరు వెళ్తే.. ఆ విషయాన్ని తెలుసుకున్న స్థానిక జమీందారు ఆయన్ను పోలీసులకు పట్టించారు. అప్పుడు పోలీసులు ఆయన. చేతికి బేడీలు, నడుముకు తాడు కట్టిమరీ పదిమైళ్ల దూరంలోని నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌కు నడిపించుకు తీసుకెళ్లారు. ఆరోజు ఆయన అక్కణ్నుంచీ తప్పించుకున్నారు. లేకపోతే, వాళ్లు తనను కాల్చి చంపేవారని స్వీయకథలో రాసుకున్నారు. నిజాం రాచరికాన్ని ధిక్కరించినందుకు వరంగల్, నిజామాబాద్, చంచలగూడ జైళ్లలో దాశరథి మొత్తం 16నెలలు శిక్ష అనుభవించారు. ఆ సమయంలో నిజాం పోలీసులు, రజాకార్ల దాడులుసైతం ఎదుర్కొన్నారు. 'దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు..' అంటూ నేరుగా అక్షర అస్త్రాలను నిజాంకు ఎక్కుపెట్టిమరీ కవిత్వం రాశారు. అందుకు ప్రతిగా గూండాల చేతిలో చావుదెబ్బలు తిన్నాడు. అయినా, భయపడకుండా రాజ్యానికి ఎదురెళ్లి మరీ "మా నిజాము రాజు తరతరాల బూజు" అంటూ గళమెత్తి ప్రజాస్వామ్య కాంక్షకై నినదించాడు. ఆ క్రమంలో ఆయన ఎదుర్కొన్న హింస అలాంటిది ఇలాంటిదికాదు. కావాలని అధికారులు ఖైదీలకు సున్నం, సిమెంటు కలిపిన రొట్టెలె పెట్టేవారట. అది ఆయన ఆరోగ్యంమీద తర్వాత కాలంలో తీవ్ర ప్రభావం చూపిందని స్వీయచరిత్రలో ప్రస్తావించారు. 1949లో ముద్రితమైన ఆయన 'అగ్నిధార' ఖండ కావ్యంలోని.. 'ఆ చల్లని సముద్రగర్భం.. దాచిన బడబానలమెంతో' అనే గీతం ఇప్పటికీ అనేక వేదికలపై వినిపిస్తోందంటే ఆయన కలం పదును అర్థం చేసుకోవచ్చు.

అక్కినేనితో ఆత్మీయానుబంధం..

సినీ పరిశ్రమలో దాశరథికి అత్యంత ఆత్మీయుడు అక్కినేని నాగేశ్వరరావు. తన గాలిబ్ గీతాలను కూడా అక్కినేనికే అంకితమిచ్చారు. అన్నపూర్ణ పిక్చర్స్ నిర్మించిన ప్రతి సినిమాలో దాదాపుగా దాశరథి పాట ఉండేది అంటే అతిశయోక్తి కాదు. నిజానికి దాశరథి సినీరంగ ప్రవేశం చేసింది 'వాగ్దానం' చిత్రంతో. దాశరథి ప్రతిభ గురించి తెలిసిన ఆత్రేయ ఆయనకు ఆ సినిమాలో అవకాశం ఇవ్వడంతో 'నా కంటి పాపలో నిలిచిపోరా... నీవెంట లోకాల గెలవనీరా..' పాట రాశారు. తర్వాత అక్కినేని 'ఇద్దరు మిత్రులు' సినిమాకు 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ చలాకి మాటలు రువ్వుతూ...' రాశారు. అయితే, మొదట ఇద్దరు మిత్రులు సినిమా విడుదల అవడంతో, అదే దాశరథికి తొలిసినిమాగా చరిత్రలో నిలిచింది. సినిమా అవకాశాలు పెరగడంతో హైదరాబాద్ నుంచి 1964లో చెన్నైకి వెళ్లారు. 'ఏ దివిలో విరిసిన పారిజాతమో', 'గోదారి గట్టుంది.. గట్టు మీద చెట్టుంది', 'ఓ చెలీ కోపమా..', 'నీవు రావు నిదుర రాదు..', 'నడిరేయి ఏ జాములో.. స్వామి నినుచేర దిగివచ్చునో', 'రారా కృష్ణయ్యా.. రారా కృష్ణయ్యా', 'నను పాలింపగ నడచీ వచ్చితివా..', 'మనసే కోవెలగా మమతలు మల్లెలుగా', 'ఈ వేళ నాలో ఎందుకో ఆశలు', ..ఇలా ఎన్నో గుర్తుండిపోయే పాటలు రాశారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఆయనను ఆస్థాన కవిగా నియమించడంతో చేతినిండా సినిమా అవకాశాలున్నా, వాటన్నింటిని వదిలి 1979లో తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. తర్వాత నాలుగేళ్లకు ఎన్టీఆర్ ఆస్థాన పదవులను రద్దుచేయడంతో అటు సినిమాలకు దూరమై, ఇటు పదవి పోవడంతో చివరి రోజుల్లో దాశరథి ఆర్థిక సమస్యలతో సతమతమయ్యారని కుమార్తె ఇందిర చెప్పారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో..

బాలసాహిత్య ప్రియుడు...

అభ్యుదయ గీతాలు, విప్లవోద్యమ గేయాలు రాసిన దాశరథి బాలల కోసం ఎన్నో రచనలు చేశారు. పున్నమి వెన్నెలవంటి స్వచ్ఛమైన హృదయంగల బాలలంటే తనకు ఎంతో ఇష్టమని దాశరథి స్వీయ చరిత్రలో రాసుకున్నారు. పిల్లల కోసం గేయాలు, నాటికలు రాశారు. అందులో 'పిల్లల్లారా! పాపల్లారా' పాట నేటికి ప్రజాదరణ పొందుతోంది. పిల్లలకు అర్థమయ్యే రీతిలో రామాయణ, భారత, భాగవతం సంక్షిప్తంగా అందించారు.

గాలిబ్ గీతాలకు బాపు బొమ్మలు

"గజల్ కేవలం ఒక గీతం కాదు, ధ్వనులతో అంతర్ధ్వనులతో పొరలు పొరలుగా అల్లుకుపోయిన కమనీయ కవిత" అంటూ అభివర్ణిస్తారు దాశరథి. బాల్యంలోనే గాలిబ్‌పై అధ్యయనం ప్రారంభించిన ఆయన గజళ్లను అనువదించారు. 'దుర్లభుడనుకున్న గాలిబ్‌ను సులభుణ్ణి చేశావు' అని మగ్దూం మొహియుద్దీన్ లాంటి వారుసైతం కితాబు ఇచ్చారు. ఆరుద్ర, అక్కినేని, కొంగర జగ్గయ్య లాంటి వారంతా అనువాదాలను విని వెంటనే పుస్తకంగా తీసుకురావాలని సూచించారు. గాలిబ్ గజళ్లకు జూగ్తాయ్ అనే సుప్రసిద్ధ చిత్రకారుడు బొమ్మలు గీశాడు. మరి తెలుగు అనువాదంలో ఎవరితో చిత్రాలు వేయించాలా అనుకుంటున్న సమయంలో ఓ మిత్రుడి సలహా మేరకు దాశరథి బాపును కలసి అనువాద కవితలు అందించారు. ఆ పుస్తకం 1961, ఏప్రిల్22న 'గాలిబ్ గీతాలు' పేరుతో విడుదలైంది. "బాపు చిత్రాలు జూగ్తాయ్ బొమ్మల్ని మరిపించాయని ఉర్దూ కవులే కొనియాడారు. ముంబై ఉర్దూ కవులు అయితే బాపు బొమ్మల్ని చూసి, గాలిబ్ మూలం చదివేవారు" అని దాశరథి యాత్రాస్మృతిలో ప్రస్తావించారు.

కోపమెరుగని మా నాన్న..



"మహాకవిగా ప్రజల అభిమానాన్ని పొందిన దాశరథి కుమార్తెగా పుట్టడం నా అదృష్టం. నన్ను ప్రేమగా 'బుజ్జి' అని పిలిచేవారాయన. నాన్న కవిత్వాన్ని చదివినవారంతా ఆయనకూడా అలానే గంభీరంగా ఉంటారనుకుంటారు. నిజానికి దాశరథిగారికి కోపమంటే తెలియదు. నేను ప్రేమ పెళ్లి చేసుకుంటానంటే.. ఒక్కమాట కూడా అనకుండా, అబ్బాయి కుటుంబ నేపథ్యం వివరాలు విచారించి, మా పెళ్లికి అంగీకరించారు. గత ప్రభుత్వం మొదలుపెట్టిన దాశరథి జయంతి ఉత్సవాల నిర్వహణను ఈ ప్రభుత్వం కొనసాగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో దాశరథి విగ్రహాన్ని ట్యాంకబండ్ మీదకానీ లేదా నగరంలోని ఏదైనా ప్రధాన కూడలిలో నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. అది ఇంతవరకూ నెరవేరలేదు. మహబూబాబాద్ జిల్లాకు దాశరథి పేరు పెడతామని ఈ ప్రభుత్వం ఓ సభలో హామి ఇచ్చింది. దాశరథి శతజయంత్యుత్సవాల సందర్భంగానైనా ఆ హామీలను నెరవేర్చాలని కోరుతున్నాను.

- వంగిపురపు ఇందిర, దాశరథి కుమార్తె

దాశరథీ కవితాపయోనిధీ!!!

అతను బుడుగైనా ఆర్తి పొడుగు. మూర్తి చిన్నదైనా కీర్తి దొడ్డది. అతను నాటు తెలుగు గూటిలో గుట్టుగా దాగి ఒక్కపెట్టున గుక్కపట్టి గొంతువిప్పిన కవితల గిజిగాడు. నిజాం నియంతృత్వంపై తిరగబడి నల్గొండ రాజకీయ మహాసభ వేదికపై విప్లవాగ్ని ధారలు కురిపించిన బాలకవి వీరుడు. 'మా నిజాం రాజు జన్మజన్మాల బూజు' అని కన్ను తెరిచి తెలంగాణ కన్ను తెరిచేలా ఎలుగెత్తి చాటిన మగవాడు. రాక్షసత్వపు రజాకారులకు మానవత్వపు ప్రజాకారుడై తిరగబడ్డ తెలుగుబిడ్డ. కవిగా పుట్టి కవిగా ఎదిగి కవిగా కన్నుమూసిన ఈ తెలుగు జాతి వైతాళికుడు మరెవరో కాదు. మరపురాని మధురమూర్తి శ్రీ దాశరథి కృష్ణమాచార్య!

అమాయకుడు, అమల హృదయుడు, ఆవేశపరుడు అన్న మాటలు దాశరథికి పర్యాయపదాలు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్న తెలుగుతనం ఆయనది. ఏ కవితానదికైనా సినీ సాహితీ సాగర సంగమం తప్పని పరిస్థితి ఏర్పడిన తరువాత దాశరథి 'వాగ్దానం' చిత్రంలో ఆచార్య ఆత్రేయ ఆహ్వానం మీద రంగప్రవేశం చేశాడు. 'నా కంటిపాపలో నిలిచిపోరా నీ వెంట లోకాలు గెలవనీరా' అంటూ తన సినీ కవితా ప్రస్థానం మొదలుపెట్టాడు. అందులో 'ఈనాటి పున్నమి ఏనాటి పున్నెమో' వంటి ముద్దొచ్చే ప్రయోగాలు చేశాడు. సినీ గీతాల స్థాయిని, హాయిని పెంచే మధుర కవితలు వెలయించినవాడు దాశరథి. అతనికి అక్షరస్మారక చిహ్నంగా నిలిచిపోయే పాట.. 'ఏ దివిలో విరిసిన పారిజాతమో.. ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో'.. సత్యం స్వరకల్పనలో రసభావకల్పకమై నిలిచిపోయింది. 'వలపే వసంతములా పులకించి పూసినది' అన్న లలిత భావుకుడు. 'నడిరేయి ఏ జాములో' అనే పాటతో ఏడుకొండలవాడిని మనసారా స్మరించుకున్న ధన్యుడు.

నేను పాత్రికేయుడిగా 'అసెంబ్లీ' సమావేశాల కవరేజ్‌కి హైదరాబాద్ వచ్చినప్పుడు.. 'ఆంధ్రప్రభ'లో 'అదిగో ద్వారక ఆల మందల విగో' అని ఒక ఐటమ్ రాశాను. అప్పుడు శాసనసభ్యుల వసతి గృహాలు ఉండేవి కావు. చాలా మంది 'ద్వారకా హోటల్'లో బస చేసేవారు. వారు ఉదయం అసెంబ్లీకి వెళ్లడానికి తెల్లని ఖాదీ దుస్తులు ధరించి బస్సు కోసం బారులు తీరి, టిఫినానంతరం బీడీ సేవనంతో పచార్లు చేస్తున్న దృశ్యాన్ని చమత్కారంగా అలా రాశాను. అప్పుడు శాసనసభాపతి బి.వి.సుబ్బారెడ్డిగారు. ఆయన మంచి సాహితీవేత్త, సహృదయులు. నేను రాసినది చూసి ఆయన నన్ను చాంబర్‌లోకి పిలిచి.. 'అలా రాశారేమిటి.. ఇది సభాహక్కుల వ్యవహారం దాకా వస్తే ఇబ్బందిపడతారు' అని మందలించారు. దైవవశాత్తూ అలా జరగలేదు. కానీ అది చూసి దాశరథి కడుపుబ్బ నవ్వి.. 'కవి సమయం ఇదే కదా- కవి హృదయం తెలుసుకోవాలి కదా' అంటే.. 'అయ్యా! రాజా కాలస్య కారణం అన్నారండీ పెద్దలు.. ఏలినవారు తల్చుకుంటే ఏముంది చెప్పండి' అన్నాను. 'అది తప్పు.. 'కవిః కాలస్యకారణం' అని ఆ సూక్తిని మార్చాలి' అన్నాడు దాశరథి. అంతటి కవితావీరుడు ఆయన. అన్నపూర్ణావారి చిత్రాలలో 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' వగైరా పాటలు, 'అమరశిల్పి జక్కన' వంటి చిత్రాలలో ఆయన రాసిన పాటలు రాశిలో తక్కువైనా వాసిలో ఎక్కువే. ప్రజాభిమానం చూరగొని ప్రజల నోళ్లలో బతికేదే సినిమా పాట అయితే అటువంటి పాటలు అనేకం దాశరథి రాశాడు.

'కవితాశరధికి నవయువ
కవిదాశరథికి నిత్యకల్యాణమగున్
రవికుల దాశరథికి వలె మా
కవికుల దాశరథి పరిధి కడలు కొను నిలన్'

..అని ఆయన జన్మదినానికి నేను ప్రేమ, గౌరవాలతో ఓ పద్యం రాశాను. ఆయనతో గడిపిన క్షణాలు సరస్వతీ వీక్షణాలు- నిత్య జీవితంలో విలక్షణాలు. ఈ సులక్షణ కవితాశరధికి దాశరథికి ఇవే నా తేనెకన్నీరాజనాలు.

- వేటూరి సుందరరామమూర్తి



('కొమ్మకొమ్మకో సన్నాయి'లో దాశరథి కృష్ణామాచార్య గురించి వేటూరి రాసిన వ్యాసంలో ముఖ్యాంశాలు)

కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి కృష్ణమాచార్య అవార్డు



నేడు రవీంద్రభారతిలో సీఎం చేతుల మీదుగా అందజేత.. దాశరథికి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు

హుస్నాబాద్, హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం ఈ ఏడాది.. ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్‌ను వరించింది. ఈమేరకు.. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాశరథి శతజయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని, రూ.1,01,116 నగదును అందుకోనున్నారు. మెదక్ జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయులు అన్నవరం దశరథం, కేదారమ్మల సంతానమైన దేవేందర్.. తెలంగాణ భాష, యాసను శ్వాసగా మలచుకొని రచనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కరీంనగర్‌లో ఉంటున్నారు. గ్రామీణ జీవనం, పల్లె భాష, శ్రమైక జీవన సౌందర్యం, అట్టడుగు వర్గాలు, తెలంగాణ ప్రాంత ఉద్యమ ఉనికి వంటివి ఆయన కవితా వస్తువులు. 1985 నుంచి కొంతకాలం హుస్నాబాద్‌లో ఆంధ్రజ్యోతి పాత్రికేయునిగా పని చేసిన దేవేందర్ 'తొవ్వ' కవితతో రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. తెలంగాణ రచయితల వేదిక వ్యవస్థాపక ఉపాధ్యక్షులుగా దశాబ్దానికి పైగా పని చేశారు. అన్నవరం సతీమణి రాజేశ్వరి కూడా కథా రచయిత్రి. కాగా.. మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనపై ధిక్కార స్వరం వినిపించి ప్రజల్లో చైతన్యం నింపిన దాశరథి తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచారని ప్రశంసించారు. "తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి, పద్యాన్ని పదునైన ఆయుధంగా మార్చి ఉద్యమించిన దాశరథి చిరస్మరణీయుడు." అని కొనియాడారు.

వసతి గృహాల్లో సేంద్రియ పద్ధతిలో

కూరగాయల సాగు

హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఏర్పాట్లు

- విద్యార్థులకు తాజా కూరగాయలతో భోజనం అందించేందుకే
- మిద్దెతోట సాగు, కిచెన్ గార్డెన్‌పై సంకల్ప్ ఫౌండేషన్ శిక్షణ
- పైలట్ ప్రాజెక్టుగా షేక్‌పేట్, ములుగనూర్ పాఠశాలల ఎంపిక
- త్వరలో జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో అమలుకు చర్యలు



హైదరాబాద్ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్కడ చదువుకునే విద్యార్థులకు కలుషిత, రసాయన అవశేషాలతో కూడిన కూరగాయలకు బదులు.. తాజా కూరగాయలతో చక్కని భోజనాన్ని అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అక్కడి ప్రాంగణాల్లో పండించడమో, మిద్దెసాగు విధానంలో పండించడమో చేయనున్నారు. ఇందుకు.. ప్రయోగాత్మకంగా జిల్లా పరిధిలోని షేక్‌పేట్ బాలుర సాంఘిక సంక్షేమశాఖ ఉన్నత పాఠశాల, హయత్‌నగర్ పరిధిలోని ములుగనూర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఎంపిక చేశారు. అనంతరం జిల్లాలోని ఇతర వసతి గృహాల్లో కార్యక్రమాన్ని చేపడతారు. ఈ విధానంతో రసాయనరహిత కూరగాయలను అందించడంతోపాటు సిబ్బందికి, విద్యార్థులకు సేంద్రియ పంటలపై అవగాహన కల్పించినట్లవుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్‌కు శివారు ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న కూరగాయల్లో రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయన్న అభిప్రాయాలున్నాయి. ప్రధానంగా సంక్షేమ హాస్టళ్ల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కాంట్రాక్టర్లలో కొందరు నాసిరకం కూరగాయలు తీసుకొచ్చి వంటలను తయారు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇది విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మిద్దెతోట కార్యక్రమంలో భాగంగా టెర్రస్ గార్డెన్, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ అధికారులు ముందుకుసాగుతున్నారు.



టమాటాలు, కొత్తమీర, పుదీనా..

సేంద్రియ సాగు విధానంపై రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌లో సేంద్రియ సాగు విధానంపై అవగాహన కల్పించనున్నారు. అయితే కూరగాయల సాగుకు ప్రత్యేకంగా సిబ్బంది అవసరం లేదని, ఆయా చోట్ల పనిచేసే వంట మనుషులు, క్లీనింగ్ స్టాఫ్‌తో చేయించవచ్చునని అధికారులు చెబుతున్నారు. తొలుత టమాటాలు, కొత్తిమీర, పుదీనా, పాలకూర, తోటకూర, గోంగూర, పచ్చిమిర్చి లాంటి విత్తనాలను వేసి పండించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్స్, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడంలో భాగంగా వంట మనుషులకు కూడా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో శిక్షణనిప్పిస్తున్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనాలు తయారు చేయడంపై, వంట గదులు, వంటపాత్రల శుభ్రతపై ఇటీవల అవగాహన కల్పించారు.

మిథున్‌రెడ్డి @ 4196

రిమాండ్ ఖైదీ నంబర్ కేటాయింపు

రాజమహేంద్రవరం/విజయవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి (ఏ4)కి రిమాండ్ ఖైదీ నంబరు 4196 ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి కేంద్ర కారాగారంలో గతంలో ఏపీ సీఎం చంద్రబాబు ఉన్న స్నేహ బ్యారక్‌లో ఆయన్ను ఉంచారు. ఆదివారం విజయవాడలోని ఏసీబీ కోర్టు ఆగస్టు 1వ తేదీ వరకూ మిథున్ రెడ్డికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఆయన్ను అదే రోజు రాత్రి పోలీసులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు. రాత్రి 8.50 గంటలకు అడ్మిషన్ తీసుకున్నామని సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. జైలు మెడికల్ అధికారితో ఆయనకు ఆరోగ్య పరీక్షలు చేయించగా ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థాయిలో ఉందని తెలిపారు. ఆయనకు ప్రత్యేక సదుపాయాలు ఏమీ ఉండవని, భద్రత విషయంలో మాత్రం అవసరమైన చర్యలన్నీ తీసుకున్నామని వివరించారు. కాగా సోమవారం ఉదయం మిథున్ రెడ్డి చిన్నాన్న, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి తన అనుయాయులతో సుమారు 10 కార్లలో జైలు వద్దకు చేరుకున్నారు. జైలు ఎదురుగా ఉన్న సెంట్రల్ ప్రిజన్ కేఫ్‌లో సాయంత్రం వరకూ వేచి ఉండి వెళ్లిపోయారు.

ఈ సదుపాయాలు ఇవ్వండి

ఆదివారం మిథున్ రెడ్డికి రిమాండ్ విధించిన సమయంలో జైలులో కల్పించాల్సిన సదుపాయాలకు సంబంధించి ఒక చిట్టాతో ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఎంపీగా ఉండడం, వై కేటగిరి భద్రత ఉండడంతో జైలులో కొన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. మంచం, కుర్చీ, టేబుల్, టీవీ, సహాయకుడు(అటెండర్), ప్యూరిఫైడ్ వాటర్ బాటిల్స్, ముక్కులో వేసుకునే చుక్కల మందు, యోగాసనాలు వేసుకోవడానికి మ్యాట్, మల్టీవిటమిన్ మందులు, వేపనూనె మందులు, ప్రొటీన్ పౌడర్, దిండు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఇవికాకుండా రెండు పూటలా ఇంటి నుంచి భోజనం, ఉదయం అల్పాహారం అనుమతించాలని విజ్ఞప్తి చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున వాటిని వీక్షించడానికి టీవీ ఏర్పాటు చేయాలని మిథున్‌రెడ్డి ఏసీబీ కోర్టులో సోమవారం మరో పిటిషన్ దాఖలు చేశారు. మిథున్ రెడ్డికి జైలు అధికారులు మంచం ఇవ్వలేదని, నేలపైనే పడుకోబెట్టారని వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఏసీబీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్‌తో మాట్లాడాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను న్యాయాధికారి పి.భాస్కర రావు ఆదేశించారు.

సెట్టేసి.. కొట్టేస్తున్నారు..!

- భక్తి పేరుతో విశాఖలో భారీ దోపిడీకి స్కెచ్
- బీచ్‌లో అయోధ్య నమూనా ఆలయం
- దర్శనం టికెట్ 50, చెప్పులకు 5 వసూలు
- కల్యాణోత్సవం పేరుతో మరో దోపిడీకి తెర
- ఒక్కో టికెట్ 2,999కు విక్రయం
- భద్రాద్రి నుంచి పండితులంటూ ప్రచారం
- దీనిపై భద్రాచలం దేవస్థానం ఈఓ విచారణ
- నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు



విశాఖపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): భక్తి ముసుగులో పక్కా వ్యాపారానికి తెరతీశారు. అయోధ్య రామాలయాన్నే దానికోసం ఎంచుకున్నారు. ఆ రామాలయం సెట్ వేసి భారీగా డబ్బులు కొట్టేస్తున్నారు. అయోధ్యకు వెళ్లి రాముడిని ఎప్పుడు చూస్తామో, ఇక్కడ దర్శనం చేసుకుంటే పుణ్యం వస్తుంది కదా! అనుకునే భక్తులే టార్గెట్‌గా విశాఖపట్నంలో పెద్దఎత్తున దోపిడీ చేస్తోంది ఓ బృందం. బీచ్ రోడ్డులో పార్క్ హోటల్ పక్కనే ఖాళీ స్థలంలో మే నెలాఖరులో అయోధ్య రామాలయం సెట్ వేశారు. రెండు నెలలే ఉంటుందని ప్రకటించారు. దీంతో భక్తులు భారీగా వస్తున్నారు. నమూనా ఆలయంలోకి వెళ్లాలంటే రూ. 50 టికెట్ తీసుకోవాల్సిందే. చెప్పులు పెట్టుకోవడానికి ఇంకో రూ.5 చెల్లించాలి. లోపలికి వెళ్లాక రాముడిని కళ్లారా చూసి నమస్కారం చేసుకునేలోపే అక్కడ ఉండే సిబ్బంది బయటకు లాగేస్తున్నారు. శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. కార్లు, ద్విచక్ర వాహనాలను బీచ్ రోడ్డులో పార్కు చేస్తున్నారు. వందలాది వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలన్నీ నిండిపోయి సాధారణ ప్రజలు నడిచి వెళ్లడానికి కూడా రోడ్డుపై ఖాళీ ఉండడం లేదు. అయితే బీజేపీ పేరు చెప్పి నిర్వాహకులు పోలీస్ అధికారులను అటువైపు రానీయడం లేదని తెలుస్తోంది. ఆ పార్టీ యూత్ కమిటీలో రాష్ట్ర స్థాయి నేత దందాలో కీలకంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

కల్యాణోత్సవం అంటూ ప్రచారం

నిజానికి ఈ నెలాఖరుతో నమూనా ఆలయ ప్రదర్శన ముగించాలి. దీంతో మరో దోపిడీకి నిర్వాహకులు తెరలేపారు. ఈనెల 29న అయోధ్య రాముడికి కల్యాణోత్సవం నిర్వహిస్తామని, దానికి రూ. 2,999 టికెట్ తీసుకోవాలని ప్రచారం చేస్తున్నారు. ఫ్లెక్సీలు పెట్టి టికెట్లు కూడా విక్రయిస్తున్నారు. భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం పండితులు వచ్చి కల్యాణం క్రతువు నిర్వహిస్తారని కూడా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ ప్రచారంపై భద్రాచలం ఆలయ అధికారులకు తెలిసి విచారణ నిర్వహించారు. అక్కడి నుంచి పండితులెవరూ విశాఖపట్నం రావడం లేదని తేలింది. కల్యాణోత్సవంపై కనీస సమాచారం కూడా ఇవ్వకుండా దేవాలయం పేరును దుర్వినియోగం చేస్తున్నట్టు గుర్తించిన ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్.రమాదేవి.. విశాఖపట్నం కలెక్టర్‌కు, పోలీస్ కమిషనర్‌కు, 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు, దేవదాయ శాఖ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు సోమవారం నమూనా ఆలయం వద్దకు వెళ్లి ప్రాథమిక విచారణ చేశారు. అయితే తమ వెనుక బీజేపీ ఎంపీ ఒకరు ఉన్నారని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారని, కేసు నమోదుకు పోలీసులు తటపటాయిస్తున్నారని తెలిసింది. ఇక్కడ ప్రదర్శన ఏర్పాటులో తప్పులేదని, కానీ దానిని వ్యాపారాత్మకంగా నిర్వహించడం, భద్రాచలం పేరును ఉపయోగించడం వారి దుర్బుద్ధిని వెల్లడిస్తోందని భక్తులు ఆరోపిస్తున్నారు.



ఆలయం సెట్

25 నుంచి రేషన్‌కార్డులు



ఖమ్మం జిల్లా చింతకాని మండలం గాంధీనగర్‌లో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

దశాబ్ది తర్వాత రేషన్ కార్డుల పంపిణీ

» పదేళ్లు రేషన్ కార్డుల ఊసే ఎత్తని బీఆర్ఎస్

» రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు: భట్టి

బోనకల్/ చింతకాని, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు ప్రజలకు రేషన్ కార్డుల పంపిణీని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కానీ, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నదని చెప్పారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా బోనకల్, చింతకాని మండలాల్లో పర్యటించారు. బోనకల్ మండల కేంద్రంలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ నిరంతరం సాగిందని, తిరిగి తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొద్దికాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 93 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. గృహలక్ష్మీ పథకం కింద 51 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద దళిత బంధు రెండోవిడతలో రూ.4.63 కోట్లతో 214 మంది లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను మల్లు భట్టి విక్రమార్క పంపిణీ చేశారు. మిగతా లబ్ధిదారులకూ త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. దళిత బంధు యూనిట్ల క్రయ విక్రయాలు నేరమని, వాటితో కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని హితవు చెప్పారు. అంతకు ముందు మండలంలోని గాంధీనగర్‌లో ఒక లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. జోరువానలోనూ ఆయన చింతకాని, గాంధీనగర్‌ల్లో పర్యటించడం విశేషం.



భూపాలపల్లి జిల్లా చెల్పూరులో బస్టాండు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

తల తాకట్టు పెట్టైనా ఇందిరమ్మ ఇళ్లకు నిధులిస్తాం

» కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం:పొంగులేటి

భూపాలపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలున్నా లెక్క చేయబోమని, తలతాకట్టు పెట్టైనా నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలోని కొత్తపల్లిగోరి, గణపురం, భూపాలపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో పొంగులేటి మాట్లాడుతూ భూపాలపల్లికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కోరిక మేరకు మరో 700 ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. వైఎస్ స్ఫూర్తితో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం 8.19లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందని దుయ్యబట్టారు. తమది పేదల ప్రభుత్వమని, ఎన్ని అప్పులున్నా.. సంక్షేమ పథకాలను ఆగనివ్వబోమని పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాలో కొత్తగా 5వేల రేషన్ కార్డులను జారీ చేశామని, ఇప్పటికే ఉన్న కార్డుల్లో 15 వేల మంది కొత్త సభ్యులను చేర్చామని గుర్తు చేశారు.

డయాలసిస్ రోగులకు ప్రభుత్వం చేయూత

» కొత్తగా 681 మందికి పెన్షన్లు మంజూరు

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 681 మంది డయాలసిస్ రోగులకు పెన్షన్ల మంజూరుకు మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. వీరిలో 629 మంది రోగులు హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా.. మిగిలిన 52 మంది రోగులు ఇతర జిల్లాల్లో చికిత్స పొందుతున్నారు. వచ్చే ఆగస్టు నుంచి పెన్షన్ డబ్బులు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. తాజా నిర్ణయంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న డయాలసిస్ రోగుల సంఖ్య 4,029కి చేరింది. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా వివిధ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న డయాలసిస్ రోగులను ప్రభుత్వం గుర్తిస్తోంది. సెర్ప్ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి పెన్షన్లను మంజూరు చేస్తోంది.

నేడు టెట్ ఫలితాలు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఈ ఏడాదిలో జూన్ 18 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించారు. వీటి ఫలితాలను పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

గూడ పవన్‌కు జాతీయ యంగ్ వీవర్ అవార్డు

» మార్కెటింగ్‌లో నరేంద్ర హ్యాండ్లూమ్స్‌కు దక్కిన గౌరవం

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు చెందిన గూడ పవన్‌కు జాతీయ యంగ్ వీవర్ అవార్డు లభించింది. సహజ రంగులతో డబుల్ ఇక్కత్ సిల్కు చీర తయారీకిగాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. మార్కెటింగ్ విభాగంలో నరేంద్ర హ్యాండ్లూమ్స్‌కు అవార్డు వచ్చింది. ఈమేరకు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సోమవారం అవార్డులను ప్రకటించింది. ఆగస్టు 7న 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. 5 సంత్ కబీర్ అవార్డులు, 19 జాతీయ చేనేత అవార్డులతో మొత్తం 24 మందిని చేనేత రంగంలో చేసిన అత్యుత్తమ కృషికి గాను సత్కరించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లక్కా శ్రీనివాసులుకు సంత్ కబీర్ అవార్డు, కర్నాటి మురళికి చేనేత అవార్డు, జుజారే నాగరాజుకు జాతీయ హ్యాండ్లూమ్ అవార్డులు దక్కాయి.

రామయ్య భూముల్లో ప్రహరీ నిర్మాణం చేపడతాం

» పోలీసుల సహకారం కోరుతూ భద్రాద్రి దేవస్థానం లేఖ!

భద్రాచలం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాచల రామయ్యకు చెందిన భూములకు రక్షణగా భద్రాద్రి దేవస్థానం శ్రీగోకులరామం చుట్టూ నిర్మించతలపెట్టిన ప్రహరీ నిర్మాణానికి మరోసారి దేవస్థానం అధికారులు కసరత్తు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రహరీ నిర్మాణానికి ఉన్నతాధికారుల నుంచి ఆమోద ముద్ర రాగా పనులు చేపట్టే క్రమంలో స్థానికులు అడ్డుకున్నారు. దాంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. సుమారు రూ.70లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టనుండగా దానికి సహకరించాలని కోరుతూ 2 రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులకు భద్రాద్రి దేవస్థానం అధికారులు లేఖ రాశారని తెలిసింది. ఇటీవల రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఈవో రమాదేవిపై, ఇతర సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేయడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో భద్రాద్రి దేవస్థానం అధికారులు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీకి, ఏపీలోని పోలీసు ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు సమాచారం.

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు తెలియజేసేలా ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎరువుల అంశంపై రైతులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబరుతో బోర్డులను బస్‌స్టాప్‌లు, జనం తిరిగే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. వానాకాలం సన్నద్ధత, వ్యవసాయం, నీటి పారుదల, సీజనల్ వ్యాధులు, విపత్తు నిర్వహణ, రేషన్‌కార్డుల పంపిణీ అంశాలపై సోమవారం సాయంత్రం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల కలెక్టర్లు ఉదయం 7 గంటలకే ఫీల్డ్‌కు వెళ్లాలన్నారు. ఏ రోజు ఏ కలెక్టర్ ఏం చేస్తున్నారనే విషయాలను తనకు తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. వానాకాలంలో వరదలు, అంటువ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంతో వచ్చే నీటిని ఒడిసిపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అవసరమైతే ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని, రాష్ట్ర స్థాయి అధికారులతో, వాతావరణ శాఖ అధికారులతో చర్చించాలని, కనీసం 3గంటల ముందుగా ప్రజలకు వాతావరణం, వర్షం వివరాలను తెలియజేయాలన్నారు. తద్వారా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసే అవకాశం ఉంటుందన్నారు.

నిరంతర ప్రక్రియగా రేషన్‌కార్డులు..

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్ అన్నారు. 7లక్షల మందికి కొత్త కార్డులు ఇచ్చామని, ప్రస్తుతం రాష్ట్రంలో 96,95,299 కార్డులున్నాయని, దాదాపు 3.12 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. సన్న బియ్యం పంపిణీతో రేషన్‌కార్డుకు విలువ పెరిగిందన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాల్లో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు.. ఆయా జిల్లాలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఒక మండలంలో కావాలని సూచించారు. పూర్తి స్థాయిలో డిజిటల్ కార్డు ఇవ్వడానికి సమయం పడుతుందని, అందుకే ముద్రించిన కార్డులు ఇస్తున్నామని తెలిపారు. ఇక వర్షాలు, అంటువ్యాధులు, వ్యవసాయం, రేషన్ కార్డులు, నీటిపారుదల విషయాల్లో ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు కూడా ఆయా జిల్లాల సమీక్షల్లో ప్రణాళికలు తయారు చేసుకుని కలెక్టర్లకు సూచనలివ్వాలని సీఎం అన్నారు. జాయింట్ కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, లేదా జిల్లా స్థాయి అధికారులకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బాధ్యత అప్పగించాలన్నారు.

ఎరువుల దారి మళ్లింపుపై నిఘా పెట్టండి..

రాష్ట్రంలో 20-25 శాతం ఎరువులు వ్యవసాయేతర అవసరాలకు మళ్లుతున్నట్టు గుర్తించామని కేంద్రమంత్రి జేపీ నడ్డా చెప్పిన విషయాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారు. ముఖ్యంగా డీజిల్ ద్వారా వచ్చే పొగను తగ్గించడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని చెప్పినట్టు తెలిపారు. కేంద్ర మంత్రి చెప్పేవరకు కూడా ఇది తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై కలెక్టర్లు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. అవసరమైతే మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో కూడా పోలీసులను అప్రమత్తం చేయాలన్నారు. వ్యాపారాలకు కొనుగోలు చేయాల్సిన కమర్షియల్ విధానంలో కాకుండా.. రాయితీలో వ్యవసాయానికి అందించే యూరియాను దారిమళ్లించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఏ స్థాయి వారైనా సరే కేసులు నమోదు చేయాలని, ఈ విషయంలో ఎవరినీ వదలవద్దని అన్నారు. ఎరువుల దుకాణాల్లో స్టాక్ ఎంత ఉంది, ఆరోజు ఎంత ఇవ్వగలుగుతారనే వివరాలతో దుకాణాల బయట బోర్డు పెట్టించాలన్నారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ఇద్దరు పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని పెట్టాలని ఆదేశించారు. ఎరువులు కచ్చితంగా అందుతాయని, ప్రభుత్వం ఇస్తుందనే విషయాన్ని రైతులకుచెప్పాలని సూచించారు. కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ఈ విషయంలో కలెక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటిని ఒడిసి పట్టుకోవాలి..

గత ఏడాది వర్షాల సమయంలో వ్యవస్థలు సరిగా లేకపోవడంతో విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నామని సీఎం తెలిపారు. ఇకపై నీటిని ఒడిసి పట్టుకొని జాగ్రత్తగా వినియోగించుకునేలా చేసే బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులతో పాటు కలెక్టర్లపైనా ఉందన్నారు. ప్రస్తుత సీజన్‌లో జూన్ 21 నుంచి జూలై 21 వరకు దాదాపు 21శాతం వర్షపాతం తక్కువ నమోదైందని, కానీ.. మూడు రోజులుగా వర్షం బాగా కురుస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలతో సమస్యలు తలెత్తుతున్నాయని, ట్రాఫిక్ జామ్‌లు, అంటువ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం హైడ్రా, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 300 చొప్పున బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈసారి వానలు బాగానే కురిసే అవకాశం..

రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ప్రాంతాల్లో వర్షం వస్తుందంటే కమిషనర్లతో సహా అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. దీనిని కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. ఈసారి వానలు బాగానే కురుస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. గోదావరి బేసిన్‌లో వరద కొంత తక్కువగా ఉన్నా.. కృష్ణాలో బాగానే ఉందని చెప్పారు. తెలంగాణ రైతులు వరి ఉత్పత్తిలో పోటీ పడుతున్నారని, గతేడాది దేశంలోనే అత్యధికంగా 2.85 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండించి మొదటి స్థానంలో నిలిచామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి నిర్వహణ చేయాలన్నారు. వివిధ జిల్లాల్లో నాట్లు వేసే దగ్గర్నుంచి నీటి నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎరువుల అవసరాన్ని కూడా అంచనా వేసుకుంటూ రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే వానలు, పిడుగుపడే సమయంలో ప్రజలు, మూగజీవాలు చనిపోకుండా ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు వర్షాలతో వచ్చే వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. వారికి రవాణా సౌకర్యాలు లేకపోవడం, వైద్యం సరిగా అందకపోవడం వల్లనే సమస్యలు వస్తున్నాయన్నారు. అందుకే పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో డాక్టర్లంతా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. పశువుల విషయంలో పశు సంవర్ధక శాఖను అప్రమత్తం చేయాలన్నారు.



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్, మంత్రులు, అధికారులు

కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే..

జిల్లాల కలెక్టర్లు ఉదయం 7 గంటలకు క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందేనని సమావేశంలో సీఎం సూచించారు. ఆస్పత్రులను విధిగా పర్యవేక్షించాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సీఎంవోలోని అధికారులకూ జిల్లాల బాధ్యతలు ఇస్తున్నామని, వీరు.. ఆయా కలెక్టర్లు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని అన్నారు. దీనిని సీఎస్ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆదివాసీలు, గిరిజనులు ఉండే అటవీ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో మందులు, డాక్టర్ల హాజరుపై దృష్టి సారించాలన్నారు. ఏదైనా అత్యవసరంగా ఖర్చు చేయాల్సి వస్తే.. కలెక్టర్లు తమ వద్ద ఉండే నిధులను వాడుకోవాలని, ఇంకా అవసరమైతే సీఎస్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ఖర్చు చేసేందుకు కలెక్టర్లకు పరిస్థితిని బట్టి.. రూ.కోటి వరకు వారి ఖాతాల్లో నగదు ఉండేలా చూడాలని సీఎస్‌ను ఆదేశించారు. చిన్న చిన్న అవసరాలకు కలెక్టర్లు నిధుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తెలుసుకోవాలని, దానిని వెంటనే రైతులకు తెలియజేయాలని అన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఆస్తి, ప్రాణనష్టం సంభవించినా.. అధికారులపై చర్యలుంటాయని అన్నారు.

కనీసం పదేళ్లయినా సీఎంగా రేవంత్..!

కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కనీసం పదేళ్లయినా రాష్ట్రానికి సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటారని, గరిష్ఠంగా ఎన్నేళ్లయినా ఉండొచ్చునని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో 31 జెడ్పీ సీట్లనూ కాంగ్రెస్ గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దొంగ సర్వేలతో అబద్ధాలు ప్రచారం చేస్తున్న హరీశ్‌రావు.. ముందుగా సొంత జిల్లా సిద్దిపేట జెడ్పీని గెలిపించుకోవాలన్నారు. చచ్చిన పాము లాంటి బీఆర్ఎస్‌కు ఎన్ని లేపనాలు పూసినా ఏ ఉపయోగం లేదన్నారు. సానుభూతి కోసం కేటీఆర్ ఆడుతున్న డ్రామాలను ప్రజలు నమ్మబోరని చెప్పారు. బీసీలంతా ఐక్యంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇద్దరు బీసీలు కొట్టుకుంటే.. ఆ పదవి అగ్రవర్ణాలకు పోయిందన్న విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌కు సవరణ చేసి రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.



జీనోమ్ వ్యాలీలో ఏటీసీ

» లైఫ్ సైన్సెస్, ఫార్మా బయో టెక్నాలజీలో ప్రత్యేక శిక్షణ

» యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

» ఏటీసీల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయండి: సీఎం

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులకు శిక్షణ అందించేందుకు జీనోమ్ వ్యాలీలో మోడల్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రం పని చేయాలని, అందులో ప్రత్యేక కోర్సులను బోధించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయించడంతోపాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటీఐ కళాశాలల్లో ఏటీసీలు ఏర్పాటు చేయాలని గతంలోనే సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించగా, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతలో 25, రెండో విడతలో 40, చివరి విడతలో 46 కేంద్రాలను నెలకొల్పనున్నామన్నారు. ఇప్పటిదాకా 49 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ మేరకు స్పందించిన సీఎం.. ఏటీసీల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా అన్ని కేంద్రాల పనులు పూర్తి చేయాలన్నారు. పనుల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. వీలైనంత త్వరగా పూర్తిగా చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. కాగా, ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఉపాధి పొందుతున్న గిగ్ వర్కర్ల కోసం సిద్ధమవుతున్న ప్రత్యేక పాలసీపైనా సీఎం సమీక్షించారు. పాలసీ వివరాలను అధికారులు వివరించగా.. సీఎం పలు సూచనలు చేశారు. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిగ్ వర్కర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలను కల్పించేలా పకడ్బందీగా కొత్త విధానం ఉండాలన్నారు.

బీసీ రిజర్వేషన్లకు నమూనాగా తెలంగాణ!

దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలంటూ ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న ఏఐసీసీ

» 24న ఢిల్లీకి రేవంత్.. రాహుల్‌తో భేటీ

» కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరనున్న సీఎం

» 25న ఓబీసీ సమ్మేళన్‌కు హాజరు కానున్న నేతలు

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఓబీసీలకు రిజర్వేషన్లను పెంచే విషయంలో తెలంగాణను ఏఐసీసీ నమూనాగా తీసుకోనుందా? ఈ నమూనా చూపుతూ ఉద్యమ కార్యాచరణను ఖరారు చేయాలని భావిస్తోందా? అంటే.. అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కులగణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అంశంపై తమ ఎంపీల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఏఐసీసీ భావిస్తోంది. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఆ బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. 24న డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో కలిసి ఢిల్లీకి వెళ్లనున్నారు. తొలుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో భేటీ అయి.. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన ఆవశ్యకత, రాష్ట్రంలో కులగణన జరిగిన తీరును వివరించనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయించిన సంగతిని ప్రస్తావించనున్నారు. అదే రోజు సాయంత్రం ఇందిరాభవన్‌లో జరగనున్న కాంగ్రెస్ ఎంపీల సమావేశంలో ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. రెండు బీసీ బిల్లులకూ ఆమోద ముద్ర వేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఎంపీలను కోరనున్నారు.

25న న్యాయ సమ్మేళన్‌లోనూ!

ఏఐసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో 25న ఢిల్లీలోని



ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న మహేశ్‌గౌడ్

తల్కటోరా స్టేడియంలో భాగేదారీ న్యాయ సమ్మేళన్ నిర్వహించనున్నారు. ఇందులో రాహుల్‌గాంధీ, ఖర్గేతో పాటు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, ఓబీసీ ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొననున్నారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, బీసీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇందులోనూ తెలంగాణలో చేపట్టిన కులగణన సర్వే, దాని ఆధారంగా ఓబీసీలకు 42 శాతం కల్పించాలంటూ బిల్లుల రూపకల్పన, అసెంబ్లీ ఆమోదం వంటి అంశాలను సీఎం వివరించనున్నారు. ఈ సమ్మేళన్ ద్వారా జనాభా ప్రాతిపదికన ఓబీసీలకు వాటా కల్పించాల్సిన ఆవశ్యకతపై రాహుల్‌గాంధీ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలను నమూనాగా చేసుకుని ఉద్యమ కార్యాచరణ ఖరారు చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ దొరికితే.. రాష్ట్ర మంత్రులు, ఎంపీలతో కలిసి వెళ్లి.. బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిందిగా కోరనున్నట్లు చెబుతున్నారు. 25న జరిగే భాగేదారీ సమ్మేళన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులందరూ పాల్గొనాలని, పేరు నమోదు చేసుకున్నా వారికే ప్రవేశం ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తెలిపారు. మరోవైపు.. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదంతో పంపిన బీసీ బిల్లులపై కేంద్రం పలు సందేహాలు లేవనెత్తగా.. రాష్ట్ర ప్రభుత్వం సుదీర్ఘ వివరణలు పంపినట్లు తెలిసింది. ఇదంతా సాధారణంగా జరిగేదని అధికారవర్గాలు చెప్పాయి. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఢిల్లీలోనే ఉంటున్న నేపథ్యంలో 25న జరగాల్సిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం వాయిదా పడింది.

రాజగోపాల్ వ్యాఖ్యలను అధిష్ఠానం పరిశీలిస్తోంది

నేతలు ఆచితూచి మాట్లాడాలి: మల్లు రవి

కులగణన, బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచే అంశంపై అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో 100 మంది కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి వెల్లడించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌పై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను అధిష్ఠానం పరిశీలిస్తోందని తెలిపారు. ఏ సందర్భంలో సీఎం అలాంటి వ్యాఖ్యలు చేశారో రాజగోపాల్‌కు తెలియదన్నారు. కాంగ్రెస్ ముఖ్య నేతలు ఆచితూచి మాట్లాడాలని, పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించకూడదని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో పాటు తెలంగాణ కాంగ్రెస్ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, వంశీకృష్ణ, తదితరులున్నారు.

ధరణి దరఖాస్తుల 'తిరస్కరణ' ఫీజు కోసం

అన్నదాతల పడిగాపులు

» రైతులు చెల్లించిన చలాన్ 110 కోట్లు

» రెండేళ్లుగా ప్రభుత్వ ఖజానాలోనే..

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ధరణి స్థానే గత ఏప్రిల్ 14 నుంచి అమల్లోకి వచ్చిన భూభారతి ద్వారా రైతులు సమస్యలు ఉచితంగానే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ధరణి కింద దాఖలు చేసిన దరఖాస్తుల్లో తిరస్కరణకు గురైన వాటితోపాటు చెల్లించిన చలాన్ నగదు వెనక్కి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇందుకోసం మండలం, జిల్లా కలెక్టర్, వ్యక్తిగత పని మీద హైదరాబాద్ వెళ్లిన వారు.. సీసీఎల్ఏ వరకూ వెళ్లి తిరస్కరణకు గురైన దరఖాస్తుల చలాన్ నగదు తిరిగి తమకు చెల్లించాలని కోరుతున్నారు. అలా తిరస్కరణకు గురైన దరఖాస్తులతోపాటు రైతులు చెల్లించిన రూ.110 కోట్లపై చిలుకు నగదు రెండేళ్లుగా ప్రభుత్వం వద్దే ఉందని రెవెన్యూ వర్గాల మాట. సకాలంలో దరఖాస్తులు పరిష్కరించకపోగా, తమ నగదు చెల్లించకుండా తిప్పుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్, నాలా, మ్యుటేషన్, తప్పుల సవరణ, పట్టాదార్ పాస్ పుస్తకం, మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణంలో సవరణలు తదితర సమస్యలపై రైతులు వివిధ మాడ్యూళ్ల కింద దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆయా మాడ్యూళ్లతో సంబంధం లేకుండా ఉన్నాయంటూ రైతుల దరఖాస్తులు తిరస్కరించిన అధికారులు.. వాటిల్లో లోపాలు చెప్పేవారు కాదన్న విమర్శలున్నాయి. ఇటీవల ఓ జిల్లా రైతులు కోర్టు ఉత్తర్వుల ద్వారా తమకు రావాల్సిన రూ.8. లక్షల నగదు వసూలు చేసుకోవడం రెవెన్యూ శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కానీ, చిన్న మొత్తం చలాన్ కట్టిన రైతులు కోర్టులకెళ్లలేక అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 2.45 లక్షల 'ధరణి' దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

హెచ్‌సీఏ ఎన్నికల్లో.. ఓట్లు వేసిన ఐఏఎస్, ఐపీఎస్‌లు!

» ఓటర్ల వివరాలను సేకరించిన సీఐడీ

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అక్రమాల కేసు దర్యాప్తులో సీఐడీ దూకుడు పెంచింది. హెచ్‌సీఏ అధ్యక్షుడి జగన్‌మోహన్ రావు ఎన్నికపై సీఐడీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. ఆయన ఎన్నికను అక్రమంగా గుర్తించింది. జగన్‌మోహన్ రావుకు ఓట్లు వేసిన వారిలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్న ట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఓటు వేసిన అధికారులను విచారించి, వాస్తవాలను తెలుసుకునేందుకు దర్యాప్తు సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల్లో 23 సంస్థలకు సంబంధించిన ఓట్లను జగన్‌మోహన్ అక్రమంగా వేయించుకున్నట్లు సీఐడీ గుర్తించింది. అక్రమ ఓట్లతోనే ఆయన అధ్యక్షుడిగా గెలిచినట్లు తేల్చింది. ఎన్నికలో ఓట్లు వేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు నిజానికి ఓటు హక్కు ఉందా? వారు ఏ అర్హతతో ఓటు వేశారు? అనే అంశాలపై అధికారులు దృష్టిసారించారు. వీరితోపాటు గత ఎన్నికల్లో ఓటు వేసిన వారందరికీ నోటీసులు జారీ చేసి, విచారించేందుకు సీఐడీ సన్నద్ధమవుతోంది. నిజానికి జగన్‌మోహన్‌రావుకు అన్ని ఓట్లు వచ్చాయా? లేక గోల్‌మాల్ జరిగిందా? అనే కోణంపైనా దృష్టి సారించింది. కాగా..ఈ కేసులో అరెస్టయిన జగన్‌మోహన్‌రావు, ఇతర నిందితులు ప్రస్తుతం సీఐడీ కస్టడీలో ఉన్నారు. మంగళవారంతో వీరి కస్టడీ ముగుస్తుంది. మంగళవారం వీరిని కోర్టులో హాజరుపరిచి, తిరిగి జైలుకు పంపించనున్నారు. కస్టడీలో నిందితుల నుంచి కీలక సమాచారాన్ని సీఐడీ రాబట్టినట్లు సమాచారం.

రోళ్లపాడులో కుటుంబం కుల బహిష్కరణ

» భూ కబ్జా పంచాయితీలో కుల పెద్దల దాష్టీకం

టేకులపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదం విషయంలో పంచాయితీ చేసిన కుల పెద్దలు గ్రామంలోని ఓ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రోళ్లపాడులో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పూనెం రామస్వామి, ఆయన భార్య వెంకటరమణను కులం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆదివారం రాత్రి గ్రామంలో చాటింపు వేశారు. దీంతో రామస్వామి, ఆయన భార్య వెంకటరమణ సోమవారం టేకులపల్లి పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలోని తమకు చెందిన ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూమిని కొడెం ముత్తయ్య, ఆయన కుమారులు మోహన్, సునీల్ దౌర్జన్యంగా ఆక్రమించుకుని వ్యవసాయ బోరు వేసుకున్నారని బాధితులు ఆరోపించారు. దీనిపై పంచాయితీలు జరుగుతుండగా.. పెద్దమనుషులు ముత్తయ్యకు వత్తాసు పలుకుతూ తమ కుటుంబాన్ని బహిష్కరించారని తెలిపారు. దీంతో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ సురేశ్, ఎస్ఐ రాజేందర్ రోళ్లపాడు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామంలో కుల బహిష్కరణలు చేయడం నేరమని, అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింగరేణి కాలరీస్ ఈడీగా వెంకన్న

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్)గా బి. వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు చెందిన ఆయనకు మూడేళ్లపాటు సింగరేణిలో డిప్యుటేషన్ మీద పని చేసేందుకు ఇటీవల క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదం తెలిపింది. బాధ్యతల స్వీకరణ అనంతరం వెంకన్న మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, సంస్థ లక్ష్యాల మేరకు బొగ్గు రవాణాకు శక్తి మేర కృషి చేస్తానని తెలిపారు.

ఖతర్ నుంచి తెలుగు పాస్టర్ల విడుదల

మత ప్రచారం అభియోగంపై 2నెలలు పోలీసుల అదుపులో..

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతర్ దేశంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా మతప్రచారం చేస్తున్నారనే అభియోగంపై పోలీసులు అదుపులోకి తీసుకున్న 9 మంది ప్రవాస క్రైస్తవ పాస్టర్లకు ఊరట లభించింది. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన వారు. దేశం విడిచి వెళ్లకుండా వీరిపై ఉన్న నిషేధాన్ని తొలగించడంతో వీరంతా ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్నారు. పశ్చిమ గోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాలకు చెందిన ఈ ముగ్గురూ క్రైస్తవ ప్రముఖులే. వీరిలో ఇద్దరు ఒక చర్చి వార్షికోత్సవ సభకు, మరొకరు వ్యక్తిగత పనిపై ఖతర్‌కు వచ్చి, ఒక చర్చికి వెళ్తుండగా పోలీసులు ఏప్రిల్ 27న అరెస్ట్ చేశారు. అనంతరం, జూలై 4న విడుదల చేశారు. కానీ దేశం విడిచి వెళ్లకుండా నిషేధం విధించారు. ఖతర్‌లోని సామాజిక సేవకుడు, కడప జిల్లా ప్రముఖుడైన మనీష్ రెడ్డి అరుణ్ వీరి కేసును భారతీయ ఎంబసీ సాయంతో పరిష్కరించారు. కాగా, తాము మత ప్రచారానికి రాలేదని, కేవలం చర్చి వార్షికోత్సవానికి వచ్చామని తెలుగు పాస్టర్లు తెలిపారు. విడుదల చేసినందుకు భారతీయ ఎంబసీకి, మనీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మావోయిస్టుల ఘాతుకం.. ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య

చర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఇన్‌ఫార్మర్లన్న నెపంతో ఇద్దరు గిరిజనులను మావోయిస్టులు హత్య చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా తెర్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చుట్యావి గ్రామానికి చెందిన కవ్వాసి జోగా (55), కుర్సం మంగు (50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూలాగే ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించారు. తెల్లవారు జామున వారి ఇళ్లలోకి ప్రవేశించిన నలుగురు మావోయిస్టులు ఇద్దరినీ కత్తులతో పొడిచి హత్య చేసి వెళ్లిపోయారు.

రూ.2 కే షర్టు.. సోషల్ మీడియాలో పోస్టు

» కొనేందుకు ఎగబడ్డ యువకులు, తోపులాట

నర్సాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఓ రెడిమేడ్ వస్త్ర దుకాణం ప్రారంభం సందర్భంగా రెండు రూపాయలకే షర్టు ఇస్తామని దుకాణ యజమాని సోషల్ మీడియాలో చేసిన పోస్టు తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో సోమవారం జరిగింది. వస్త్ర దుకాణ యజమాని చేసిన పోస్టు చూసిన యువకులు ఉదయం నుంచే ఆ దుకాణం వద్దకు వచ్చి బారులు తీరారు. దుకాణం తెరిచిన వెంటనే ఒక్కసారిగా అందరూ లోపలికి చొచ్చుకుని వెళ్లడంతో అక్కడ తొక్కిసలాటతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. నియంత్రించలేక దుకాణం యజమాని దుకాణం మూసేసి అక్కడి నుంచి జారుకున్నాడు. అక్కడ గుమిగూడిన యువకుల అల్లరితో పోలీసులు వచ్చి వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు.

సమాచార కమిషన్‌లో బీసీలు, ఎస్టీలకు చోటు లేదా?: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం కమిషన్‌లో బీసీలు, ఎస్టీలకు చోటు లేదా.. అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఇప్పటికే నియమించిన చీఫ్ కమిషనర్, నలుగురు కమిషనర్లలో ఒక్కరు కూడా బీసీలు, ఎస్టీలు లేరన్నారు. మరో ముగ్గురు కమిషనర్ల నియామకాలకు రూపొందించిన ప్రతిపాదనల్లోనూ బీసీలు, ఎస్టీలకు అవకాశం ఇవ్వలేదని తెలుస్తోందని ఆమె పేర్కొన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ చర్యలే రుజువు చేస్తున్నాయన్నారు.

ఎలా హామీ ఇచ్చారో.. అలా అమలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించే అధికారం తమకు ఉందని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిన విషయం కాంగ్రెస్ మంత్రులకు, న్యాయ సలహా దారులకు తెలియదా? అని ప్రశ్నించారు. తొమ్మిదో షెడ్యూల్‌ను చూపిస్తూ కేంద్రంపై నిందలు వేయకుండా, 42 శాతం రిజర్వేషన్ల హామీని ఏ విధంగా ఇచ్చారో ఆ విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వచ్చిన రాంచందర్‌రావు సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి న్యాయపరమైన చిక్కులను పరిష్కరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తమను నమ్మించిందని చెప్పారు. ఇప్పుడు కొత్తగా తొమ్మిదో షెడ్యూల్ ప్రస్తావన చేయడం అనేది ఎన్నికలు పెట్టకుండా ఉండటానికి వేస్తున్న నాటకంగా భావించాల్సి ఉంటుందని అన్నారు. ఈ విధంగా బీసీలను మోసం, దగా చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు ఇచ్చిన తర్వాత కేంద్రంపై నిందలు వేయడం అన్యాయమన్నారు. ఆర్డినెన్స్ రాక ముందే అందులో 10 శాతం ముస్లిం మైనారిటీలకు ఇస్తామంటున్నారని, దానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీసీ బిల్లుపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించినపుడు న్యాయ సలహా తీసుకున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. 42 శాతం అంటే, 50 శాతం పరిమితి దాటుతుందని, బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285ని సవరించాల్సి ఉంటుందని రాంచందర్‌రావు ప్రస్తావించారు. అవన్నీ వదిలేసి, కేంద్రంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లోనూ 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలయ్యాయని, వాళ్లు ఎలా చేశారో అధ్యయనం చేసి, ఆ దారిలో వెళ్లాలని సూచించారు. ఆర్డినెన్స్‌లో ఏం పొందుపరిచారో ప్రజలకు ఎందుకు తెలియజేయలేదు? అని ప్రశ్నించారు.

క్రమశిక్షణ చర్యలు తప్పవు

బీజేపీలో ఎవరైనా క్రమశిక్షణ తప్పినా, పార్టీకి నష్టం చేసేలా వ్యవహరించినా వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. బండి సంజయ్, ఈటల రాజేందర్ పరస్పరం చేసుకున్న వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. అది తమ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. అంతర్గతంగానే పరిష్కరించుకుంటామని చెప్పారు. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదన్నారు. రాత పూర్వకంగా ఫిర్యాదు వస్తే అధిష్ఠానం దృష్టి సారిస్తుందన్నారు. కాంగ్రెస్‌లో రేవంత్, రాజగోపాల్‌రెడ్డి మధ్య, బీఆర్‌ఎస్‌లో కేటీఆర్, కవిత మధ్య గొడవలు లేవా? అని ప్రశ్నించారు. బీజేపీలో కొత్త, పాత తేడాల్లేవని, కొంతమంది కావాలని చేస్తున్న ప్రచారమని కొట్టి పారేశారు. పార్టీ నేతలు నితిన్ గడ్కరీ, సునీల్ బన్సల్, అర్వింద్ మీనన్ కలిశానని, మంగళవారం పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కాబోతున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి 46 సార్లు ఢిల్లీకి వస్తే రాహుల్ గాంధీ ఒక్కసారి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, ఇది తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లేనని అన్నారు. రాష్ట్రంలో దారిమళ్లిన యూరియాపై సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ కంటే ఎక్కువ యూరియా కేంద్రం సరఫరా చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తిన్నారా? దళారుల పాలైందా? అని నిలదీశారు.



బండి సంజయ్‌తో మల్లారెడ్డి కోడలు లంచ్

» బీజేపీ నేత ఇంట్లో ప్రీతిరెడ్డి భోజనం.. బీజేపీ నేతల ఫ్లెక్సీలోనూ ప్రీతిరెడ్డి ఫొటో

» కమలం పార్టీలో చేరతారని ప్రచారం

హైదరాబాద్ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి.. కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కలిసి భోజనం చేశారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు, పాతబస్తీలోని మేకల బండ నల్లపోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ నివాసం ఇందుకు వేదికైంది. వెంకటరమణ ఆహ్వానం మేరకు నల్లపోచమ్మ దేవాలయంలో ప్రీతిరెడ్డి బంగారు బోనం సమర్పించారు. అయితే మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన ప్రీతిరెడ్డి.. సాయంత్రం బండి సంజయ్ ఆలయ దర్శనానికి వచ్చేంతవరకు అక్కడే ఉన్నారు. అనంతరం కేంద్రమంత్రి, పలువురితో కలిసి భోజనం చేశారు. అంతేకాదు.. బోనాల సందర్భంగా వెంకటరమణ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, నడ్డా, కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరరావుతో పాటు ప్రీతిరెడ్డి బోనం ఎత్తుకున్న ఫోటోను ముద్రించడం చర్చనీయాంశంగా మారింది. మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రీతిరెడ్డి.. బీజేపీలో చేరతారా! అన్న చర్చ మొదలైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎటువంటి రాజకీయ ప్రాధాన్యం లేదని ప్రీతిరెడ్డి అంటున్నారు. ఇది కాకతాళీయంగా జరిగిందేనన్నారు.

ఆంధ్రాలో ఎకరా అమ్మితే.. తెలంగాణలో రెండెకరాలు వస్తోంది!

18 నెలల్లోనే రాష్ట్ర పరిస్థితి తారుమారైంది

భూముల ధరలు దారుణంగా పడిపోయాయి

రేవంత్ పాలనలో ఓట్లప్పుడే రైతు బంధు: హరీశ్

గజ్వేల్/హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గతంలో తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రాలో పది ఎకరాలు వచ్చేదని, ఇప్పుడు ఆంధ్రాలో ఎకరం అమ్మితే ఇక్కడ రెండు ఎకరాలు వస్తోందని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. పద్దెనిమిది నెలల్లో తెలంగాణ పరిస్థితి తారుమారైందని, భూముల ధరలు దారుణంగా పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కార్లు, మోటారు సైకిళ్లను అప్పులోళ్లు గుంజుకుపోతున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో వరి నాట్లకు ముందు రైతు బంధు ఇస్తే... ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఓట్లకు ముందు మాత్రమే రైతుబంధు ఇస్తున్నాడని విమర్శించారు. డబ్బాలో ఓట్లు పడగానే.. రైతు బంధును ఎగ్గొడుతున్నాడని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వచ్చాక ఎరువుల కోసం చెప్పులు 'క్యూ'లో పెట్టి ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. రెండు లక్షల పింఛన్లు నిలిపివేశారని దుయ్యబట్టారు. హామీలను విస్మరించి.. పోలీస్ పహారాలో తిరుగుతున్న రేవంత్‌రెడ్డికి అశోక్‌నగర్ వెళ్లే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఓటర్ల వద్దకు వెళ్లి రేవంత్ చేస్తున్న మోసాలు, గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సిద్దిపేట, మెదక్‌లో మెజారిటీ ఎంపీటీసీ స్థానాలను గెలుచుకుంటామని, 16-18 జిల్లా పరిషత్‌లు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కల్లు దుకాణాలు బంద్ చేస్తే..ఊరుకోం

రాష్ట్రంలో కల్లు దుకాణాలను బంద్ చేస్తే కాంగ్రెస్ సర్కార్‌ను స్తంభింపజేస్తామని బీఆర్ఎస్ నేతలు వి.శ్రీనివాస్‌గౌడ్, బూడిద భిక్షమయ్యగౌడ్, పల్లె రవికుమార్‌గౌడ్ హెచ్చరించారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కల్లు గీత వృత్తిని బంద్ చేయాలని చూస్తోందని ఆరోపించారు. కులవృత్తులను నాశనం చేయాలని చూస్తే ఊరుకోమని, కేసీఆర్ సీఎం కాగానే మళ్లీ కల్లు దుకాణాలను తెరిపిస్తామని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి!

» రేవంత్ సర్కార్ మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లండి

» బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, నియోజకవర్గ స్థాయిలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ ఛైర్మన్లు, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తోన్న మోసాలతో పాటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పాటు రైతుబంధు ఇవ్వకుండా అన్నదాతలకు చేస్తోన్న ద్రోహాన్ని కూడా ప్రజలకు వివరించాలన్నారు. రేవంత్ పాలనలో గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం గురించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ పార్టీ వైఖరి గురించి ప్రజలకు విడమర్చి చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సుస్మిత అనే పేద విద్యార్థినికి ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డా.చంద్రశేఖర్, డా.ప్రణయవాణి దంపతులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు కేటీఆర్ వారిని అభినందించారు.

యాక్టివాలో నాగుపాము

» స్కూటీపై నుంచి దూకేసిన రైడర్

అంబర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై వెళ్తున్న ఓ రైడర్‌కు షాకింగ్ అనుభవం ఎదురైంది. అంబర్‌పేటలోని పటేల్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి సోమవారం ఉదయం యాక్టివా స్కూటీపై ఆజాద్‌నగర్ మీదుగా అలీకేఫ్ చౌరస్తా వైపునకు వెళ్తున్నాడు. ఆజాద్ నగర్ మదర్సా వద్దకు రాగానే అప్పటికే స్కూటీలో ఉన్న నాగుపాము ఆకస్మాత్తుగా అతడి చేతిపైకి ఎక్కింది. భయంతో వెంటనే స్కూటీని వదిలేసి కిందకు దూకేశాడు. అయితే, కిందపడిన పాము మళ్లీ యాక్టివాలోకి దూరింది. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. దాదాపు రెండు గంటల పాటు శ్రమించి, స్కూటీ భాగాలను విప్పి ఆ పామును సురక్షితంగా బయటకు తీశాడు. అదృష్టవశాత్తు, పాము కాటు వేయకపోవడంతో సదరు వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అనిల్ హత్య కేసులో ఐదుగురి అరెస్టు

పరారీలో ఇద్దరు.. పాతకక్షలు, ఆర్థిక వివాదాలతోనే హత్య

బిహార్ నుంచి తుపాకీ, తూటాలు కొన్న నిందితులు: మెదక్ ఎస్పీ

మెదక్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పైతర గ్రామానికి చెందిన యువ నాయకుడు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ హత్య కేసు దర్యాప్తులో పోలీసులు కీలక ముందడుగు వేశారు. హత్య ఘటనలో ఏడుగురికి ప్రమేయం ఉందని పోలీసులు భావిస్తున్నారు. నిందితుల్లో ఐదుగురిని అరెస్టు చేశారు. ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. గ్రామానికే చెందిన సోమన్నగారి రవీందర్‌రెడ్డి, అనిల్‌కు మధ్య విబేధాలే హత్యకు దారితీశాయని పోలీసులు ఓ అంచనాకొచ్చారు. మారెల్లి అనిల్ ఈ నెల 14న హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి వస్తుండగా, రాత్రి కొల్చారం మండలం వరిగుంతం గ్రామ శివారులో ఆయన్ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. సోమవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. అనిల్, గ్రామానికి చెందిన సోమన్నగారి రవీందర్‌రెడ్డి సతీమణి లక్ష్మికి రాజకీయ సహచరుడిగా చాలా ఏళ్లు పని చేశారు. కరోనా సమయంలో ఆమె అనారోగ్యంతో చనిపోయింది. ఆ తర్వాత రవీందర్‌రెడ్డి వద్ద అనిల్ పని చేశారు. అనిల్ కుటుంబం రవీందర్ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తోంది. మూడేళ్ల క్రితం అనిల్ అక్కడ సాగును నిలిపివేశారు. ఆ భూమిలో ఇతరులు సాగు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. పైగా తనకు మరొక మహిళతో వివాహేతర సంబంధం ఉందని అనిల్ ఊర్లో ప్రచారం చేస్తున్నారని ఆయనపై రవీందర్ రెడ్డి కోపం పెంచుకున్నాడు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నాగరాజుతో చర్చించాడు. నాగరాజు, అనిల్ ఒకప్పుడు స్నేహితులే. 2014లో నాగరాజు వార్డు సభ్యుడిగా ఉన్నప్పుడు ఇద్దరు రాజకీయ ప్రత్యర్థులుగా మారారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో నాగరాజు పోటీ చేయడానికి ఆసక్తి చూపగా.. అనిల్, ఆయన అనుచరులు అవమానించారు. నాగరాజు తల్లికి మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇంటిని కూడా అనిల్ రద్దు చేయించారని నాగరాజు కోపం పెంచుకున్నాడు. ఇక గ్రామానికి చెందిన నాగభూషణం నుంచి అనిల్ రూ.6 లక్షలు అప్పుగా తీసుకుని, తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారు. ఈ క్రమంలో రవీందర్, నాగరాజు, నాగభూషణం కలిసి అనిల్‌ను అంతం చేయాలని పథకం వేశారు. నాగరాజుకు మేడ్చల్‌లో వర్క్‌షాప్ ఉంది. అందులో మెకానిక్‌లుగా ఫరీద్, షాబొద్దీన్, చిన్నా పనిచేస్తున్నారు. ఫరీద్‌కు బిహార్‌కు చెందిన సచిన్ కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఉంది. గత నెల 26న ఫరీద్, సచిన్‌ను కలిసేందుకు విమానంలో పట్నా వెళ్లాడు. అక్కడ సచిన్ వద్ద నుంచి తుపాకీ, ఆరు రౌండ్ల బుల్లెట్లు కొనుగోలు చేసి తీసుకువచ్చాడు. ఈ నెల 14న అనిల్.. హైదరాబాద్‌కు వెళుతున్నారని తెలియడంతో అంతకుముందు రోజే నాగరాజు, షర్ఫొద్దీన్, చిన్నా కలిసి కౌడిపల్లికి వెళ్లి రెక్కీ నిర్వహించారు. మరుసటి రోజు హైదరాబాద్ వెళ్లిన అనిల్‌ను నాగరాజు అనుసరించాడు. మరో నిందితుడు అశోక్‌కు ఫోన్ చేసి గుమ్మడిదలకు కారు తీసుకురమ్మని చెప్పాడు. రాత్రి 7గంటల సమయంలో అనిల్ గుమ్మడిదల చెక్‌పోస్ట్ దాటి వెళ్తుండగా గమనించి అనుసరించారు. తన కారులో ఉన్న మిత్రులు శేఖర్, బాలేశ్‌ను కౌడిపల్లిలో దిగబెట్టి ఒంటరిగా వెళుతున్న అనిల్‌పై అప్పాజిపల్లి వద్ద దాడికి యత్నించే క్రమంలో పెట్రోలింగ్ వాహనం చూసి వెనక్కి తగ్గారు. వరిగుతం శివారు సబ్‌స్టేషన్ వద్ద అనిల్‌ను కారుతో అడ్డగించారు. షర్ఫొద్దీన్ కారులోంచి దిగి తన దగ్గర ఉన్న పిస్టల్‌తో నాలుగు రౌండ్ల కాల్పులు జరిపాడు. బులెట్ల గాయాలు కావడంతో కారు అదుపుతప్పి సబ్‌స్టేషన్ గేటును ఢీకొట్టింది. అనిల్ కారులోనే మృతిచెందాడు. అనంతరం నిందితులు పారిపోయారు. ఈ కేసులో రవీందర్, నాగభూషణం, నాగరాజు, ఫరీద్, అశోక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. షర్ఫొద్దీన్, చిన్నా కోసం వెతుకుతున్నారు.

మోస్తరు వర్షాలతో పంటలకు ఊపిరి

ఖమ్మం, నల్లగొండ సహా పలు జిల్లాల్లో వాన

పినపాకలో పిడుగుపాటుకు మహిళ మృతి

శ్రీశైలానికి 1.22 లక్షల క్యూసెక్కుల వరద

నేడు గేట్లు తెరిచి నీటిని విడుదల చేసే చాన్స్

568 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

నేడు, రేపు భారీ వర్షాలు: వాతావరణ కేంద్రం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు.. పత్తి, వరి పంటలకు ఊపిరి పోశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండు ముఖం పట్టాయి. వర్షాభావ పరిస్థితులతో ఆందోళన చెందుతున్న రైతులు.. తాజాగా కురిసిన వర్షాలతో ఊపిరి పీల్చుకుంటున్నారు. సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. ఖమ్మం నగరంలో వరద నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చింతకానిలో 6.2, మధిరలో 5, ఖమ్మం అర్బన్‌లో 4.8, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 4.7, బోనకల్లు మండలం రావినూతలలో, ముదిగొండలో 4.5సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడెం జిల్లా పినపాక మండలం బోటిగూడెంలో వరి నాట్లు వేస్తున్న సమయంలో పిడుగుపడడంతో మహిళా వ్యవసాయ కూలీ కొమరం రమణ(55) అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే పని చేస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలవగా.. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మధిర మండలం మల్లారంలో నల్లవాగు పొంగడంతో ఆరు పాడి గేదెలు గల్లంతయ్యాయి. అలాగే, నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో 10.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ శివారులోని రాజేంద్రనగర్ మైలార్‌దేవ్‌పల్లి, శివరాంపల్లి, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లిలో అత్యధికంగా 6.5, శివరాంపల్లిలో 5.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాగా, కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని జలాశయానికి 1500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. నీటి మట్టం 399.40 అడుగులకు చేరింది. కాగా, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టినా.. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.22 లక్షల ఇన్‌ఫ్లో వస్తోంది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో 67,551 క్యూసెక్కులను వినియోగిస్తుండగా, పోతిరెడ్డిపాడుకు 20 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.18 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 206.97 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో మంగళవారం మరోసారి గేట్లు తెరిచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మరోవైపు.. జూరాలకు 72వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, 8 గేట్లు ఎత్తి 31,464 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరోవైపు.. నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి 67,551 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 568.30 అడుగుల(252.3 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉంది. గోదావరి పరివాహకంలో మేడిగడ్డ బ్యారేజీ వద్ద 1.23 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కాగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో మంగళ, బుధ వారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.